ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 23.02.2026 | సంపుటి :12 సంచిక : 215 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## 1.70 కోట్ల ఓటర్ల తొలగింపు

- తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' జాబితా విడుదల
- అత్యధికంగా గుజరాత్.. అత్యల్పంగా కేరళ
- తమిళనాడు, బంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంకా పూర్తిగా విడుదలకాని జాబితా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 1.70 కోట్లకుపైగా ఓటర్లను ఈసీ తొలగించింది. గతేడాది అక్టోబరులో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముసుపు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 21.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ప్రచురించిన తుది ఓటరు జాబితాలో ఓటర్ల సంఖ్య 19.75

మిగతా 2లో..

## రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులను

# పూర్తిచేస్తాం

### గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుంది

నీటి విషయంలో రాజకీయాలొద్దు • ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం

### మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయం

మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తాం • ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా పోనివ్వం

"గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టీఎంసీలను వినియోగం లోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జాలల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుకే అధిక నిధులు కేటాయించడం వల్ల మిగిలిన వాటికి నిధులు ఇవ్వడానికి వెతుక్కునే పరిస్థితి వచ్చింది. రాబోవు రెండేళ్లలో ఈ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చాం. అన్ని ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో సమీక్ష చేసి పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తాం"
- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**ములుగు(జనంసాక్షి):** గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయ రంగు పులుముకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై ఆయన పలు విమర్శ లు గుప్పించారు. వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టు లన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని



రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా వాటికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ. 6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు ఇవాళ రూ.18 వేలకోట్ల నిధులు అవసరమైన స్థితికి చేరుకుందన్నారు. అన్ని ప్రాజెక్టులపై సమీక్ష చేసి పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నారు. మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు

మిగతా 2లో..

### హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నుంచి రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం

ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని నిర్వాహకుల వినతి

వార్త 2 లో

## అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు



### మల్లా రాజిరెడ్డి, నర్సింహారెడ్డిలతోపాటు 20 మంది మావోయిస్టులు కూడా..

నేడో,రేపో డీజీపీ ఎదుట లొంగిపోయే అవకాశం


**హైదరాబాద్(జనంసాక్షి):** మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నతోపాటు సుమారు 20 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సమాచారం. ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసుల ఎదుట వారు లొంగిపోయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. దేవ్‌జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

## భారత్-అమెరికా చర్చలు రీషెడ్యూల్

సుప్రీం తీర్పుతో మారిన సమీకరణాలు

### ఈ మేరకు సోమవారం జరగాల్సిన చర్చలు వాయిదా!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు సోమవారం జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డట్లు సమాచారం. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ఫిబ్రవరి 23 నుంచి 3 రోజుల పాటు వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉంది. కాగా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలోనే ఈ చర్చలను రీషెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీలలో ఈ చర్చలను తిరిగి నిర్వహించనున్నట్లు విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రక



టనను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. టారిఫ్‌లు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని

మిగతా 2లో..

## పేదల ఇళ్లు కూల్చి బడా బాబులకు భూములు కట్టబెట్టే కుట్ర

మూసీ సుందరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారు:హరీశ్‌రావు


**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ సుందరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం వేసే ప్రతి అడుగు వెనుకా భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందన్నారు. "పేదల ఇళ్లు



కూల్చి బడాబాబులకు భూములు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. కేసీఆర్ మంచినీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే.. రేవంత్‌రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారు. డీపీఆర్ లేదు.. ఎఫ్‌టీఎల్ తేలలేదు.. అనుమతులు లేవు. ఏ చట్టం ప్రకారం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నారు? మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పేదల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తాం"అని హరీశ్‌రావు అన్నారు.

## మన టెక్నాలజీ ప్రపంచ దేశాలను ఆకర్షించింది

- భారత ప్రతిభను చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి
- ఏఐ సమ్మిట్ విజయవంతంపై 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.. వాటిని ట్రాక్ చేయడానికి ఏఐను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరి

మిగతా 2లో..

### ఏఐ సమిట్‌నూ కాంగ్రెస్ వదల్లేదు

అక్కడ ఆ పార్టీ కార్యకర్తలు మురికి రాజకీయాలు చేశారు:ప్రధాని మోదీ

2లో..

### అత్యంత వేగవంతమైన మెట్రోను ప్రారంభించిన మోదీ

## ఎన్నికల వరకే రాజకీయం

### గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేయాల్సిందే:పొంగులేటి

**ఖమ్మం(జనంసాక్షి):** ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరఫున పేదవాడికి సేవ చేయాల్సిందేనని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో పుర ఛైర్‌పర్సన్‌గా ఎంపికైన పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార కార్యక్రమానికి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నమ్మి ఓటేశారని, కుర్చీలకే పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కొత్త పాలకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని వివరించారు. ఛైర్మన్, కౌన్సిలర్లు రోజూ ఉదయం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రతిదీ డబ్బుతోనే జరగదని, మన పనితీరు ఆధారంగా



అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. 15 రోజుల్లో మరో సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి ప్రగతి పనులు చేపట్టాలనే అంశంపై చర్చిస్తామని వివరించారు. ప్రజా జీవితంలో మనకు ఇచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, వార్డు కౌన్సిలర్లను సన్మానించారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ భైరు హరినాథ్‌బాబు, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ మున్వర్ అలీ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు | పలువురి మృతి

9లో..



## మృత్యు దిబ్బ

### నాలుగేళ్ల రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 4 లక్షలమందిపైగా సైనికులు మృతి

**కీవ్(జనంసాక్షి):** రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఎంతకూ తెగడం లేదు. అమెరికా మధ్యవర్తిత్వంలో కొంతకాలంగా చర్చలు కొనసాగుతు న్నప్పటికీ.. ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో పురోగతి లభించడం లేదు. డాన్‌బాస్‌ను తమకే వదిలేయాలని మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని కీవ్ స్పష్టం చేస్తోంది. యుద్ధం మొదలై ఈ నెల 24కు నాలుగేళ్లు పూర్తవుతున్న వేళ కొన్ని కీలక అంశాలను గమనిస్తే..రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ జర్మనీని ఓడించేందుకు నాటి సోవియట్ యూనియన్ 'గ్రేట్ పేట్రియాటిక్ వార్'లో భాగంగా 1,418 రోజులు పోరాడింది. ఇప్పుడు రష్యా దండయాత్ర ప్రారంభమై.. ఈ ఏడాది జనవరిలోనే 1, 418 రోజులు దాటేసింది. మొదట్లో కీవ్‌ను స్వాధీనం చేసుకుని అనుకూల సర్కారును నియమించేందుకు మాస్కో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ ఫలితం ఎటూ తేలడం లేదు. 2014లో ఆక్రమించిన క్రిమియా సహా 20 శాతం ఉక్రెయిన్ భూభాగం ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉంది. ప్రత్యర్థి భూభాగంలో చొచ్చుకెళ్లే విషయంలో మాస్కోకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. గత రెండేళ్లలో దొనెట్స్క్ ప్రాంతంలోకి దాదాపు 50 కి.మీ మాత్రమే వెళ్లగలిగింది. పోక్రోవ్స్క్ నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు గత రెండేళ్లుగా రోజుకు సగటున 70 మీటర్ల చొప్పున ముందుకు సాగుతోంది. రష్యా పురోగతి నత్తనడకలా ఉందని నాటో చీఫ్ మార్క్ రుత్తే ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరువైపులా మృతి చెందిన, గాయపడిన, కనిపించకుండా పోయిన సైనికుల సంఖ్య సుమారు 20 లక్షలుగా ఉంటుందని అంచనా. అమెరికాకు చెందిన 'సెంటర్ ఫర్ స్ట్రాటెజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' మాత్రం ఈ సంఖ్య 18 లక్షలుగా

మిగతా 2లో..

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్



**హైదరాబాద్(జనంసాక్షి):** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు రామచందర్‌రావు యత్నించగా.. పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆ తర్వాత కూడా ఆయన బయల్దేరడంతో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు

మిగతా 2లో..

### ప్రశ్నిస్తే దాడులా?

కేంద్రమంత్రి బండి సంజయ్

2లో..



## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మిలిటెంట్ల మృతి

**శ్రీనగర్(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వారికి జైషే మహమ్మద్‌తో సంబంధం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. భద్రతా ఏజెన్సీల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుల్లో ఒకరిని జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లాగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘావర్గాల సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు కిష్త్వాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలోనే చత్రూ బెల్ట్‌లోని

మిగతా 2లో..

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో సోదాలు

**మందమర్రి (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాల్క సుమన్ ఇంటి ముందు మాజీ కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్కేపీ ఎస్సై శ్రీధర్, ముగ్గురు పోలీసులు



అక్కడికి చేరుకున్నారు. ఇంటికి వేసిన తాళం తీయించి అన్ని గదుల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. అనంతరం ఇద్దరి వద్ద ఉన్న చరవాణులు తీసుకెళ్లి కొంతసేపటి తర్వాత తిరిగిచ్చేశారు.

మిగతా 2లో..

## అత్యధిక జనాభా కలిగినప్పటికీ విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దురదృష్టకరం

వార్త 2 లో

ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడా

# మృత్యు దిబ్బ

ఉందని పేర్కొంది. రష్యా సైనికులు 3.25 లక్షల మంది, ఉక్రెయిన్ సైనికులు 1.40 లక్షల మంది మృతి చెందినట్లు తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అత్యంత వినాశకరమైన యుద్ధం ఇదే.

**దాడుల్లో డ్రోన్లదే కీలక పాత్ర..!**

యుద్ధాల విషయంలో చరిత్రలో తొలిసారి డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా రష్యా రోజూ వందలాది డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్ నుంచి తప్పించుకునేందుకు ఫైబర్ ఆప్టిక్ డ్రోన్లను వదులుతోంది. మరోవైపు.. ఉక్రెయిన్ సైతం వీటినే నమ్ముకుంది. గతంలో 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్' పేరిట ప్రత్యర్థి వైమానిక స్థావరాలపై విరుచుకుపడింది. సీ-డ్రోన్లతో అనేక రష్యన్ యుద్ధనౌకలను ముంచేసింది. నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మధ్యవర్తిత్వంలో ఇరుదేశాల ప్రతినిధులు ఇప్పటికే రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ ఏడాది జూన్‌లోగా యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ అగ్రరాజ్యం డెడ్‌లైన్ విధించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల వెల్లడించారు. ఒకవేళ గడువులోగా లక్ష్యం నెరవేరకపోతే.. దాన్ని సాధించేందుకు ట్రంప్ యంత్రాంగం ఇరుపక్షాలపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉందని చెప్పారు.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

పాసెర్‌కుట్ ప్రాంతంలోని ఓ గుడిసెలో ఉగ్రవాదుల ఆచూకీని గుర్తించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో మృతదేహాలు కాలిపోయాయి. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కరడుగట్టిన ఉగ్రవాది సైఫుల్లా దాదాపు ఐదేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు సమాచారం. అప్పటినుంచి స్థానికంగా యాక్టివ్‌గా ఉన్నాడు. 2024 జులైలో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడి సహా అనేక ఘటనలకు సూత్రధారి అనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనేక ఎన్‌కౌంటర్‌ల నుంచి తప్పించుకున్నాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు.

## ట్రంప్ ఎస్టేట్‌లోకి దుండగుడి చొరబాటు..

### కాల్చివేసిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

**న్యూయార్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఫ్లోరిడాలో ఉన్న ఆయన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడటం కలకలం రేపింది. దీంతో వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడిని హతమార్చారు. ఈ ఘటన సమయంలో ట్రంప్ దంపతులు వైట్‌హౌస్‌లోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫ్లోరిడా పామ్ బీచ్‌లో ఉన్న 'మార్ ఎ లాగో' ఎస్టేట్‌కు అధ్యక్షుడు ట్రంప్ వారాంతంలో వస్తుంటారు. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఎస్టేట్ నార్త్ గేట్ నుంచి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతోపాటు ఇంధనం క్యాన్ ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై మట్టుబెట్టినట్లు సీఐఏతోపాటు పామ్ బీచ్ పోలీసులు వెల్లడించారు. అతడి వయసు 20 నుంచి 25 మధ్య ఉండవచ్చని.. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హత్యకు గతంలోనూ ప్రయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఆ ఘటనలో మరణం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అనంతరం కొన్ని నెలలకు.. పామ్ బీచ్ గోల్ఫ్ కోర్సులో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

## ఈ 32 యూనివర్సిటీలు ఫేక్..

- ఆ డిగ్రీలు చెల్లవ్!
- వివరాలు వెల్లడించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్

**న్యూఢిల్లీ:**దేశంలో నకిలీ విశ్వవిద్యాలయాల సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం గతేడాది అక్టోబర్ నాటికి దేశ వ్యాప్తంగా 22 ఫేక్ యూనివర్సిటీలు ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 32కి చేరడం గమనార్హం. ఇంటర్నెట్ డెస్క్: దేశంలో నకిలీ విశ్వవిద్యాలయాల సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. గతేడాది అక్టోబర్ నాటికి దేశ వ్యాప్తంగా 22 ఫేక్ యూనివర్సిటీలు ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 32కి చేరడం గమనార్హం. యూనివర్సిటీల్లో చేరాలనుకొనే విద్యార్థుల అవసరాన్ని, అమాయకత్వాన్ని సొమ్ము చేసుకొనేందుకు నకిలీ వర్సిటీలు పుట్టుకు రావడం ఆందోళన కలిగిస్తోంది. అడ్మిషన్ల సీజన్ నేపథ్యంలో యూజీసీ వెల్లడించిన జాబితా ప్రకారం దేశంలో ఫిబ్రవరి నాటికి 32 నకిలీ యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా దేశ రాజధాని నగరం దిల్లీలోనే 12 నకిలీ వర్సిటీలు ఉండగా.. యూపీ (4), ఏపీ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌లో రెండేసి చొప్పున.. రాజస్థాన్, ఝార్ఖండ్, హరియాణా, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కొక్కటి ఉన్నాయి.

ఐఐటీ మద్రాస్ 'సమ్మర్ ఫెలోషిప్' ప్రోగ్రామ్.. స్టైపెండ్ ఎంతో తెలుసా?

నకిలీ యూనివర్సిటీల మాయలో పడితే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. కేవలం డబ్బు మాత్రమే కాదు.. సమయం, భవిష్యత్తు నాశనమవుతుంది. ఈ నేపథ్యంలో నకిలీ యూనివర్సిటీలనుగుర్తించి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు యూజీసీ విజ్ఞప్తి చేసింది. నిజమైన యూనివర్సిటీలు ఏవైనా సరే యూజీసీ లేదా ఏఐసీటీఈ నుంచి గుర్తింపు పొంది ఉండాలి. ఆ విద్యా సంస్థలకు మాత్రమే విద్యార్థులకు డిగ్రీలు మంజూరు చేసే అధికారం ఉంది. నకిలీ విశ్వవిద్యాలయాలు జారీ చేసే డిగ్రీలకు ఏమాత్రం చట్టబద్ధత ఉండదు. ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ సర్వీసులు, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఇవి చెల్లుబాటు కావు. అందువల్ల మీరు చదవాలనుకొంటున్న యూనివర్సిటీ గురించి తెలుసుకొనేందుకు కొంచెం సమయం కేటాయించి అధ్యయనం చేయండి. బాగా స్టడీ చేశాకే మీకు అన్ని విధాలా నప్పే వర్సిటీని ఎంపిక చేసుకోవడం తెలివైన పని.

ఫేక్ యూనివర్సిటీలను గుర్తించడం ఎలా?

విద్యార్థుల్ని ఆకర్షించడమే లక్ష్యంగా నకిలీ వర్సిటీల ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. తమ వర్సిటీ/విద్యా సంస్థలో చేరాలంటూ పదే పదే వెంటపడి వేధిస్తే సందేహించాల్సిందే! సాధారణ సమయం కన్నా తక్కువ వ్యవధిలోనే కోర్సుల్ని పూర్తి చేయిస్తామని చెబుతుండటం తక్కువ ఫీజులతో కోర్సుల్ని అందించడంతో పాటు, ప్లేస్‌మెంట్ హామీలు గుప్పిస్తుండటం యూనివర్సిటీలో సిబ్బంది, అందించే కోర్సుల గురించి స్పష్టమైన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచకపోవడం వంటి అసాధారణ లక్షణాలను గమనిస్తే అప్రమత్తంగా ఉండటమే మేలు మీరు చేరాలనుకొనే వర్సిటీ విశ్వసనీయతను తెలుసుకొనేందుకు ఆ కాలేజీలో చదివిన, చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి ఒక నిర్ణయానికి రావడం ఉత్తమం. యూజీసీ అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు సందర్శించి అప్‌డేట్స్ చెక్ చేసుకోండి. నకిలీ యూనివర్సిటీలు చాలా వరకు క్యాంపస్ లేకుండా ఆన్‌లైన్‌లోనే పనిచేస్తుంటాయి. నిజమైన వర్సిటీలకైతే భవనాలు, ల్యాబ్‌లు, లైబ్రరీలు ఉంటాయి. అందువల్ల మీరు చేరాలనుకొనే విద్యాసంస్థ క్యాంపస్‌ని ఒకసారి సందర్శించడం మేలు. తక్కువ ఫీజులకే కోర్సులంటే తొందరపడి చేరిపోవద్దు. దానిపై కాస్త అధ్యయనం చేయండి. సామాజిక మాధ్యమాల్లో సంబంధిత వర్సిటీల రివ్యూలనూ చూడండి.





# రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

చేశారని ప్రజలు గ్రహించారని, తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. ప్రతిపక్షం వారు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నా మనేది పూర్తిగా అసంబద్ధమని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దామని ప్రజలు, నీళ్ల విషయంలో కాదని ఆయన హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బీఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. ఆ పార్టీని మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పనట్లుగా వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు. సీఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

## హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నుంచి రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం

### ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని నిర్వాహకుల వినతి

హైదరాబాద్(జనంసాక్షి):హార్వర్డ్ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అరుదైన ఆహ్వానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ అరుదైన ఆహ్వానం అందింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపించారు. ఈ ఏడాది మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లోనే ఈ కార్యక్రమం జరగనుంది. భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ సింపోజియం ఆహ్వానం అందుకోవటం విశేషం. ఈ సింపోజియంలో ప్యానెల్‌లో ప్రసంగించాలని సీఎంను ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఏఐ ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనుస రిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించాలని సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇటీవల అమెరికా పర్యటనలో నిర్వాహకులు సీఎంను ప్రత్యేకంగా కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమియా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఏఐ పాలన, జియోపాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనేబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## భారత్-అమెరికా చర్చలు రీషెడ్యూల్..!

15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మున్ముందూ చట్టబద్ధమైన టారిఫ్‌లను జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంతో భారత్ చేసుకొన్న ట్రేడ్‌డీల్‌లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

## అత్యధిక జనాభా కలిగినప్పటికీ విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దురదృష్టకరం

### ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడా

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. భారత్ ప్రపంచ దేశాలకు ప్రతిభను అందించే కేంద్రంగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. సొంతంగా గ్లోబల్ టెక్నాలజీ ఉత్పత్తులను సృష్టించలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ పిట్రోడా భారత సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 150 కోట్ల జనాభా కలిగిన దేశం ఇప్పటికీ విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దురదృష్టకరమని అన్నారు. 'మనం భారీ స్థాయిలో యువ ప్రతిభను సృష్టించాం, కానీ అది ఇంకా 'ముడి' రూపంలోనే ఉంది. ఈ ప్రతిభ అంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి కంపెనీలకు ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయ వ్యవస్థలు, తయారీ, లాజిస్టిక్స్ రంగాల్లో సేవ చేయడానికి ఉపయోగపడుతోంది. మనం మన సొంత ప్రతిభను ఇత రులకు సేవ చేయడానికి ధారపోస్తున్నాం' అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పిట్రోడా మరికొన్ని ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీని గానీ, ప్రపంచ స్థాయి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను గానీ సృష్టించలేదని చెప్పుకొచ్చారు. కనీసం మొబైల్ ఫోన్ల కోసం ఒక ఆపరేటింగ్ సిస్టమ్‌ను కూడా తయారు చేయలేకపోయామన్నారు. ఇంత పెద్ద దేశానికి సొంత ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం నిజంగా సిగ్గుచేటని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**పిట్రోడాకు బీజేపీ కౌంటర్**

పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియా వేదికగా పిట్రోడా వ్యాఖ్యలకు ఖండించారు. దేశంలో తయారైన పలు ఆపరేటింగ్ సిస్టమ్‌ల పేర్లను ఆయన ప్రస్తావించారు. 'ముందుగా వాస్తవాలు తెలుసుకోండి. భారత్ వద్ద లినక్స్, మాయ ఓఎస్, ప్రైమ్‌ఓఎస్, భార్‌ఓఎస్, ఇండస్ ఓఎస్, వంటి స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఉన్నాయి. అబద్ధాలతో భారత్‌ను కించపరచడమే కాంగ్రెస్ పని' అని ఆయన మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అయిన యూపీఐని భారత్ సృష్టించిందని, అది నేడు అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. గ్లోబల్ టెక్నాలజీ రంగంలో భారత్ ఇప్పుడు 'నాయకత్వ' పాత్రకు చేరుకుందన్నారు. కరోనా కాలంలో భారత్ స్వదేశీ వ్యాక్సిన్లను తయారు చేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేసిందని, రక్షణ రంగంలో కూడా 'మేక్ ఇన్ ఇండియా' వేగంగా పుంజుకుంటోందని చెప్పారు.

వివాదాలకు కేరాఫ్ అడ్రస్ పిట్రోడా

సామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గత రెండు ఏళ్లలో ఆయన చేసిన పలు కామెంట్స్ కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేశాయి. భారతదేశ వైవిధ్యాన్ని వివరిస్తూ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీశాయి. తూర్పు భారతీయులు చైనీయుల్లా, పశ్చిమ భారతీయులు అరబ్బుల్లా, ఉత్తరాది వారు తెల్లజాతి వారిలా, దక్షిణాది వారు ఆఫ్రికన్లలా కనిపిస్తారని ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపాయి. దీనిపై ప్రధాని మోదీ స్వయంగా స్పందిస్తూ, ఇది దేశ ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. ఫలితంగా పిట్రోడా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. పాకిస్థాన్‌తో సంబంధాల విషయంలోనూ ఆయన అన్న మాటలు వివాదాస్పదంగా మారాయి. పొరుగు దేశాలతో, ముఖ్యంగా పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని పిట్రోడా సూచించారు.

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్

నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, భాజపా కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పలువురు భాజపా కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ప్రశ్నిస్తే దాడులా?

### కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్(జనంసాక్షి): ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేంటని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయి. ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయి. భాజపా కార్యకర్తలారా.. వీటిని అడ్డుకునేందుకు సిద్ధంకండి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన సంఘటనలను గుర్తుంచుకోండి. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు చట్టాన్ని చేతుల్లో తీసుకోవడం దుర్మార్గం. కామారెడ్డిలో భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై దాడి అమానుషం. అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే. బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలేవీ? బాన్సువాడ వెళ్లేందుకు యత్నించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయం. ఎంఐఎంను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది" అని బండి సంజయ్ అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో సోదాలు!

ఈ విషయమై ఎస్పై శ్రీధర్‌ను వివరణ కోరగా ఎలాంటి సోదాలు నిర్వహించలేదన్నారు. మంత్రి కాన్వాయ్ మీద జరిగిన దాడికి సంబంధించి కేసులో నిందితులుగా ఉన్న వారు అక్కడ ఉన్నారని సమాచారం అందడంతో వెళ్లామన్నారు.

## గేట్ ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదల..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదలైంది. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదలైంది. ఈ కీతో పాటు రెస్పాన్స్ షీట్లు, మాస్టర్ క్వశ్చన్ పేపర్లను ఐఐటీ గువాహటి అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ, పాస్‌వర్డ్, తదితర వివరాలను ఎంటర్ చేసి ఆన్సర్ కీ, క్వశ్చన్‌పేపర్, రెస్పాన్స్ షీట్‌లను పొందొచ్చు. దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో గేట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలను మార్చి 19న విడుదల చేయనున్నట్లు అధికారులు షెడ్యూల్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## మన టెక్నాలజీ ప్రపంచ దేశాలను ఆకర్షించింది

జ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవం తంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణ లతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలను తీసు కువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు. ఈ సదస్సు ద్వారా వివిధ దేశాల నేతలకు, టెక్ దిగ్గజాలకు మన యువత ప్రతిభను, నూతన ఆవిష్కరణలను స్వయం గా చూపించే అవకాశం లభించిందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టు కొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలని దేశంలోని తయారీదారులు, స్టార్టప్‌లకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రధాని మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఆ చిన్నారి నలుగురికి జీవనదాత

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్‌ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ చిన్నారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె తల్లిదండ్రులను ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆ చిన్నారి నలుగురికి జీవనదాతగా మారిందన్నారు. ఇటువంటి ఘటనల వల్ల దేశంలో అవయవ దానంపై అవగాహన పెరుగుతోందన్నారు.

## ఏఐ సమిట్‌నూ కాంగ్రెస్ వదల్లేదు

మేరఠ్(జనంసాక్షి): దిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ఏఐ సమిట్‌ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాల కంటే వారు వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని.. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

అసలేం జరిగింది..?

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు-5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీ-షర్ట్‌లు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యల వల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకున్నారు.

## అత్యంత వేగవంతమైన మెట్రోను ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రోను ప్రధాని మోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ప్రారంభించారు. అనంతరం యూపీ సీఎం ఆదిత్యనాథ్‌తో కలిసి శతాబ్ది నగర్ నుంచి మేరఠ్ సౌత్ స్టేషన్‌కు మెట్రోలో ప్రయాణించారు. దీని గరిష్ఠ వేగం గంటకు 120 కిలోమీటర్లుగా అధికారులు వెల్లడించారు. మేరఠ్ దక్షిణ స్టేషన్ నుంచి మోదీపురం డిపో వరకు ఉన్న 23 కి.మీ దూరాన్ని ఇది కేవలం 30 నిమిషాల్లోపే చేరుకుంటుంది. సాయంత్రం 6 గంటలకు ప్రజలకు మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నమో భారత్ రైల్‌ను సైతం ప్రారంభించారు. ఈ రైలు దిల్లీ నుంచి మేరఠ్ మధ్య గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించనుంది. దీని గరిష్ఠ వేగం గంటకు 180 కిలోమీటర్లు వీటితో పాటుగా రూ.12,390 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు.



## 70కోట్ల ఓటర్ల తొలగింపు

కోట్లకు తగ్గింది. అంటే ఓటర్ల సంఖ్యలో 7.93శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గోవా, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్‌కు చెందిన తుది ఓటరు జాబితాలను ఈసీ గతవారం విడుదల చేసింది. వాటిని విశ్లేషించగా ఈ గణాంకాలు బయటపడ్డాయి. ఓటరు జాబితాల నుంచి అనర్హులను తొలగించాలన్న లక్ష్యంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఈసీ శ్రీకారం చుట్టింది. తొలుత బిహార్‌లో ఈ ప్రక్రియను చేపట్టింది. ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ కొనసాగుతోంది.

గుజరాత్‌లో అత్యధికం- కేరళలో అత్యల్పం

ఇక అత్యధిక తగ్గుదల గుజరాత్ రాష్ట్రంలో ఉంది. ఓటర్ల జాబితాలో నుంచి 68.12 లక్షల పేర్లు తొలగించారు. దీంతో అక్కడ ఓటర్ల సంఖ్య 5.08 కోట్ల నుంచి 4.40 కోట్లకు చేరుకుంది. అంటే 13.4 శాతం తగ్గింది. మధ్యప్రదేశ్‌లో ఓటర్ల జాబితా నుంచి 34.35 లక్షల పేర్లు తొలగించారు. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 5.74 కోట్ల నుంచి 5.39 కోట్లకు చేరింది. అంటే 5.96శాతం తగ్గుదల నమోదైంది. రాజస్థాన్‌లో 31.36 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 5.46 కోట్ల నుంచి 5.15 కోట్లకు చేరింది. అంటే 5.74శాతం తగ్గుదల నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌లో ఓటర్ల జాబితా నుంచి 24.99 లక్షల పేర్లను తొలగించారు. ఓటర్ల సంఖ్య 2.12 కోట్ల నుంచి 1.87 కోట్లకు చేరుకుంది. 11.77 శాతం తగ్గుదల నమోదైంది. కేరళలో అత్యల్పంగా పేర్లును తొలగించారు. ఓటర్ల జాబితా నుంచి 8.97 లక్షల పేర్లు తొలగించారు. 3.22 శాతం తగ్గుదల నమోదై ఓటర్ల సంఖ్య 2.78 కోట్ల నుంచి 2.69 కోట్లకు చేరింది. గోవాలో 1.27 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారు. అంటే 10.7శాతం తగ్గుదల నమోదైంది.

కేంద్రపాలిత ప్రాంతాలు

అండమాన్ అండ్ నికోబార్‌లో అత్యధిక శాతం తగ్గుదల నమోదైంది. 52,364 పేర్లు తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3.10 లక్షల నుంచి 2.58 లక్షలకు చేరుకుంది. అంటే 16.87 శాతం ఓటర్లు తగ్గారు. పుదుచ్చేరిలో 77,367 ఓటర్ల పేర్లను తొలగించారు. దీంతో 7.5శాతం ఓటర్లు తగ్గారు. లక్షద్వీప్‌లో కేవలం 206 పేర్లను మాత్రమే తొలగించారు. అంటే 0.36శాతం ఓటర్లు తగ్గారు.

ఇప్పటి వరకు 2.16 కోట్ల ఓటర్లు తొలగింపు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన గణాంకాలను కూడా కలుపుకుంటే మొత్తం తొలగింపుల సంఖ్య 2.16 కోట్లకు చేరాయి. అంటే 7.37 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారు. బిహార్?లో 2025 జూన్‌లో 7.89 కోట్ల ఓటర్లు ఉన్నారు. సెప్టెంబర్ 2025లో 7.43 కోట్లకు తగ్గుదల

ఇంకా విడుదల కావాల్సిన రాష్ట్రాలు

తమిళనాడు, బంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఓటర్ల జాబితా ఇంకా పూర్తిగా విడుదల కాలేదు. తమిళనాడు తుది జాబితా సోమవారం విడుదల కానుంది. బంగాల్‌లో దశలవారీగా విడుదల అవుతుంది. ఉత్తరప్రదేశ్ ఏప్రిల్ 6న తన జాబితాను విడుదల చేస్తారు.

అసోంలో ప్రత్యేక సవరణ

ఇక అసోంలో ఎస్ఐఆర్ బదులుగా స్పెషల్ రివిజన్‌ను చేపట్టారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 10న పూర్తి అయ్యింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో 2.45 కోట్ల ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితాలో 2.52 కోట్లు కాగా, తుది జాబితాలో 2.49 కోట్ల ఓటర్లు ఉన్నారు.

సోమవారం
23 ఫిబ్రవరి 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# కుమ్మెర జాతరలో చిన్నారి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్ (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రెండేళ్ల దళిత చిన్నారి అనుమానాస్పద మృతి అత్యంత విషాదకరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. చిన్నారి మృతిపట్ల సంతాపాన్ని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ ఘటనపై స్పందించి చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుమ్మెర కొండపై ఉన్న ఆలయాన్ని కొందరు పెత్తందారులు తమ గుప్పిట్లో ఉంచుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, కుల వివక్షతో దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ ఘటనలో చిన్నారి తల్లి కీర్తి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా, దాడి చేసిన పెత్తందారులు ఇచ్చిన ఫిర్యాదునే ముందుగా పరిగణనలోకి తీసుకోవడం వారి కుల వివక్షా పూరిత వైఖరిని స్పష్టం చేస్తోందని, చివరకు ప్రజాసంఘాల పోరాటం తర్వాత నిన్న సాయంత్రం కేసు నమోదు చేసారని, రాష్ట్రంలో మహిళలు, సామాజిక న్యాయం ప్రశ్నార్థకంగా మారాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని తెలిపారు. బాధితుల ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన ఎస్ఐ, ఇతర సిబ్బందిపై విచారణ జరిపి విధుల్లోంచి తొలగించాలని, తన తల్లి, తమ్ముడిని కొట్టిన నిందితుల నుండి బాధిత పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి మృతికి కారణమైన దోషులను వెంటనే అరెస్టు చేసి, హత్య కేసులు నమోదు చేయాలని, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# కొండాపూర్‌లో హైడ్రాకు జై

- కబ్జాలను హైడ్రా తొలగిన వెంటనే ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి ఏర్పాట్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : కొండాపూర్ ఐటీ కారిడార్‌కు చేరువలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆక్రమణలను హైడ్రా శనివారం తొలగించింది. ఆదివారం అక్కడ ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ పరిణామాలను చూసి కొండాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రభుత్వానికి జై కొట్టారు. హైడ్రాను అభినందనలతో ముంచెత్తారు. దశాబ్దాల సమస్యకు రోజుల్లో.. గంటల్లో పరిష్కారం దొరకడం.. కబ్జాలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వెంటనే.. ప్రభుత్వం అక్కడ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం పర్యటించినప్పుడు కొండాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి హైడ్రా చర్యలను అభినందించారు. హైడ్రా కాపాడిన స్థలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు విద్యా శాఖ ఆదివారమే సర్వే చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

**ఆక్రమణలను హైడ్రా తొలగించిన వెంటనే..**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. అలాగే పాఠశాలకు దాదాపు ఎకరా స్థలం, పార్కుల కోసం ఎకరాకు పైగా కేటాయించారు. కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని ఉంచారు. ఇలా కేటాయించిన భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని వెంటనే కాపాడి రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో కాలనీ సంక్షేమ సంఘం కోరింది. ఈ భూముల ఆక్రమణల వెనుక బడాబాబులున్నారని ఫిర్యాదు చేసింది. లే ఔట్ ప్రకారం కబ్జాలను శనివారం తొలగించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, హైడ్రా ఎసిపి శ్రీకాంత్, హైడ్రా డిప్యూటీ టౌన్ ప్లానర్ రామిరెడ్డి, హైడ్రా ఇన్స్పెక్టర్ రాజశేఖర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు ఆదివారం కొండాపూర్‌లో పర్యటించి పరిశీలించారు. వెంటనే అక్కడ ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ కళాశాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు.

**పార్కులు, విద్యా సంస్థలు**

కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో పార్కుకు ఉద్దేశించిన స్థలంలో పార్కు నిర్మాణానికి, పాఠశాలకు ఉద్దేశించిన స్థలంలో పాఠశాల, కళాశాలకు ఉద్దేశించిన స్థలంలో కళాశాలతో పాటు పలు విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు అక్కడి స్థానికులకు చెప్పగా.. వారి ఆనందానికి అవధుల్లేవు. దశాబ్దాల పోరాటం ఫలించిందంటూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ పార్కులు, విద్యాసంస్థలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం అభినందించదగ్గ పరిణామమని రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ అసోషియేషన్ పేర్కొంది. పలువురు అధికారులను కలిసి అభినందనలు తెలిపారు.

# మైనార్టీ పథకాల పోర్టల్‌లో 8 జిల్లాల పేర్లు మాయం

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన ఎలక్ట్రిక్ స్కూటర్, తురకకాశీ పథకాల అమలులో 8 జిల్లాలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ స్వయం ఉపాధి పథకాల దరఖాస్తు ప్రక్రియలో భాగంగా టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో నాగర్ కర్నూల్, నారాయణపేట, జయశంకర్ భూపాలపల్లి, కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల,సూర్యాపేట్ మరియు ములుగు జిల్లాల పేర్లు కనిపించకపోవడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ జిల్లాలకు చెందిన వందలాది మంది అర్హులైన మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేక ఆందోళన చెందుతున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మార్చి 1వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనున్న తరుణంలో వెబ్‌సైట్‌లో ఈ 8 జిల్లాల పేర్లు లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాల నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందని యాకూబ్ పాషా హెచ్చరించారు. ముస్లిం, బౌద్ధ, సిక్కు, జైన, పార్శీ మైనార్టీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలు రాష్ట్రంలో అన్ని జిల్లా ల వారికి సమన్యాయం జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని జిల్లాలకే ప్రాధాన్యత ఇచ్చి, మరికొన్ని జిల్లాలను విస్మరించడం సమంజసం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులందరికీ సమాన అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

- ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల అరాచకాలు
- వెంకటరమణారెడ్డి ఇంటిపై దాడి హేయం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన సాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రౌడీ రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు పునరావృతమ వుతున్నాయని, ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ నేతలు దాడులకు తెగబడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏఐఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఎంఐఎంను కాపాడటానికి కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోందని ఫైర్ అయ్యారు. ఈ రెండు పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో జరిగిన గొడవలకు కాంగ్రెస్సే అగ్నికి ఆజ్యం పోసిందని, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని బండి సంజయ్ విమర్శించారు. బాన్సువాడ లో జరిగిన సంఘటనలపై స్పందిస్తూ.. రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆత్మరక్షణ కోసం ప్రయత్నిస్తే, తిరిగి తమపైనే దాడి చేశారని చెప్పడం సిగ్గుచేటని కౌంటర్ ఇచ్చారు. బాన్సువాడలో 70 మంది బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అలాగే, బాన్సువాడ వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు అరాచకాలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన అరాచక ఘటనలను ప్రజలు గుర్తుంచుకోవాలని, రౌడీయిజం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని బండి సంజయ్ వార్నింగ్ ఇచ్చారు.

## కేసీఆర్‌కు పట్టిన గతే.. : ఏలేటి

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే కేసీఆర్ సర్కారుకు పట్టిన గతే వీరికి పడుతుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. కామారెడ్డిలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు ఆఫీసుపై దాడి చేయడం కాంగ్రెస్ సర్కార్ అరాచక పాలనకు అద్దం పడుతోందన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీజేపీ నేతలకు సమాధానం చెప్పడం చేతకాని కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగడం, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామని విర్రవీగుతున్న కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు.

# 'అక్షింతలు' కార్టూన్ పుస్తకావిష్కరణ



హైదరాబాద్, ఫిబ్రవరి 22 : సీనియర్ కార్టూనిస్టులు సురేంద్ర, గజ్జెల మల్లారెడ్డి సంయుక్తంగా అందించిన 'అక్షింతలు' కార్టూన్ సంకలన పుస్తకావిష్కరణ సభ ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. రాజకీయ-సామాజిక వ్యాఖ్యానంతో కూడిన ఈ గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం సాహిత్య, పత్రికారంగ, కార్టూన్ రంగ ప్రముఖుల సమక్షంలో ఆత్మీయంగా సాగింది. అక్షింతలు ఆవిష్కరణ సభకు సభకు మందలపర్తి కిషోర్ అధ్యక్షత వహించారు. గజ్జెల మల్లారెడ్డి కుమారుడు గజ్జెల అశోక్ తమ నాన్నగారు రచించిన కవితలను గుర్తుచేసుకుంటూ, ఆ సాహిత్య వారసత్వాన్ని సభికులతో ఆత్మీయంగా పంచుకున్నారు. ప్రముఖ కవయిత్రి, జర్నలిస్టు కొండేపూడి నిర్మల మాట్లాడుతూ.. "సురేంద్ర మా కుటుంబ సభ్యుడే. కుటుంబంలో ఆయన మెలిగే క్రమశిక్షణ, నిష్ఠ ఆయన కార్టూన్లలో కూడా స్పష్టంగా కనిపిస్తాయి" అని పేర్కొన్నారు. వ్యక్తిత్వం-సృజన మధ్య ఉన్న అనుబంధాన్ని ఆమె హృదయపూర్వకంగా వివరించారు. సీనియర్ జర్నలిస్టు తల్లావజుల శివాజీ పాత 'ఉదయం' రోజులలో సురేంద్ర, గజ్జెల మల్లారెడ్డితో తమ అనుబంధాన్ని స్మరించుకున్నారు. వీరు ఆ రోజుల్లో పత్రికారంగంలోని వాతావరణం, సృజనాత్మక చర్చలు, కార్టూన్‌లపై జరిగిన వాదోపవాదాలను గుర్తుచేసి సభను ఆత్మీయంగా మార్చారు. ముఖ్య అతిథిగా హాజరైన పాశం యాదగిరి భావోద్వేగంగా మాట్లాడారు. "మల్లారెడ్డి-సురేంద్ర కలయికతో వచ్చిన ఈ పుస్తకం ఎంతో బాగుంది. శరీరాన్ని శుద్ధి చేసుకోవడానికి నీళ్లు అవసరం; ఆత్మను శుద్ధి చేసుకోవడానికి జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాల వల్ల కారే కన్నీళ్లు అవసరం" అని ఆయన వ్యాఖ్యానించారు. 'అక్షింతలు' అలాంటి జ్ఞాపకాల పుటల సమాహారమని యాదగిరి అభివర్ణించారు.

**బొమ్మలతో నవ్వించడం నవ్వులాట కాదు**

అప్పటి రాజకీయ పరిస్థితులపై సురేంద్ర ఎంతో ధైర్యంగా కార్టూన్లు గీశారని కార్టూనిస్టు మృత్యుంజయ తెలిపారు. "ఇప్పుడు అలా గీస్తే సోషల్ మీడియాలో ట్రోల్ చేసి, కేసులు వేయించే పరిస్థితి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇంత పదునైన కార్టూన్లు గీసినందుకు సురేంద్ర సతీమణి శారదను ప్రత్యేకంగా అభినందించారు. "ఇంట్లో ప్రశాంతత ఉంటేనే ఇలాంటి కార్టూన్లు సాధ్యం. బొమ్మలతో నవ్వించడం నవ్వులాట కాదు" అని మృత్యుంజయ అన్నారు. 'అక్షింతలు' పుస్తకం మల్లారెడ్డి గజ్జెలకు సురేంద్ర నివ్వాళిగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. రచయిత తాడి ప్రకాశ్ మాట్లాడుతూ.. గజ్జెల మల్లారెడ్డి కేవలం కవే కాకుండా మంచి వక్త కూడా అని అన్నారు. సురేంద్ర అప్పట్లో గీసిన కొన్ని పదునైన కార్టూన్లను గుర్తు చేస్తూ సభికులను నవ్వుల్లో ముంచెత్తారాయన. కార్టూన్‌లోని వ్యంగ్య రసాన్ని విశ్లేషిస్తూ, అది సమాజానికి అద్దమని ప్రకాశ్ వ్యాఖ్యానించారు. ప్రముఖ కార్టూనిస్టు నర్సింగారు సురేంద్రతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. కార్టూన్ రంగంలో ఆయన సాధించిన ప్రత్యేక స్థానం గురించి ప్రస్తావించారు. సురేంద్ర రేఖలోని ధైర్యం, భావవ్యక్తీకరణలోని స్పష్టత ఆయన ప్రత్యేకత అని అభిప్రాయపడ్డారు. ఇతర ప్రసంగకర్తలు కూడా 'అక్షింతలు'లోని కార్టూన్లు సమకాలీన రాజకీయాలపై, సామాజిక పరిణామాలపై ఘాటైన వ్యాఖ్యానాలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఒకే చిత్రంలో పది సంపాదకీయాల బలం దాగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. 'అక్షింతలు' కార్టూన్ సంకలనం మాత్రమే కాదు; అది సమాజానికి అందించిన ఆలోచనా అక్షింతలని సభలో పలువురు వ్యాఖ్యానించారు. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో పత్రికా రంగ ప్రతినిధులు, కార్టూన్ అభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# రజక కుటుంబంపై దాడి అమానుషం

- బీసీ కమిషన్ సభ్యులు, ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : రజక కుటుంబంపై దాడి అమానుషమని బీసీ కమిషన్ సభ్యులు, ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ ఉపేంద్ర అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మరి మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ కులం పేరు తోటి అత్యంత వెనుకబడిన వర్గాలైన సేవకులాలపై దాడులు చేయడం అత్యంత దారుణమన్నారు. ఇలాంటి కుల దురాంకార వ్యక్తులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపి బాధితులకు తగు సహాయం తగు న్యాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత దళితులపై మహిళలపై మైనార్టీలపై గిరిజనులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఒక సామాజిక వర్గం పరిపాలన చేస్తున్నదని, తాము చెప్పినట్టే జరగాలని వినాలని అధికార దురంకారంతో కుల మదంతో కింది కులాల వారిపై దూషణలు చేయడం అమర్యాదగా ప్రవర్తించడం దాడులు చేయడం ఆఖరికి హత్యలు చేయటం తుపాకులతో బెదిరించడం తప్పుడు కేసులు పెట్టడం జైలుకు పంపడం కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలనకు నిదర్శనమన్నారు. రజక కుటుంబంపై దాడిలో పసిపాపను కర్కషంగా తన్ని చంపడం అంటే అత్యంత దుర్మార్గకరమైన విషయమని సభ్య సమాజం తలదించుకునే విధంగా ఆ దుండగులు ప్రవర్తించారని, దుండగుల వెనుక ఎవరున్నా ఎంత పెద్ద నాయకులు ఉన్నా ఏ కులమైనప్పటికీ కూడా వారిని వదిలే సమస్య లేదని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ న్యాయపోరాటం ప్రజా పోరాటాలకు అత్యంత వనకబడిన వర్గాల ప్రజలు సిద్ధపడాలని, లేదంటే రాబోయే కాలంలో ఇలాంటి దుర్మార్గులు నీచులు పెట్రేగి దళిత బహుజనులపై దాడులు చేసే ప్రమాదం ఉన్నదని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయంపై స్పందించి బాధితులకు శిక్ష పడే వరకు ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

# రామచందర్ రావు హౌస్ అరెస్టు అప్రజాస్వామికం


- ఎంపీ ఈటల రాజేందర్



మేడ్చల్ (జనంసాక్షి) : కామారెడ్డికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తన పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలపడానికి వెళ్లడం కూడా నేరమా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇదే తరహా హౌస్ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిందని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి అదే విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే ప్రతిపక్షాలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. సంఘీభావం తెలపడానికి వెళుతున్న బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఈటెల పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలే గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విధానం పై ప్రభుత్వం సిగ్గుపడాలని, ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# తెర వెనక పాత్రులెవరు..?

- అడ్రస్ లేని ఉత్తరంతో చిరు ఉద్యోగి తొలగింపు..
- ఆగమశాస్త్రానికి.. చిరు ఉద్యోగికి పొంతన ఏంటి.?
- పైరవీలతో కొత్త నియామకాలు చేపట్టడం ఏంటి..?
- ఆదివాసీ సేన మండల శాఖ అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ





మంగపేట (జనంసాక్షి) : మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అన్నదానం సత్రం అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి మల్లూరు గ్రామానికి చెందిన గొర్లపల్లి గణేష్ ను ఎటువంటి ఆధారం, పూర్తి అడ్రస్ లేని ఉత్తరముతో తొలగించడం ఏంటి అని ఆదివాసి సేన మండలశాఖ అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ దేవాదాయ ధర్మాదాయ శాఖను డిమాండ్ చేస్తూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసలు మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి గుట్టపై ఏం జరుగుతుంది...? చిరు ఉద్యోగులపై అధికారుల వేధింపులు సరైంది కాదని వారన్నారు. హేమాచల క్షేత్రంపై ఇటీవల కాలంలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా కేవలం రికమండేషన్ ల ఆధారంగా నియామకాలు చేయడం ఏంటి అని ఆదినారాయణ మండిపడ్డారు. నోటిఫికేషన్ లేకుండా నియామకాలు చేపట్టడం ఏంటి అని ప్రశ్నించిన గణేష్ ను అధికారులు వేధిస్తూ గత పది సంవత్సరాల నుండి అక్రమంగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పడం వెనుకాల ఆంతర్యం ఏమిటి అని వారన్నారు. ఇటీవల ఆలయ కార్యనిర్వాహణాధికారి గణేష్ పై అధికారులకు నివేదికలో 2013 సంవత్సరములో వీధిలో అక్రమంగా చేరారంటూ ఆ సమయంలో పదవ తరగతిలో మైనర్ ఉన్నట్టు ఉద్యోగానికి అర్హుడు కాదంటూ వివరణ ఇవ్వడం జరిగింది. కానీ అప్పుడు అధికారులకు గణేష్ అనర్హుడని తెలియదా మరి అప్పుడు పని లో ఎందుకు పెట్టుకున్నారు. అప్పుడు లేని అనర్హత నేడు ఇతర పైకి ఎలా తీసుకువచ్చారు అని వారు ప్రశ్నించారు. అన్నదాన సత్రంలో అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నట్లు 2017 నుండి గణేష్ కు జీతం చెల్లించినట్లు బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయని వారు తెలిపారు. మరి 2013 నుండి 2017 వరకు గణేష్ కు జీతం కానీ కూలి చెల్లించినట్లు అధికారుల దగ్గర ఆధారాలు ఉన్నాయా..? అని వారు ప్రశ్నించారు. ఇలా పొంతన లేని సాకులతో ఎటువంటి ఆధారాలు, అడ్రస్ లేని ఉత్తరంతో చిరు ఉద్యోగైన గణేష్ ను తొలగించడం దుర్మార్గం అని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. గతంలో గణేష్ తాగి విధులకు హాజరవుతున్నాడని భక్తుల వద్ద నుండి డబ్బులను వసూలు చేస్తున్నాడని ఆరోపించారు కానీ వాటికి ఎటువంటి ఆధారాలు ఉన్నాయి ఉంటే వాటికి సంబంధించిన ఆధారాలు ఎందుకు బహిర్గతం చేయడం లేదు అని వారు డిమాండ్ చేశారు. మద్యం తాగి విధులకు హాజరైనట్టు ఉంటే గణేష్ కు వైద్య పరీక్షలు నిర్వహించి వాటిని వెల్లడించాలి కానీ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదని వారన్నారు.

## పొగరుబోతు ట్రంప్‌కు అడ్డుకట్ట వేసే

# శక్తి ఎవరికి లేదా!?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న బెదిరింపులు, చేస్తున్న పోకిరి తనం చూస్తుంటే ఒక ప్రశ్న మాత్రం మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఈ పొగరుబోతును నిలువరించే శక్తి ఈ భూమి మీద ఎవరికీ లేదా? ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, ఆయన కుమారుడిని చంపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు. వెనిజులా విషయంలో చేసినట్లే ఇరాన్తోనూ తన ఇష్టారాజ్యం నెరపాలని చూస్తున్నాడు. తాను చెప్పిన ధరకు, తాను చెప్పిన దేశానికే చమురు ఎగుమతి చేయాలని సార్వభౌమ దేశాలను బెదిరిస్తున్నాడు. తన దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే 'మూర్ఖులు', 'కుక్కలు' అని దూషించే సంస్కారం ఆయనది. అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను ఆయన ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఇలాంటి వ్యక్తి ప్రపంచ శాంతికి, ప్రజాస్వామ్య విలువలకు ఎంతటి ముప్పో చెప్పక్కర్లేదు.

ట్రంప్ ప్రతిష్ట అమెరికా ప్రజల్లో దినదిన గండంగా పడిపోతోంది. క్విన్నిపియాక్ యూనివర్సిటీ సర్వే ప్రకారం ఫిబ్రవరి 2026 నాటికి ఆయన ఆమోదం కేవలం 37 శాతానికి పడిపోయింది. సంప్రదాయవాద వర్గాలకు దగ్గరగా ఉండే రాస్ముసెన్ పోల్ కూడా 41 శాతం నమోదు చేసింది - ఇది ఆయన రెండో టర్మ్ లో ఇది అత్యల్పం. ఏపీ-ఎన్ఓఆర్సీ సర్వేలో 36 శాతం మాత్రమే ఆమోదం, 62 శాతం అసమ్మతి నమోదైంది. 88 ఏళ్లుగా అధ్యక్షుల ఆమోదం ట్రాక్ చేస్తున్న గాలప్ సంస్థ కూడా తమ సర్వేలు నిలిపివేసింది. ట్రంప్ 37 శాతంతో దిగజారిన సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థ, ఇమిగ్రేషన్, విదేశాంగ విధానం మొదలలైన ప్రతి అంశంలోనూ ఆమోదం పడిపోయింది. టారిఫ్‌లు, వాణిజ్య విధానాలపై ఆమోదం 39 శాతానికి చేరింది.

అంతర్జాతీయంగా కూడా ట్రంప్ విధానాలకు వ్యతిరేకత పెరుగుతోంది. వాషింగ్టన్‌లో యుక్రెయిన్ యుద్ధ వార్షికోత్సవం సందర్భంగా వందలాది మంది నిరసన ప్రదర్శనలు చేశారు, రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు . అనేక దేశాల్లో ఆయన విధానాలకు వ్యతిరేకంగా ధర్నాలు జరిగాయి. ఐరాస సెక్రటరీ జనరల్ కూడా అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యం ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్ని వ్యతిరేకతల మధ్యా ట్రంప్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదు.

అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. 1970ల చైతన్య చట్టం కింద విధించిన సుంకాలు అధికార పరిధి దాటినవని, చట్టవిరుద్ధమని 6-3 తీర్పులో ప్రకటించింది. చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని మెజారిటీ ఈ నిర్ణయం తీసుకుంది. కానీ ట్రంప్ దీన్ని ధిక్కరించాడు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన మరుసటి రోజే సెక్షన్ 122 పేరుతో 10 శాతం కొత్త సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించాడు. మర్నాడు దాన్ని 15 శాతానికి పెంచేశాడు. తన వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులను ముఖ్యంగా తాను నియమించిన నీల్ గోర్సచ్, ఎమీ కోనీ బారెట్‌ను కూడా "అవమానకరం", "తమ కుటుంబాలకు సిగ్గు", "విదేశీ ప్రయోజనాలకు లొంగిన మూర్ఖులు" అంటూ దూషించాడు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ట్రంప్ వసూలు చేసిన అదనపు టారిఫ్‌లను ఆయా దేశాలకు తిరిగి చెల్లించాలి. కానీ ట్రంప్ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నిధుల వాపసు కోసం కంపెనీలు దాఖలు చేసిన కేసులపై దీర్ఘకాలిక న్యాయ పోరాటాలు జరగనున్నాయి. ఇప్పటివరకు ఎలాంటి వాపసు ప్రక్రియ ప్రారంభం కాలేదు.

కోర్టు తీర్పు ధిక్కారానికి ట్రంప్‌ను పోలీసులు బంధించలేదు. అమెరికాలో అధ్యక్షుడిని బంధించడం చట్టపరంగా, రాజకీయంగా చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఇది అప్పీచ్‌మెంట్ (ఇంపీచ్‌మెంట్) ద్వారా మాత్రమే సాధ్యం. కానీ ఇతర కేసుల్లో మాత్రం న్యాయమూర్తులు ట్రంప్‌ను హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. హష్ మనీ కేసులో న్యాయమూర్తి జువాన్ మెర్చన్ మాట్లాడుతూ, గ్యాగ్ ఆర్డర్ ఉల్లంఘించడం కొనసాగితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. మిన్నసోటాలో ఇమిగ్రేషన్ కేసులో న్యాయమూర్తి లారా ప్రొవిన్జినో కోర్టు ఆదేశాలు పాటించడంలో ప్రభుత్వ న్యాయవాదుల నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. కానీ అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్‌ను బంధించడం మాత్రం జరగలేదు.

చైనా, రష్యా లాంటి అణు శక్తులు, ఇతర ప్రభావశీల దేశాలు ట్రంప్ పొగరును అణచివేయడంలో విఫలమవుతున్నాయి. బహుశా వాటికి తమ సొంత ప్రయోజనాలు, వాటి మధ్య ఉన్న విభేదాలు, అమెరికాతో ప్రత్యక్ష ఘర్షణకు దిగడం వల్ల కలిగే నష్టాలను లెక్కలు వేసుకోవడం వల్లకానీ... ఇవన్నీ వాటిని వెనకడుగు వేయిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం, ఫార్మోసా జలసంధి ఉద్రిక్తతలు...ఇవన్నీ ఈ దేశాల దృష్టిని మరల్చుతున్నాయి. ట్రంప్‌ను ఎదుర్కోవడం కంటే, అతనితో చర్చలు జరిపి తమ ప్రయోజనాలు సాధించుకోవడం వారికి లాభదాయకంగా కనిపిస్తోందేమో.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంగతి చెప్పుకోవాలంటే, అది ట్రంప్ వంటి వారిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైంది. అమెరికా వీటో అధికారం కలిగిన శాశ్వత సభ్య దేశం కావడం, మరియు దాని మిత్రదేశాలు చాలా వరకు అమెరికా వైఖరికి మద్దతు పలకడం... ఇవి ఐక్యరాజ్యసమితిని నిస్తేజంగా మార్చేశాయి. ఉగ్రవాదం, ప్రపంచ శాంతికి ముప్పు వంటి వాటి గురించి మాట్లాడే ఈ సంస్థ, తనలోని ఒక శాశ్వత సభ్య దేశాధ్యక్షుడే ప్రపంచ శాంతికి అతిపెద్ద ముప్పుగా మారినప్పుడు నోరు మెదపడం లేదు.

ఇంతకీ ట్రంప్‌ను నిలువరించే శక్తి ఎవరికైనా ఉందా? సమాధానం...ఉంది. కానీ అది ఒక్క దేశం చేతుల్లో లేదు. అది అంతర్జాతీయ సమాజం ఏకం కావడంలో ఉంది. యూరోపియన్ యూనియన్, చైనా, రష్యా, భారత్ వంటి ప్రధాన శక్తులు ఏకమై, ట్రంప్ ప్రవర్తనను నిరసించి, ఆర్థిక, దౌత్యపరమైన ఆంక్షలు విధించాలి. అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో ముడిపడి ఉంది. ప్రపంచ దేశాలు ఏకమైతే ఒత్తిడి తీసుకురావచ్చు. అంతర్జాతీయ న్యాయస్థానంలో ట్రంప్‌ను, అతని సహాయకులను యుద్ధ నేరాలకు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు విచారించాలి.


చివరకు, అమెరికా ప్రజలే, వారి ప్రజాస్వామ్యం ద్వారా ట్రంప్‌ను నియంత్రించగలరు. ఇప్పటికే ఆయన రేటింగ్ కనిష్ట స్థాయికి పడిపోవడం, ఆయన విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం... ఇవి ఆశాజనక సంకేతాలు . రానున్న మధ్యంతర ఎన్నికల్లో ఈ వ్యతిరేకత ప్రతిబింబించే అవకాశం ఉంది. అమెరికా రాజ్యాంగం, చట్టాలు, సుప్రీంకోర్టు, కాంగ్రెస్ వీటన్నింటినీ ధిక్కరించే ట్రంప్, నిజానికి అమెరికా ప్రజాస్వామ్యానికే సవాల్ విసురుతున్నాడు. ఈ సవాల్ను ఎదుర్కొనే బాధ్యత ముందుగా అమెరికా ప్రజలదే, వారి రాజకీయ పార్టీలదే. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం మాత్రం చాలా దుర్భరంగా ఉంది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా నిలవాల్సిన దేశం, ఒక పొగరుబోతు, నియంతృత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి చేతిలో చిక్కుకుపోయింది. ఈ పరిణామం ప్రపంచానికి ప్రమాదకరమే కాదు, అమెరికాకు కూడా అంతే ప్రమాదకరం. ట్రంప్ పోకిరితనాన్ని ఆపడం ఇక కేవలం అంతర్జాతీయ సమస్య మాత్రమే కాదు, అది మానవాళి మనుగడ ప్రశ్నగా మారింది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# స్వచ్ఛభారత్ రూపకర్త గాడ్గే బాబా మహారాజ్

భారతీయ సంఘ సంస్కర్తలలో గాడ్గే బాబా జీవితం, బోధనలు, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు స్ఫూర్తి, రజక సమాజానికి మార్గదర్శనం. భారతదేశ సామాజిక చరిత్రలో కొన్ని మహానుభావులు ఎటువంటి అధికార పదవులు లేకుండా, ప్రజల మధ్య జీవిస్తూ, సమాజాన్ని మార్చిన విప్లవకారులు. అటువంటి అరుదైన సంఘ సంస్కర్తలలో ప్రముఖుడు "సంత్ గాడ్గే బాబా మహారాజ్". ఆయన జీవితం మాటలకన్నా చర్యల ద్వారా బోధించిన మహా పాఠశాల లాంటిది.గాడ్గే బాబా ఎవరు.? గాడ్గే బాబా అసలు పేరు డేబూజీ జింగ్రాజీ జనోర్జే. వారు ఫిబ్రవరి.23.1876 లో మహారాష్ట్రలోని అమరావతి జిల్లా, దార్యాపూర్ తాలూకాలోని షేండూర్ గ్రామంలో జన్మించారు.చిన్ననాటి నుంచే పేదరికం, కులవివక్ష, అజ్ఞానం, అస్వచ్ఛతను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి. ఆయన సన్యాసిగా మారలేదు, మఠాలు, ఆశ్రమాలు కట్టలేదు, కానీ గ్రామ గ్రామాన్ని ఒక జీవన పాఠశాలగా మార్చారు. గాడ్గే బాబా జీవన తత్వం మాటలకంటే కార్యం.గాడ్గే బాబా చేతిలో చెత్త చీపురు, తలపై చినిగిన గుడ్డ, పాదాల వద్ద ధూళి ఇదే ఆయన అలంకారం.




గాడ్జి బాబా జీవన సందేశం ఏమిటి అంటే శుభ్రత,భక్తి,శ్రమ,ధర్మం,మానవ సేవ, దేవ సేవ. ఆయన ఎక్కడికి వెళ్లినా గ్రామాల వీధులు శుభ్రం చేసేవారు. మురుగు కాలువలు తీయించేవారు, ప్రజలతో కలిసి పనిచేసేవారు.తాను శుభ్రం చేయక ముందు ఎవరికీ ఉపన్యాసం ఇవ్వలేదు, ఇదే గాడ్గే బాబా గొప్పతనం. కులవ్యవస్థ లోని అంటరానితనంపై, అసమానతలపై, మత అసమానతలపై గాడ్గే బాబా అలుపెరుగని పోరాటం చేశాడు. గాడ్గే బాబా స్పష్టంగా ఏమి చెప్పారు అంటే "దేవుడు ఆలయంలో లేడు, ఆకలితో ఉన్న మనిషిలో ఉన్నాడు." ఆయన తీవ్రంగా వ్యతిరేకించినవి ఏమిటి అంటే కుల మత అసమానతలు, బ్రాహ్మణీయ ఆధిపత్య అహంకారం, మూఢనమ్మకా లు, అంధభక్తి,యాగాలు, హోమాలు. పూజల పేరిట దోపిడీ ఆయన ప్రశ్నించారు.?

పూజలతో దేవుడు తృప్తి చెందితే, సమాజంలో ఇంత అన్యాయం ఎందుకు..? జరుగుతుందని దేవుడి పేరుతో, మతం పేరుతో చూపే సమానతలని, బ్రాహ్మణుల దోపిడీని సమాజంపై వారి ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ సింహంల గర్జించాడు.! చారిత్రకంగా, సామాజికంగా గాడ్గే బాబా రజక (చాకలి) వృత్తి వర్గానికి చెందినవారనే అభిప్రాయం బలంగా ఉంది.ఆయన కుటుంబం బట్టలు ఉతికే వృత్తితో జీవించేది. కులపరంగా వారు అత్యంత వెనుకబడిన వర్గానికి చెందినవారు.అందుకే ఆయనకు శుభ్రత, శ్రమ, మానవ గౌరవం ప్రధాన జీవిత విలువలయ్యాయి.కానీ గాడ్గే బాబా ఒక కులానికే పరిమితం కాలేదు.ఆయన మొత్తం అణగారిన సమాజానికి ప్రతీక.గాడ్గే బాబా జీవనం విలువల ద్వారా అంబేద్కర్‌కు ఎంతగానో స్ఫూర్తి పొందాడు.భారతదేశంలోని ఇద్దరు మహా యోధులు ఒకరు చర్యల ద్వారా విప్లవం చేసినవాడు గాడ్గే బాబా అయితే మరొకరు చట్టం ద్వారా విప్లవం చేసినవాడు డా. బి.ఆర్. అంబేద్కర్.

అంబేద్కర్ గాడ్గే బాబాపై చేసిన వ్యాఖ్యలు ఏమిటి అనగా "గాడ్గే బాబా విద్యావంతుడు కాకపోయినా, ఆయనలోని సామాజిక చైతన్యం అనేక పండితుల కంటే గొప్పది." సమాజ మార్పు ఉపన్యాసాల వల్ల కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే చర్యల వల్ల జరుగుతుంది.దీనికి గాడ్గే బాబా సజీవ ఉదాహరణ." అంబేద్కర్ తన పోరాటంలో గాడ్గే బాబా సేవా మార్గాన్ని గౌరవించాడు. గాడ్గే బాబా బోధించిన సామాజిక రాజకీయ సాంస్కృతిక విలువలతో నాడు అంబేద్కర్ పోరాటం చేయగా, నేడు తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఫౌండర్లా చైర్మన్ అయినా డా. విశారదన్ మహారాజ్ సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన కోసం 90% ప్రజలైన బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యాధికారం కోసం గాడ్గే బాబా, అంబేద్కర్ స్ఫూర్తితో విశారదన్ మహారాజ్ పోరాడుతున్నారనె విషయాన్ని గుర్తించి సమాజమంతా కూడా పీడిత కులాల నాయకుల కలయికని అభినందించాలి.

గాడ్గే బాబా బోధనలు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక విలువలు ఏమిటి అనగా సామాజిక విలువలు కుల నిర్మూలన మానవ సమానత్వం,శుభ్రత, ఆరోగ్యం,మహిళల గౌరవం,రాజకీయ అవగాహన ప్రజలు చైతన్యవంతులు కావాలి.అధికారానికి బానిసలు కాకూడదు

ఓటు అంటే బాధ్యత. సాంస్కృతిక సంస్కరణ, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రజల జీవనానికి ఉపయోగపడే సంస్కృతి. శ్రమకు గౌరవం నేటి రజక(చాకలి) సమాజం గాడ్గే బాబాను ఎలా ఆదర్శంగా తీసుకోవాలి.? గాడ్గే బాబా కేవలం జయంతులకు పరిమితం కావద్దు.రజక సమాజం చేపట్టవలసిన కార్యక్రమాలు గ్రామ, వార్డ్ శుభ్రత ఉద్యమాలు,పిల్లల విద్యకు ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చే పోరాటాలు,వృత్తితో పాటు ఆధునిక నైపుణ్యాలు, కుల గౌరవ ఉద్యమాలు. "చాకలి అంటే సేవకుడు కాదు, సమాజాన్ని శుభ్రం చేసే శిల్పి". నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాడ్గే బాబా బోధనలను ఎలా అమలు చేయాలి.? అంటే శుభ్రతను కేవలం నినాదంగా కాకుండా సామాజిక ఉద్యమంగా చేయాలి.పారిశుధ్య కార్మికులకు గౌరవం, భద్రత, శాశ్వత హక్కులు విద్య, ఆరోగ్యం, ఉపాధి పై ప్రాధాన్యత,కులవివక్షపై కఠిన చర్యలు. గాంధీజీని స్వచ్ఛభారత్‌కి సృష్టికర్తగా నేటి ప్రభుత్వాలు చూస్తున్నాయి. కానీ నిజమైన స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్ గాడ్గే బాబా మహారాజ్‌గా చెప్పుకోవాలి, ఎందుకంటే వారు జీవించిన కాలంలో ప్రతిరోజు ప్రతిక్షణం సంఘాన్ని శుభ్రం చేస్తూ నిస్వార్ధంగా సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారు.

గాడ్గే బాబా బోధనలు ఏమిటనగా "ప్రభుత్వం మారితే సమాజం మారదు, సమాజం మారితే ప్రభుత్వం మారుతుంది." గాడ్గే బాబాను నిజంగా గౌరవించాలంటే.? వారి విగ్రహాలు పెట్టడం కాదు, బ్యానర్లు కాదు, ఒకరోజు జయంతి కాదు.నిజమైన గౌరవం అంటే మన ఇంటిని, మన ఊరిని దేశాన్ని, మానవ సమాజాన్ని శుభ్రంగా ఉంచడం.ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం, అణగారినవాడిని మనిషిగా చూడడం.కులాన్ని కాదు గుణాన్ని గౌరవించడం.గాడ్గే బాబా జీవితం మనకు చెప్పేది ఒక్కటే నీ జీవితం నీకే కాదు,నలుగురికి ఉపయోగపడితేనే అది సార్థకం.

ఆయన చూపిన మార్గం,సేవ,సమానత్వం,శ్రమ,చైతన్యం. అంతిమంగా గాడ్గే బాబా ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు, గాడ్గే బాబా అంటే ఒక సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన ఉద్యమం.ఆయన బోధనలు పాటిస్తే సమాజం శుభ్రపడుతుంది,మనసులు మారుతాయి.మనిషి విలువ పెరుగుతుంది.గాడ్గే బాబా మార్గంలో నడవడమే అంబేద్కర్ కలల భారతదేశానికి అడుగు వేసిన వాళ్ళము అవుతాము అదే వారికి ఇచ్చే నిజమైన గౌరమని మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.



పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
9553041549

# శ్రీలంక ప్రజాస్వామ్యంలో చారిత్రాత్మక మలుపు

## పార్లమెంటు సభ్యుల పెన్షన్ రద్దు !

ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు తీవ్రమైన విశ్వాస సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాలంలో, దక్షిణాసియాలోని ద్వీపదేశమైన శ్రీలంక ఒక కీలక రాజకీయ నిర్ణయంతో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఆర్థికంగా కుప్ప కూలిన పరిస్థితుల్లో, సామాన్య పౌరులు జీవనాధార సమస్యలతో సతమతమవుతున్న వేళ, రాజకీయ నాయకులు పొందుతున్న ప్రత్యేకాధికారాలు ప్రజల ఆగ్రహానికి కేంద్రబిందువయ్యాయి. ఈ నేపథ్యంలోని పార్లమెంటు సభ్యుల పెన్షన్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం కేవలం ఒక చట్టసవరణగా పరిమితం కాకుండా, ప్రజాస్వామ్య నైతికతపై సాగుతున్న విశాల చర్చకు ప్రతీకగా నిలిచింది.

శ్రీలంక పార్లమెంటులో 225 మంది సభ్యులున్న సభలో ఫిబ్రవరి 18న జరిగిన ఓటింగ్ దేశ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. 154 ఓట్ల మెజారిటీతో ఆమోదించబడిన ఈ బిల్లు, కేవలం 2 వ్యతిరేక ఓట్లను మాత్రమే ఎదుర్కొంది. మిగిలిన సభ్యుల గైర్హాజరు కూడా ప్రజలలో విస్తృత చర్చకు దారి తీసింది. ఈ నిర్ణయం ద్వారా ఇప్పటివరకు ఎంపీలకు లభిస్తున్న పెన్షన్ సౌకర్యాలకు శాశ్వతంగా తెరపడింది. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసిన వెంటనే జీవితాంతం పెన్షన్ పొందే విధానం ఇతర ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలతో పోలిస్తే అత్యంత అధికంగా ఉండటంతో, ఇది రాజకీయ విశేషాధికారాల ప్రతీకగా విమర్శల పాలైంది.

ఈ చట్టం తక్షణమే అమలులోకి రావడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే పెన్షన్ పొందుతున్నవారికీ, భవిష్యత్తులో అర్హత సాధించబోయేవారికీ ఈ రద్దు వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల పక్షపాత రహిత వైఖరిని ప్రదర్శించిందని అనేక రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ప్రజా ధనాన్ని ప్రజల కష్టసాధ్య జీవనానికి వినియోగించాలన్న భావన ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తుంది.

శ్రీలంక ఈ స్థాయిలో కఠినమైన నిర్ణయం తీసుకునే పరిస్థితి ఒక్కరోజులో ఏర్పడలేదు. 2022లో దేశం ఎదుర్కొన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభం సామాన్యుల జీవితాలను పూర్తిగా అతలాకుతలం చేసింది. ఇంధన కొరత, ఆహార ధరల పెరుగుదల, ఔషధాల లేమి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ప్రజల సహనాన్ని పరీక్షించాయి. ఈ పరిస్థితులే అప్పటి అధ్యక్షుడు గొటబయ రాజపక్సా రాజీనామాకు దారితీశాయి. ప్రజా ఉద్యమాలు, నిరసనలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు కలిసి ఒక రాజకీయ మార్పుకు బీజం వేశాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం, అనుర కుమార దిస్సనాయకే నాయకత్వంలో, ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందడాన్ని ప్రధాన లక్ష్యంగా ప్రకటించింది. ఈ ప్రభుత్వ ఎన్నికల హామీలలో ఎంపీల పెన్షన్ రద్దు ఒక కీలక అంశంగా నిలిచింది. ఎన్నికైన ప్రతినిధులు సామాన్య పౌరులు ఎదుర్కొంటున్న కష్టాలను అనుభవించకుండా ప్రత్యేక ప్రయోజనాలను ఆస్వాదించకూడదన్న భావనను ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలతో సమానంగా బాధ్యత వహించడమేనన్న సిద్ధాంతాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబించింది.

ఈ చట్టానికి మద్దతుగా న్యాయశాఖ మంత్రి హర్షన నానాయక్కర చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చకు వచ్చాయి. పార్లమెంటు చర్చలు, ప్రజల అభిప్రాయాలు పరిశీలిస్తే ఎంపీలకు పెన్షన్ అవసరం లేదన్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో రాజకీయ జీవితానికి భద్రత కల్పించడమే సరైన ప్రజాస్వామ్య ఆచరణ కాదన్న అభిప్రాయం ప్రభుత్వ వైఖరిలో స్పష్టంగా కనిపించింది.

అయితే ఈ నిర్ణయంపై ఏకాభిప్రాయం లేదన్న వాస్తవం కూడా అంతే స్పష్టంగా ఉంది. ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస వంటి కొందరు నాయకులు ఈ చట్టంపై ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ రద్దుతో సమర్థులైన వ్యక్తులు రాజకీయాల్లోకి రావడానికి నిరుత్సాహపడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత లేకపోవడం అవినీతికి దారితీయవచ్చన్న వాదన కూడా వినిపించింది. ప్రజాసేవకు వచ్చే వ్యక్తులు తమ వ్యక్తిగత భవిష్యత్తుపై కూడా ఆలోచించాల్సి వస్తుందన్న వాస్తవాన్ని విస్మరించరాదన్నది వారి అభిప్రాయం. ఈ విభేదాల మధ్య కూడా శ్రీలంక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య నైతికతపై ఒక కొత్త చర్చను ప్రారంభించింది. ప్రజాసేవ అనేది లాభదాయక వృత్తిగా మారకూడదన్న భావన బలపడింది. అధికార పదవులు సేవాభావంతో నడవాలన్న ఆలోచనకు ఇది బలమైన ఉదాహరణగా మారింది.

ఈ పరిణామం దక్షిణాసియాలోని ఇతర దేశాలపై కూడా ప్రభావం చూపింది. ముఖ్యంగా భారత్ లో రాజకీయ నాయకుల ప్రత్యేక ప్రయోజనాలపై మళ్లీ చర్చ ఊపందుకుంది. 2025 నాటికి భారతదేశంలో పదవీ విరమించిన మాజీ ఎంపీలు నెలకు ₹31,000 పెన్షన్ పొందుతున్నారు. ఐదేళ్లకు మించి పనిచేసిన ప్రతి అదనపు సంవత్సరానికి ₹2,500 జమ అవుతోంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంపీలు నెలకు ₹1,24,000 జీతం, రోజువారీ భత్యాలు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఉచిత ప్రయాణ సౌకర్యాలు, సబ్సిడీ గృహాలు వంటి విస్తృత ప్రయోజనాలు పొందుతున్నారు.

పేదరిక రేఖకు దిగువనున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నెలకు కేవలం ₹300-₹500 మధ్యలోనే సామాజిక భద్రతా పెన్షన్ పొందుతున్నారు. ఈ వ్యత్యాసం ప్రజాస్వామ్య సమానత్వ భావనపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. రాజకీయ నాయకులకు వందల రెట్లు అధికంగా లభిస్తున్న ప్రయోజనాలు నైతికంగా సమర్థించలేనివిగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు.

పాకిస్తాన్ లో కూడా ఆర్థిక సంక్షోభ పరిస్థితుల మధ్య ఎంపీల జీతాల పెంపు ప్రతిపాదనలు వివాదాస్పదంగా మారాయి. నెలకు ₹5,19,000 జీతం పెంపు ఆలోచన ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. అప్పుల భారంతో కూరుకుపోయిన దేశంలో ఈ తరహా ప్రతిపాదనలు రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీయగలవన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

బంగ్లాదేశ్ లో ఎంపీలకు ప్రాథమిక జీతం తక్కువగా ఉన్నప్పటికీ, విస్తృతమైన భత్యాలు, పన్ను మినహాయింపులు, ప్రభుత్వ గృహాలు, ప్రయాణ సౌకర్యాలు, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విధానం కూడా సామాన్య పౌరుల పరిస్థితితో పోలిస్తే అసమానతను స్పష్టంగా చూపుతోంది.

శ్రీలంకలో పార్లమెంటు సభ్యుల పెన్షన్ రద్దు ప్రజల ఆగ్రహానికి ప్రత్యక్ష స్పందనగా కనిపిస్తుంది. ప్రజల కష్టాలను అనుభవించని రాజకీయ వ్యవస్థ ఎక్కువకాలం నిలవదు అన్న సందేశాన్ని ఇది స్పష్టంగా ఇస్తోంది. ప్రజాసేవ త్యాగంతో కూడిన బాధ్యతగా మారాల్సిన అవసరాన్ని ఈ నిర్ణయం గుర్తుచేస్తోంది. ప్రజాస్వామ్యానికి ప్రాణం ప్రజల విశ్వాసమే అన్న సత్యాన్ని మళ్లీ ప్రతిపాదిస్తోంది.భవిష్యత్తులో ఈ నిర్ణయం శ్రీలంక రాజకీయ సంస్కృతిని ఏ విధంగా మార్చుతుందో కాలమే నిర్ణయించాలి. అయినప్పటికీ, ఈ చారిత్రాత్మక అడుగు ప్రజాస్వామ్య నైతికతపై సాగుతున్న అంతర్జాతీయ చర్చలో ఒక కీలక అధ్యాయంగా నిలిచే అవకాశముంది. ప్రజల కష్టాలను పంచుకోగల రాజకీయ వ్యవస్థ మాత్రమే స్థిరమైన భవిష్యత్తును నిర్మించగలదన్న సందేశాన్ని శ్రీలంక ప్రపంచానికి అందించింది.

2.శ్రీలంకలో ప్రజా తిరుగుబాటు ఉధృతి పరాకాష్టకు చేరుకున్న రోజు 09-07-2022. ఆ రోజున నిరసనకారులు అధ్యక్ష భవనంలోకి ప్రవేశించారు. అనంతరం రాజకీయ అశాంతి తీవ్రరూపం దాల్చిన సమయంలో 09-05-2022న అప్పటి ప్రధానమంత్రి అధికార నివాసానికి నిప్పు పెట్టిన ఘటన జరిగింది. ఈ సంఘటనలు దేశ రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచాయి. ముగింపుగా విశ్లేషిస్తే, శ్రీలంకలో ప్రజాస్వామ్య వ్యవస్థపై ఉద్భవించిన మహా ప్రజా తిరుగుబాటు ఒక దేశ చరిత్రలో అరుదైన అధ్యాయంగా నిలిచింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై ప్రజలే రోడ్డెక్కి నిరసనలు



చేపట్టడం సాధారణ రాజకీయ సంఘటన కాదు; అది లోతైన ఆర్థిక, సామాజిక, నైతిక సంక్షోభానికి ప్రతీక. ఈ సంఘటనల మూలాలను అన్వేషిస్తే ప్రధానంగా కనిపించేది ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడమే. ఆర్థిక స్థిరత్వం ఏ దేశానికైనా వెన్నెముక. అది విరిగిపోతే రాజకీయ నిర్మాణం నిలబడలేదు. శ్రీలంకలో అదే జరిగింది. కొన్ని సంవత్సరాల పాటు తీసుకున్న అవివేక పూరిత ఆర్థిక నిర్ణయాలు దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయి. విదేశీ మారక నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. దిగుమతులపై ఆధారపడే ఆర్థిక నిర్మాణం ఒక్కసారిగా సంక్షోభంలో పడింది. ఇంధనం కొరత ఏర్పడింది. విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. పరిశ్రమలు నిలిచిపోయాయి. పర్యాటక రంగం పడిపోయింది. ఈ ప్రభావం నేరుగా ప్రజల జీవన ప్రమాణాలపై పడింది. ద్రవ్యోల్బణం అదుపు తప్పి పెరిగింది. కొనుగోలు శక్తి క్షీణించింది. ఆదాయం నిలిచిపోయింది. ఉపాధి అవకాశాలు క్షీణించాయి.

ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీసుకున్న విధాన నిర్ణయాలు తీవ్రమైన ప్రతికూల ఫలితాలను ఇచ్చాయి. రసాయన ఎరువుల దిగుమతులను అకస్మాత్తుగా నిషేధించడం, సేంద్రియ వ్యవసాయాన్ని వేగంగా అమలు చేయాలన్న ప్రయత్నం రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. దిగుబడులు పడిపోయాయి. వరి ఉత్పత్తి తగ్గింది. దేశం స్వయంపూర్తి సాధించగలిగే స్థితి నుంచి దిగుమతులపై ఆధారపడే పరిస్థితికి వెళ్లింది. రైతులు అప్పుల పాలయ్యారు. ఆహార కొరత మరింత తీవ్రమైంది.

ఈ పరిస్థితుల ప్రభావంగా ఆహార ధరలు ఆకాశాన్ని అంటాయి. ఒక దశలో బియ్యం కిలో ధర ₹1000కు చేరిన ఘటనలు నమోదయ్యాయి. టమాటాలు కిలో ₹500కు అమ్ముడైన సందర్భాలు ప్రజలను కలవరపరిచాయి. పాలు, గుడ్లు, కూరగాయలు, ఔషధాలు సాధారణ కుటుంబాలకు అందని ద్రవ్యాలుగా మారాయి. మధ్యతరగతి కుటుంబాలు తమ పొదుపులను ఖర్చు చేసి బతుకుదెరువు కొనసాగించాల్సి వచ్చింది. పేదలు ఆకలి బాధను అనుభవించారు. కొన్ని ప్రాంతాల్లో ఆకలి చావుల వార్తలు వినిపించాయి. పిల్లల పోషకాహార లోపం పెరిగింది.

ద్రవ్యోల్బణం పెరగడం వల్ల కేవలం ధరలే కాదు, సమాజంలో నిస్పృహ కూడా పెరిగింది. ప్రజలు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారు. నాయకులు విలాసవంతమైన జీవితం గడుపుతుండగా, సాధారణ పౌరులు ఇంధనం కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. వంట గ్యాస్ సిలిండర్ అందుబాటులో లేక కుటుంబాలు చెట్ల కొమ్మలతో వంట చేసుకున్న సందర్భాలు కనిపించాయి. విద్యార్థులు పరీక్షలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రుల్లో ఔషధాల కొరత తీవ్రంగా కనిపించింది.

ఈ విరుద్ధ దృశ్యం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రగిలించింది. ఒకవైపు రాజకీయ నాయకులు ప్రత్యేక భద్రత, అధికార వాహనాలు, సౌకర్యవంతమైన నివాసాలు అనుభవిస్తుండగా, మరోవైపు సామాన్య ప్రజలు ఆహారం కోసం పోరాడాల్సి రావడం నైతిక ఆగ్రహానికి దారి తీసింది. పాలక వర్గం వాస్తవ పరిస్థితిని గ్రహించలేదన్న భావన బలపడింది. ఈ భావన క్రమంగా సామూహిక నిరసనగా మారింది.

2022లో ప్రారంభమైన మహా నిరసనలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాయి. యువత, విద్యార్థులు, కార్మికులు, మహిళలు, రైతులు, మధ్యతరగతి ఉద్యోగులు ఒకే వేదికపైకి వచ్చారు. సామాజిక మాధ్యమాలు ఉద్యమానికి ఊపునిచ్చాయి. రాజధానిలో భారీ ప్రదర్శనలు జరిగాయి. అధ్యక్ష భవనం ముందు వేలాది మంది గుమిగూడారు. ఇది సాధారణ రాజకీయ నిరసన కాదు; జీవన హక్కు కోసం సాగిన పోరాటం.


ప్రజా ఆగ్రహం చివరకు పరాకాష్టకు చేరింది. అప్పటి అధ్యక్షుడు గొటబయ రాజపక్సా దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే తుది నిర్ణేతలని ఈ ఘటన ప్రపంచానికి గుర్తు చేసింది. ఎన్నికల ద్వారా వచ్చిన ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే ఎంతటి అధికారమున్నా నిలవలేనని ఈ సంఘటన చాటిచెప్పింది.

ఈ తిరుగుబాటుకు కేవలం ఆర్థిక అంశాలే కారణం కాదు; రాజకీయ వ్యవస్థలో పెరిగిన విలాసవాద ధోరణి కూడా ప్రధాన పాత్ర పోషించింది. ప్రజలు కష్టాల్లో ఉన్న వేళ నాయకులు తమ సౌకర్యాలను తగ్గించకుండా కొనసాగించడం ప్రజల మనసులో తీవ్ర వ్యతిరేకత కలిగించింది. అధికారాన్ని సేవగా కాకుండా హక్కుగా భావించిన దృక్పథం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ప్రజలు అర్థం చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో ఎంపీల పెన్షన్ రద్దు నిర్ణయం ఒక ప్రతీకాత్మక సంస్కరణగా కనిపిస్తుంది. ప్రజల కష్టాలను పంచుకోని రాజకీయ వ్యవస్థ నిలవదన్న అవగాహన పాలక వర్గానికి చేరింది. ప్రజా ధనం ప్రజల సంక్షేమానికి వినియోగించాలన్న సిద్ధాంతం బలపడింది. ఎన్నికైన ప్రతినిధులు ప్రత్యేక వర్గంగా కాకుండా సాధారణ పౌరుల భాగస్వాములుగా ఉండాలన్న భావన ముందుకు వచ్చింది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఎంతటి సామాజిక ప్రభావం చూపుతుందో శ్రీలంక అనుభవం స్పష్టంగా చూపించింది. ద్రవ్యోల్బణం పెరగడం కేవలం గణాంకం కాదు; అది కుటుంబాల ఆహారపు పళ్లెంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. కొనుగోలు శక్తి తగ్గిపోవడం అంటే పిల్లల విద్య ఆగిపోవడం. ధరలు పెరగడం అంటే ఆరోగ్య సేవలు అందకపోవడం. వ్యవసాయ రంగం క్షీణించడం అంటే దేశ భద్రత దెబ్బతినడం.

ఈ సంఘటనలన్నీ కలిపి ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో పరిమితం కాదు. ప్రజల జీవన ప్రమాణాలను రక్షించగల సామర్థ్యం ఉన్నప్పుడే అది సజీవంగా ఉంటుంది. పాలకులు ప్రజల బాధను అర్థం చేసుకుని విధానాలు రూపొందించాలి. పారదర్శకత, బాధ్యత, సమానత్వం ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం.

శ్రీలంక అనుభవం ప్రపంచ దేశాలకు హెచ్చరికగా నిలుస్తోంది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా సంక్షేమం సాధ్యం కాదు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచకపోతే సామాజిక అసంతృప్తి పెరుగుతుంది. రాజకీయ నాయకులు ప్రజల కంటే పై స్థాయిలో ఉన్నారన్న భావన ఏర్పడితే ప్రజాస్వామ్యానికి బలహీనత వస్తుంది.మొత్తానికి, శ్రీలంక ఉదాహరణ ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది అధికారం అన్న సత్యాన్ని మళ్లీ బలంగా గుర్తు చేసింది. విలాసవంతమైన రాజకీయ సంస్కృతి, ఆర్థిక అవ్యవస్థ, వ్యవసాయ పతనం, ద్రవ్యోల్బణం, కొనుగోలు శక్తి క్షీణత కలిసి ఒక దేశాన్ని సంక్షోభంలోకి నెట్టగలవని ఈ అధ్యాయం చెబుతోంది. ప్రజల ఆకలి, నిరాశ, ఆవేదనను విస్మరించే పాలన ఎక్కువకాలం నిలవదు. ప్రజలతో కలిసి నడిచే నాయకత్వమే స్థిరమైన భవిష్యత్తుకు మార్గం చూపగలదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# మహిళల్లో సాహిత్య పఠనం మరింత పెరగాలి

● ప్రముఖ కవి, రచయిత్రి ఓల్గా అంతరంగ ఆవిష్కరణ పుస్తకం ఆవిష్కరణ




**ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** స్వేచ్ఛతోనే మహిళలు తమ రచనల్లో మరింత సృజనాత్మకత పెరుగుతుందని ప్రముఖ కవి, రచయిత్రి ఓల్గా అన్నారు. మహిళల్లో సాహిత్య పఠనం మరింత పెరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలోని తంగిరాల చక్రవర్తి ప్రాంగణంలో జరుగుతున్న లిటరరీ ఫెస్ట్‌లో అంతర్గత ఆవిష్కరణ పుస్తకాన్ని ఓల్గా ఆవిష్కరించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్కే. సలీమా అధ్యక్షతన మహిళా సాహిత్యంపై కూలంకషంగా జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ..మహిళలు తమ అంతరంగాలను ఆవిష్కరించడం అంత సులువు కాదనీ, మహిళలు పూర్తి స్థాయిలో తమ అంతరగాన్ని బయటపెడితే అనేక ఇబ్బందులు ఎదురవుతాయని అభిప్రాయపడ్డారు. గతంలో మహిళలు నాలుగు అక్షరాలు నేర్చుకోవడానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చేదనీ, ఇప్పుడు పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయని చెప్పారు. తమను తాము నిరూపించుకోవాలనే తపన ప్రతి మహిళలోనూ ఉంటుందన్నారు. మహిళా సాహిత్యాన్ని వెలికి తీయడంలో మొదటి నుంచీ అంత ఫోకస్ లేదని చెప్పారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ మహిళలు రాణించారనీ, వారి గురించి శోధించి వెలికి తీయాల్సిన బాధ్యత నేటి యువ రచయితలపై ఉందని తెలిపారు. గత చరిత్రను పునర్ నిర్మిస్తూనే వర్తమానంలో ముందుకు సాగుతూ భవిష్యత్తును దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటు కుటుంబానికి, అటు ఉద్యోగాలకు సమయాన్ని ఎక్కువగా కేటాయించాల్సి రావడంతో ఎక్కువ మంది మహిళలు తమలోని భావాలను పేపర్‌పై పెట్టకుండానే లోలోపల కుంగిపోతున్నారని పలువురు రచయితలను ఉదహరించారు. మహిళలకు రచనల్లో స్వేచ్ఛనిచ్చి ప్రోత్సహిస్తే అద్భుత సాహిత్యం వస్తుందని చెప్పారు. విద్యావేత్త, రచయిత్రి అమృత లత మాట్లాడుతూ.. అంతరంగ ఆవిష్కరణ పుస్తకం మహిళలకు దిక్సూచి, ప్రేరణ కావాలని అభిలాషించారు. వరకట్నం, బాల్యవివాహాలు తగ్గుముఖం పడుతుంటే మహిళలకు కొత్త రూపాల్లో సమస్యలు ముందుకొస్తున్నాయని చెప్పారు. ఇలాంటి తరుణంలో తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన ఛాలెంజ్ నేటి యువత ముందు ఉందన్నారు. రచయిత్రులు, కవులు ఉప్పల పద్మ, సునంద, జ్వలిత, సంధ్య విప్లవ్, రూపారుక్మిణిలు మాట్లాడుతూ.. 52 మంది మహిళా రచయితల అంతరంగాన్ని ఒకే పుస్తకంలో ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. స్త్రీ సాహిత్యం సముద్రం లాంటిదన్నారు. తెలంగాణ ఉద్యమం, ప్రపంచ తెలుగు మహాసభల తర్వాత మహిళా రచయిత్రుల నుంచి రచనలు పెరిగాయన్నారు. అనంతరం తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కమిటీ ప్రచురించిన ' గోలకొండ కలాలు ' కవితా సంకలనాన్ని కవి యాకూబ్ ఆవిష్కరించారు. ఏ. వి. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కోయి కోటేశ్వరరావు, రాధా కుసుమ, ఏభూషి నరసింహ పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజల సొంత ఇల్లు కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** నీరు పేద ప్రజల సొంత ఇల్లు కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ దేవునిఎర్రవల్లి 3వ వార్డులో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సమతా వెంకట్ రెడ్డితో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ...పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, బక్కరెడ్డి మాధవియాది రెడ్డి, మాసన్నగారి మాణిక్య రెడ్డి, రవీందర్ రెడ్డి, నరేందర్ గౌడ్, జావిద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంచిరేవుల్లో ఘనంగా మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్‌లో గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో మంచిరేవుల మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గంపలు, మల్లన్న-భ్రమరాంబిక కళ్యాణం, అగ్నిగుండాలు, మల్లన్న బోనాలు వంటి కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు గుడిమల్కాపూర్ నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు తలారి మల్లేష్ ముదిరాజ్, కోట వేణు గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ లు హాజరై కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మవారిని కొలిచిన భక్తులకు కొంగు బంగారం వంటి దీవెనలు లభిస్తాయని, మల్లన్న స్వామి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం చివరి రోజు నాగవల్లి బోనాలు, ఒగ్గు కథ కార్యక్రమాలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గొల్ల కురుమ సంఘం కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్, మైలారం శ్రీనివాస్, జల్లి వెంకటేష్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహ ప్రవేశానికి నూతన వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి

● సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికిన మహిళలు



**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామ అనుసంధాన తండాలో భాగ్యమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మొట్టమొదటిసారిగా తమ తండాకు వచ్చిన ఎమ్మెల్యే గారికి తండావాసులు డప్పు వాయిద్యాల మధ్యన సాంప్రదాయ నృత్యాలు చేస్తూ పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యే గారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భాగ్యమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గారు దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మాకు సొంత ఇల్లు లేదని, అడవి ప్రాంతంలో ఉండే మా ఇంట్లోకి పాములు తేళ్లు వస్తున్నాయని ఇల్లు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో పదేపదే మాకు ఇల్లు ఇప్పించండి అని మొరపెట్టుకున్న అధికారులు ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోలేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని 5 లక్షల రూపాయలు రావడంతో తాము నూతన గృహాన్ని నిర్మించుకొని నేడు గృహప్రవేశం చేసుకుంటున్నామని భాగ్యమ్మ తెలిపింది. నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ ఎనుముల రేవంత్ రెడ్డికి, ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు హాజరవుతూ ఆ ఇంటి పెద్ద కొడుకుల దంపతులకు నూతన వస్త్రాలు అందిస్తున్న వనపర్తి శాసనసభ్యులు గౌరవ మేఘారెడ్డి గారికి భాగ్యమ్మ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామసులతో మాట్లాడారు ఈ సందర్భంగా వారు తండా అభివృద్ధికి కావలసిన పలు అంశాలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా ఆయన సంవత్సరం లోపల మీ తండాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తారని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల గ్రామ సర్పంచ్ ముంతా శిరీష, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ బి రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పి రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**శామీర్‌పేట్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని ఉప్పర్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి హాజరైనారు. కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి లబ్ధిదారులైన పోలమొల్ల జ్యోతి మునేశ్, బొక్క సలెమ్మ సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహ వసతి కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని, ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గృహప్రవేశం అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అతిథులకు సన్మానం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ నాయకులకు, అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొల్లబోయిన నాగమణి, సింగిరెడ్డి వేణు గోపాల్ రెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, గురిజాల బాబు, ఎలకూర్తి భాను చందర్, బాణాల భూపాల్ రెడ్డి, రాజ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలి




**బోడుప్పల్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజం మొత్తం కలిసి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ,ఫీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవిలు పిలుపునిచ్చారు. శాంతివనం రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు రన్ నిర్వహించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నారాపల్లి నందనవనంలో రన్ ఫర్ ఏ డ్రగ్ ఫ్రీ లైఫ్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. 16కే, 10కే, 5కే, 3కే విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌లో వందలాది మంది యువత, విద్యార్థులు, మహిళలు, ఫిట్‌నెస్ అభిమానం కలిగిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. "డ్రగ్స్ వద్దు - పుస్తకాలే ముద్దు" అనే నినాదాలతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రగ్స్ అనే సామాజిక వ్యాధి యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం అవసరమన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నాగోల్ ఎస్ హెచ్ ఓ మక్బూల్ జాని మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరమని, యువత దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీకాంత్ రెడ్డి, నిర్వాహకులు సోమశేఖర్, శేఖర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేటి తరం పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే విద్య అవసరం

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** తాండూరు మండలం జీనుగుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందీపని గురుకులం ఆవరణలో పలు భవనాలను ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపనల కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , కేంద్ర మంత్రి భూపతి రాజ్ శ్రీనివాస్ వర్మ , ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి , బాగయ్యతో కలిసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతం అయిన జిన్ గుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ్ వికాస్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విద్యను వ్యాపారం చేయకూడదనే ఉద్దేశ్యంతో కొనసాగుతున్న ఏకలవ్య ఫౌండేషన్ కు ఎల్లప్పుడూ తమ వంతు సహాకారం ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలిక లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్ అతి తక్కువ సమయంలోనే భారతదేశంలో ఉన్న అన్ని ప్రాంతల నుండి ప్రముఖులను ఫౌండేషన్ ఒకే వేదిక పైకి తేచ్చింది. భవిష్యత్తులో ఈ ప్రాంతం నుండి దేశానికి నాయకత్వం వహించే ఎంతో మంది నాయకులను, ఐఏఎస్ లను, శాస్త్రవేత్తలను, డాక్టర్స్ ను, లాయర్లను, అధికారులను ఎంతో మంది ప్రముఖులు ఈ ప్రాంతం నుండి దేశానికి ఫౌండేషన్ అందించబోతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడ అందరికి విద్యను అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్స్ పాఠశాల మన తాండూర్ లో పనులు ప్రారంభించడం జరిగింది. యువతకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో మన తాండూర్ లో ఏటీసీ సెంటర్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు, ఏకలవ్య ఫౌండేషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మూసీ సుందరీకరణ నిర్ణయంపై బీజేపీ వ్యతిరేకం

● ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని ఖండిస్తూ, మధు పార్క్ అపార్ట్మెంట్ నివాసులకు మద్దతుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బండ్లగూడ జాగీర్ బీజేపీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు మహాలింగం గౌడ్, భీమార్జున్ రెడ్డి, కిస్మిత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ "మూసి సుందరీకరణ" పేరిట ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల ఇళ్లను, జీవనాధారాలను ప్రమాదంలో పడేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. స్థానికుల ఆందోళనలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మధు పార్క్ అపార్ట్మెంట్ వాసుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని, అవసరమైతే మరింత తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రణాళిక బద్ధంగా బీటీ రోడ్ల పనులను చేయండి




**హయత్‌నగర్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** హయత్ నగర్ బస్ డిపో వెళ్ళు మార్గంలో జాతీయ రహదారికి అనుగుణంగా ఉన్న సర్వీస్ రోడ్డు, అనుసంధాన కాలనీ లింక్ రోడ్లకు నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరమని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు అనుగుణంగా సర్వీస్ రోడ్లు, కాలనీ లింక్ రోడ్లు బలమైన బీటీ రోడ్లుగా నిర్మించబడటం వల్ల స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు. ప్రత్యేకంగా హయత్ నగర్ బస్ డిపో పరిసర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మెరుగుపడితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా అభివృద్ధి చెందుతాయని వారు తెలియజేశారు. అన్ని లింక్ రోడ్లను కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా బీటీ రోడ్లుగా నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ, ప్రజల అవసరాలే తమ ప్రాధాన్యత, ఎల్లప్పుడూ ప్రజలతో కలిసే అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## సికింద్లాపూర్ లక్ష్మీనృసింహా స్వామికి జన జాతర



**శివ్వంపేట, మార్చి 22 (జనంసాక్షి) :** మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతం కొండల మధ్య స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీన్ర సింహస్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ఆరవ వారమైన ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవాలయంలో స్వామివారి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికీ పంచామృతాలతో అభిషేకం, అర్చన, వ్రత మండపంలో దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను పెద్దసంఖ్యలో ఆచరించారు. అంతకుముందు భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి, స్వామి వారికీ తల నీలాలు సమర్పించి, కొండపై ఉన్న దేవాలయానికి కాలినడకన చేరుకొని అక్కడ కూడా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మరికొందరు భక్తులు కొండపైన, అలాగే కింది దేవాలయం స్వామి వారికీ ఒడి బియ్యం పోసి వారి మొక్కలు చెల్లించుకున్నారు. అయితే ప్రతి సంవత్సరం ధనుర్మాసం నుంచి ఉగాది వరకు ప్రతి ఆదివారం సికింద్లాపూర్ లక్ష్మి నృసింహ స్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతర వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలతో పాటు చుట్టూ పక్కాల ప్రాంతాలు, గుండం వద్ద శుచిశుభ్రత పనులు, కొండపై దేవాలయానికి భక్తులు నేరుగా చేరుకునేలా తగు ఏర్పాట్లు చేశారు. కుటుంబ సమేతంగా దేవాలయాన్ని గదిలో చిన్న భక్తులు ఆలయ పరిసరా ప్రాంతాలలో వంట మార్పు చేపట్టి సామూహిక వన భోజనాలు చేశారు. క్రింది దేవాలయంలో వద్ద కూడా ఎవరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగ కుండా ఏర్పాట్లు చేశారు. జాతరలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శశిధర్, ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ, అర్చకులు విద్యాకర్ చారి, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, పూజారుల బృందం, సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వెల్దుర్తి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఇంటర్ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు. ఆదివారం ఆకస్మికంగా వెల్దుర్తి లోని కేజీబీవీ. తోపాటు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనకి నిర్వహించారు అనంతరం కలెక్టర్ కేజీబీవీ లోని ఇంటర్ టెన్త్ చదువుతున్న విద్యార్థులకు పాఠాలు బోధించి ప్రశ్నలు అడిగి వారిలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించారు. ఈనెల 25 నుండి వచ్చేనెల 14 నుండి ఇంటర్ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ప్రత్యేకత గదులు నిర్వహిస్తున్నామని అలాగే విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులకు ఎలాంటి పనులు చెప్పకుండా టీవీలు సెల్ ఫోన్లు చూడకుండా వారి దృష్టిని చదువుపై మళ్లించాలని సూచించారు. 10 వేలకు పైగా కేజీబీవీ విద్యార్థులే 10వ తరగతి పరీక్షలు రాయన్నరని ఆయన అన్నారు. కిజీబీవీ హాస్టల్లోని



నిత్యవసర సరుగుల స్టోర్ రూమును పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అలాగే వంట కోసం సరుకులు సరఫరా చేసే ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన వస్తువులను అందించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు పరిశీలించారు ముఖ్యంగా విద్యార్థులకు ఇచ్చే గుడ్లను నాణ్యతగా ఇస్తున్నారా సక్రమంగా ఇస్తున్నారా సక్రమంగా లేదా పరిశీలించి ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాదమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు గర్భిణీలకు ప్రజలకు అందిస్తున్న మెరుగైన వైద్యాన్ని ప్రజలు సద్విని చేసుకోవాలని సూచించారు పిహెచ్సి రిజిస్టర్లను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని దివ్యకాలిగా వ్యాధిగ్రస్తులకు నెలసరి అవసరపడే మందులను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని ప్రజలకు తెలియజేయాలని ఆస్పత్రి పౌర్ణమి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలి



**వీపనగండ్ల, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు స్థానిక ఎస్సై వివరిస్తూ రహదారి నియమాలు తప్పకుండా పాటించాలని అన్నారు. ఆదివారం వాహనాల తనిఖీలో భాగంగా బొల్లారం చౌరస్తాలో వాహనదారుల ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని వాహనం రిజిస్ట్రేషన్ పత్రం వెంట ఉండాలని అన్నారు. కారు నడిపే వ్యక్తులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని ప్రక్కన కూర్చునే వారు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** అమీన్పూర్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడిన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యతగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ఫ్రైడ్ పార్క్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సంస్కరణలలో భాగంగా ఇటీవల అమీన్పూర్ మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీనం కావడం జరిగిందనారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వెంటనే నిధులు కేటాయించాలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన జలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ షండు రంగ్షరెడ్డి నాయకులు కృష్ణ, ఉపేందర్ రెడ్డి, గోపాల్, తలారి రాములు, అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యం

- రాజోళలో ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్
- ఐదు చరవాణిలు, రూ:2100 నగదు స్వాధీనం
- హద్నూర్ ఎస్సై సుజిత్



**న్యాల్కల్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు మండల ప్రజానీకం, ప్రధానంగా యువత పోలీసులకు పూర్తిగా సహకరించాలని, సహకరించిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి మెరుపు దాడులు చేసి అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకట్ట వేస్తామని హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. ఆదివారం నమ్మదగిన సమాచారంతో పోలీసుల బృందంతో కలిసి తెలంగాణ - కర్ణాటక సరిహద్దు, మండలంలోని రాజోళ గ్రామ శివారులోని ఓ అటవీ ప్రాంతంలో జూదమాడుతున్న జూదరులపై మెరుపు దాడి చేశారు. పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి 5 చరవాణిలు (సెల్ ఫోన్లు), రూ:2100 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చెట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య

**నారాయణపేట, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సావర్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఎస్ఐ శ్రీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి వాహనదారుడి బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని, అందుకే ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది కేవలం చలానాల భయంతో




కాకుండా ప్రాణ రక్షణ కోసం అని చెప్పారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టపరంగా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధిక వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. విద్యార్థులు మరియు యువత ట్రాఫిక్ నియమాల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. వాహనదారులు అవసరమైన పత్రాలు – డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ – తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖతో సహకరించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ముందుకు రావాలని ట్రాఫిక్ ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు,ఎచ్ సి గోవింద్, వాహనదారులు తది తరులు పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో రెండు నెలల బాలిక మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కళావతమ్మ, పట్టణ కన్వీనర్ జయమ్మ డిమాండ్ చేశారు. ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కుమ్మరలో మల్లన్న జాతర సందర్భంగా రజక కులం కు చెందిన మహిళలు కీర్తి, మౌనిక దైవ దర్శనానికి రెండు నెలల పసిపాపతో కలిసి వెళ్ళగా అగ్రవర్ణానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్ని రెడ్డి తదితరులు అడ్డగించారన్నారు. ఎందుకు వెళ్ళనీయటం లేదని ప్రశ్నించినందుకు నోటితో చెప్పలేని బూతులు తిట్టి దాడికి దిగారు అన్నారు. ఆ కుటుంబానికి చెందిన గణేష్ ఎందుకు తిట్టారని అడిగితే అతన్ని దారుణంగా కొట్టారన్నారు. ఈ సంఘటనలు రెండు నెలల పాపను అగ్రకులాల వారు కాలితో తన్నితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిందన్నారు. మానవత్వం మరిచి



అమానుషంగా ప్రవర్తించిన అగ్రవర్ణాల నిందితులపై ఎస్సీ ఎస్టీ అత్యాచార, హత్యా నేరాల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, 24 గంటల్లో అరెస్టు చేయాలని, ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ జయమ్మ కోకన్వీనర్ శిరీష, జ్యోతి,సుప్రియ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఐదో తరగతి ప్రవేశ పరీక్ష



**వెల్దండ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గల కల్వకుర్తి ఏకలవ్య మోడల్ స్కూల్ లో ఆదివారం ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించామని, ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంటర్ కోడ్: 262308, ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు గాను మొత్తం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 324 మంది కాగా.. 298 మంది విద్యార్థులు హాజరయ్యారని, మిగతా 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ప్రవేశ పరీక్షకు మొత్తం 91.97 శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపట్టామని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా స్థానిక ఎస్సై కురుమూర్తి భద్రతా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

# హిందూ ముస్లింల ఐక్యత కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అబుల్ కలాం

- మెదక్ పురపాలక అధ్యక్షురాలు కానుగు రాధిక

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** హిందూ ముస్లింల ఐక్యత కోసం ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి, విద్యావేత్త మౌలాన అబుల్ కలాం ఆజాద్ అని మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక పేర్కొన్నారు. భారత స్వతంత్ర సమరయోధుడు, విద్యావేత్త, భారతరత్న అవార్డు గ్రహీత అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, పుర కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తులలో ఇతను ఒక్కరు. 1940–1946 వరకు కాంగ్రెస్ అధ్యక్షులుగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి... విద్యారంగంలో పలు సంస్కరణలకు ఆయన శ్రీకారం చుట్టారు. ప్రధానంగా ఐఐటీ, విశ్వ విద్యాలయాల స్థాపనకు ఎంతగానో కృషి చేశారు. ఆల్ – హిలాల్, ఆల్ – బలాగ్ పత్రికల ద్వారా స్వతంత్ర ఉద్యమాన్ని ఉర్దూలో నడిపించిన మహోన్నతమైన వ్యక్తి అజాద్ అని వివరించారు. ఆయన విద్యారంగంలో చేసిన పలు సేవలకు గాను... ఆధునిక భారత విద్యా వ్యవస్థ రూపకర్తలలో ఒకరిగా గుర్తించి, ఆయన మరణాంతరం భారతరత్న అవార్డును ప్రభుత్వం ప్రకటించిందనీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు చంద్రపాల్, కౌన్సిలర్ మన్సూర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్, నాయకులు బొజ్జ పవన్, గోదల సాయి,



సమీయుద్దీన్, అవారి శేఖర్, గాడి రమేష్, భవాని, లలిత, రాజేశ్వరి, ఓమర్, భరత్, దీపక్, గౌడ్, దేవి సింగ్, నాగరాజు, కాజా, తదితరులు ఉన్నారు.

# ఘనంగా సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి

- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి, పిసిబి మెంబర్ బాలాజీ సింగ్
- మున్సిపల్ చైర్ పర్సన్ బృంగిరత్నమాల, వైస్ చైర్పర్సన్ షానవాజ్ ఖాన్

**కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** శ్రీశ్రీశ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ జయంతినీ పురస్కరించుకొనికల్వకుర్తి పట్టణంలోని బంజారా సోదరులు నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్,టీ షార్ట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్,కల్వకుర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,కౌన్సిలర్లు పాల్గొనడం జరిగింది. కల్వకుర్తి మండలం కేంద్రంలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. బంజారా సోదరుల ఆధ్వర్యంలో ఈ



కార్యక్రమం బంజారా సమాజంలో అపూర్వ ఉత్సాహాన్ని నింపింది అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సిసిబి నెంబర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శనవాజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేడుకల సందర్భంగా బంజారఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శి అని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, సమాజంలో ఐక్యతా భావం, నైతిక విలువల పెంపుకు ఆయన చూపిన మార్గం శాశ్వతమని అన్నారు. బంజారా సోదరులు సామాజిక,ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి మౌలిక సదుపాయాల కల్పన, విద్యా–ఉపాధి అవకాశాల విస్తరణ కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బంజారా మహోత్సవాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సమాజం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ కౌన్సిలర్లు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ డైరెక్టర్లు,కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్,గిరిజన నాయకులు,గిరిజన కుల పెద్దలు, గిరిజన సంఘాల నాయకులు, నాయకురాలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్లు,మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు మాజీ వార్డు సభ్యులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాళికామాత ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి



**వెల్దుర్తి, ఫిబ్రవరి 23 (జనవరి సాక్షి) :** మన్నేవారి జలాల్ పూర్ గ్రామం లోని అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టి రథయాత్ర చేయడం మొదలు పెట్టడం జరిగింది. కాళీమాత గుడి నిర్మాణానికి ప్రతి ఒక్కరు విరాళాలు ఇచ్చేందుకు కృషి చేయాలని గ్రామ సర్పంచ్ కృష్ణ అన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మన్నేవారి జలాల్ పూర్ గ్రామ శివారులో కాళీమాత దేవాలయా నిర్మాణానికి గ్రామంలో పురవీధుల గుండ తిరుగుతూ విరాళాలు సేకరిస్తున్నారని తెలిపారు. అనంతరం అమ్మవారికి గ్రామస్తులు, దేవాలయం కమిటీ సభ్యులు, యువకులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, కాళికామాత యువస్థాపకుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు రామారావు సార్, లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, వెంకటేష్, సిద్ధిరాములు, బంగారు రాజ్, అక్షయ్,శేఖర్, నవనీత, గాయత్రి, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ, కాళీమాత గుడి నిర్మాణానికి గ్రామస్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ నిర్మాణం పూర్తి కావడానికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని ఆయన తెలిపారు.




## మంత్రి సురేఖ చేతుల మీదుగా గురుకుల డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్ విడుదల

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)** : రాష్ట్ర అడవి పర్యావరణ దేవాలయం శాఖ మంత్రి కొండా సురేఖ చే డిగ్రీ అడ్మిషన్స్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల వరంగల్ తూర్పు యందు 2026 బి 2027 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్స్ ప్రారంభమవుతాయని ఇంటర్మీడియట్ సెకండియర్ పూర్తయినా విద్యార్థినులు డిగ్రీలో చేరుటకు ఈ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ, మాస్సి సి ఎస్, బి జెడ్ సి ఎం జెడ్ సి, బీకాం కంప్యూటర్స్, బీకాం బిజినెస్ బిఎ గ్రూపులలో అవకాశం ఉందని, ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తారని, సెంట్రల్ గవర్నమెంట్ వారిచే స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు శిక్షణకూడా ఇస్తారనీ ఇలాంటి అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగ పరచుకోవాలని, ఉన్నత విద్యా ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం

**గోవిందరావుపేట (జనంసాక్షి)** : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కార్యాలయంలోని పై అంతస్తులో మధ్యాహ్నం సుమారు 12 నుండి ఒంటి గంట సమయంలో రికార్డు రూమ్ లో మంటలు వెలువడుతున్న దృశ్యాన్ని స్థానికులు చూసి కార్యాలయ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలియజేశారు. సిబ్బంది ఇక్బాల్ కార్యాలయానికి చేరుకుని హాస్టల్ విద్యార్థులు మరియు స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు యత్నించారు. తరువాత ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పి వేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చింది. స్థానిక ఎస్ ఐ తాజ్ ద్దీన్ తన పోలీసు సిబ్బంది సాయంతో ప్రమాద స్థలికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. అనంతరం కార్యదర్శులు ఇతర సిబ్బంది కూడా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని అగ్ని ప్రమాద సంఘటనను పరిశీలించారు. విద్యుత్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు వ్యాపించిన పై అంతస్థకు పవర్ బంద్ చేయించి, మంటలు ఆర్పేందుకు కృషి చేశారు. ప్రస్తుతం పై అంతస్తుకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిశీలించారు. కాగా ఎంపీడీవో కార్యాలయం లో విద్యుత్తు ప్రమాదం జరిగింది మంటలు ఎగిసిపడుతున్నాయి అన్న వార్త మండల వ్యాప్తంగా దావనంల వ్యాపించింది. ప్రస్తుతం మండలంలో ప్రమాద సంఘటన హాట్ టాపిక్ గా మారింది.





## బెల్లంపల్లి డంపింగ్ యార్డ్ సమస్యపై ఎమ్మెల్యే వినోద్ స్పందన

**నెన్నెల, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)** : బెల్లంపల్లి,నియోజకవర్గంలో డంపింగ్ యార్డ్ సమస్యపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తక్షణమే స్పందించారు. పట్టణంలోని రోజ్ గార్డెన్ పక్కన ఉన్న చెత్త డంపింగ్ యార్డ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి, సమీప బస్తీ వాసులు పొగ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన మున్సిపల్ చైర్పర్సన్ దావా స్వాతి రమేష్తో వెంటనే మాట్లాడారు. చైర్పర్సన్ స్వాతి రమేష్ ఉదయం డంపింగ్ యార్డ్‌ను సందర్శించి మున్సిపల్ అధికారులతో చర్చించి మంటలను ఆర్పించారు. త్వరలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





### డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తా : మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్

బెల్లంపల్లి పట్టణంలోని డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తానని అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్, వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ రోజ్ గార్డెన్ పక్కన గల డంపింగ్ యార్డును సందర్శించారు. డంపింగ్ యార్డులో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి చుట్టు ఉన్న బస్తీల్లో పొగ, విష వాయువులు రావడంతో ప్రజలు ఎమ్మెల్యే ద్రుష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వినోద్ చైర్ పర్సన్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీనికి స్పందించిన చైర్ పర్సన్ వెంటనే డంపింగ్ యార్డుకు చేరుకొని మంటల్ని ఆర్పివేయించారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి డంపింగ్ యార్డును తరలించి బస్తీ వాసుల సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ఆయన వెంట నాయకులు పోలు శ్రీనివాస్ నిజాముదిన్, నీలి కృష్ణ, పీక లక్ష్మణ్, వెంకట్, యూనుస్, ఖదీర్, జమ్మికుంట విజయ్, అసిఫ్, సునీల్, శ్రీనివాస్ ఉన్నారు.

## శ్రీ నాగులమ్మ జాతరకు రండి

- మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ చైర్మన్ రామకృష్ణ స్వామీజీ

**మంగపేట ఫిబ్రవరి 22(జనంసాక్షి)** : మండలంలో రాజుపేట (లక్ష్మీ నర్సాపూర్) గ్రామంలో సుప్రసిద్ధి చెందిన శ్రీ నాగులమ్మ జాతరకు తప్పక రావాలని మంత్రి సీతక్క కు ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ చైర్మన్ బాడిషా రామకృష్ణ స్వామీజీ. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ను మర్యాదపూర్వకంగా కలిసి మార్చి 3 నుండి 7 వరకు 5 రోజులు పాటు వైభవంగా నిర్వహించే శ్రీ నాగులమ్మ జాతరకు తప్పక హాజరుకావాలని ఆలయ చైర్మన్, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ ఆహ్వాన పత్రికను అలాగే అమ్మవారి ప్రసాదాలను మంత్రి సీతక్కకు అందజేశారు.



# బాధ్యతగా ఉండి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- ప్రజలకు మంచి సేవలు అందించి పేరు తెచ్చుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మున్సిపాలిటీలో పదవి బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్
- భూపాలపల్లిలో భారీ ర్యాలీ, బాణా సంచాలు కాల్చి సంబరాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మున్సిపాలిటీలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు బాధ్యతగా ఉండి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలకు మంచి సేవలు అందించి పేరు తెచ్చుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఆదివారం చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ నాయకత్వాన్ని ఎన్నుకున్నారని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేసి, అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. పారదర్శకతతో, ప్రజా సేవా దృక్పథంతో ముందుకు సాగాలని, పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజల విశ్వాసం నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమైందన్నారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను తీసుకువచ్చి, సమర్థవంతంగా వినియోగించి, భూపాలపల్లిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని అన్నారు. మనం అందరం కలిసికట్టుగా పనిచేస్తే భూపాలపల్లి అభివృద్ధి పథంలో ముందంజలో నిలుస్తుందని అని ఎమ్మెల్యే తెలిపారు.

### పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ..

భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచాలు కాలుస్తూ, సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని హనుమాన్ టెంపుల్ నుండి మున్సిపాలిటీ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొనగా, నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని, గజమాలలతో సన్మానాలు చేస్తూ, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉర్రూతలూగించే డిజే పాటలతో ర్యాలీ నిర్వహించి, మార్గమధ్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అంతకుముందు మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ లు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారికి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ పార్టీ నూతన కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ సత్తా



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)** : సైబరాబాద్ వేదిక నాలుగో రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు వివిధ క్రీడల్లో అద్భుతమైన ఆట తీరు ప్రదర్శించి ఈ క్రీడల్లో తమ సత్తాను చాటారు. ఆరురోజుల పాటు జరిగిన ఈ క్రీడలు శనివారం రాత్రి ముగిసాయి. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు మొత్తం 86 పతకాలను సాధించి పటకాల పట్టీకలో మూడో స్థానంలో నిలిచారు. సాధించిన పతకాల్లో 12 స్వర్ణాలు, 25 రజితాలు,49 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు ప్రధానంగా అర్చరీ క్రీడలో అత్యధికంగా ఐదు బంగారు పతకాలతో సహా మొత్తం 13 పతకాలను సాధించి అర్చరీ క్రీడలో తిరుగులేని ప్రదర్శన కనబరిచారు. ఇతర క్రీడల విషయంలో ఇదే రీతిలో వరంగల్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేసారు. జూడో క్రీడలో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు నాలుగు రజితా పతకాలను సాధించి జూడో చాంపియన్ షిప్ రన్నరప్‌గా ముఖ్య అతిధుల చేతుల మీదుగా ట్రోఫిని అందుకున్నారు. ఇదే రీతిలో బాక్సింగ్, ఆర్మ్స్ రెజ్లింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బ్యాట్మెంటెన్, టగ్ ఆఫ్ వార్‌లో,సైకిలింగ్, స్విమ్మింగ్,హాకీ విభాగాల్లో గతంలో కన్నా మెరుగైన ఆట తీరు చూపించారు. ప్రధానంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సైతం కాంస్య పతకాన్ని సాధించడం విశేషం. అలాగే పోలీస్ చరిత్రలో ఎన్నడూ ఫుట్‌బాల్ క్రీడలో పతకం సాధించని వరంగల్ కమిషనరేట్ ఈ క్రీడల్లో కాంస్య పతకాన్ని సాధించి క్రీడాకారుల్లో జోష్‌ను నింపారు. ముఖ్యంగా ఈ క్రీడల్లో అత్యధికంగా పతకాలను సాధించడానికి వరంగల్ పోలీస్ కమిషనర్ క్రీడాకారులను అందించిన ప్రోత్సహమే ప్రధాన కారణంగా క్రీడాకారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తుం చేసారు.

## రజకులపై అగ్రకుల పెత్తందార్ల దాడి అమానుషం

**పాలకుర్తి, ఫిబ్రవరి 22(జనంసాక్షి)** నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో అగ్రకులానికి కొంత మంది రజకులపై దాడి చేయడం అమానూషమని రజక సంఘం రాష్ట్ర నాయకుడు మాదరాజు యాకయ్య ఖండించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం కుమ్మెర గ్రామంలో జరిగిన జాతరలో టికెట్ లేకుండా గుడిలోనికి ప్రవేశించిన రజక కుటుంబంపై అదే గ్రామానికి చెందిన రెడ్డి కులస్తులు అతి కిరాతకంగా దాడి చేయగా రెండు. సంవత్సరాల పసి బిడ్డను కాలుతో తన్నడంతో మృతి చెందిందని ఆరోపించారు. పసిపాప మృతికి కారణమైన వారికి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి..




**బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** : బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం ఆవడం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆవడం గ్రామంలోని గుండ్ల చెరువులో చేపల పెట్టేందుకు వెళ్లిన మత్స్యకారుల్లో కునారపు లింగయ్య (58) అనే వ్యక్తి నీటిలో మునిగి చనిపోయాడు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం చేపలు పెట్టేందుకు ఉదయం మత్స్యకారులందరు గ్రామంలోని గుండ్ల చెరువుకు వెళ్లారు. చేపలు పడుతుండగా నీటి శాతం ఎక్కువ ఉన్నవైపు వెళ్లగా కాళ్లకు వల చుట్టుకోవడం తో అకస్మాత్తుగా నీటిలో మునిగి మృతి చెందినట్లు చెప్పారు. మృతుని భార్య రామక్కా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వృత్తి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బీద కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

## మాడిన మామిడిపూత... రైతన్న గుండెకోత...



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** : ఆశాజనకంగా ఉన్న మామిడి పూత వాతావరణ కారణాలతో మాడి పోవడంతో రైతన్నకు గుండెకోత మిగిలింది. బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం మామిడి పంటలకు ప్రసిద్ధి చెందింది. మామిడి పంటపై ఆధారపడి ప్రత్యేక్షంగా వందలాది కుటుంబాలు జీవిస్తుండగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రతి ఏడాది వాతావరణం అనుకూలించక పంటలు నష్టపోతున్నారు. ఈఏడాది సీజన్ ఆరంభంలో మామిడి పూత ఆశాజనకంగా ఉంది. గత నెలరోజులుగా ఉదయం పూట మబ్బులు, పొగ మంచు రావడం ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో వచ్చిన పూత మాడి పోయింది. పూత రాలకుండా రైతులు ఎన్ని మందులు పిచికారీ చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. సీజన్ ఆరంభంలో ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు వాతావరణం మొండిచెయ్యి చూపి రైతులను తీవ్ర నష్టాల్లోకి నెట్టింది. లక్షలాది రూపాయలు వెచ్చించి మామిడి పంట దిగుబడి పెరగాలని మందులు పిచికారీ చేసినప్పటికి అవి బూడిదలో పోసిన పన్నీరే అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి పంటకు ఇప్పటికే పిందెలు రావాల్సిన తరుణంలో వాతావరణంలో మబ్బులు, పొగమంచు కారణంగా పూత ఎండిపోయి రైతుల ఆశలు గల్లంతు చేసింది. ఇలా ఒక వైపు రైతుల ఆశలు నిరాశ కాగా మరోవైపు కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఎకరానికి లక్ష రూపాయలు చెల్లించి మామిడి తోటలు పట్టిన కౌలు రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. కౌలు డబ్బులు, మందుల ఖర్చులు కూడా వస్తాయో రావో అనే పరిస్థితుల్లో కౌలు రైతులు ఉన్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పూత మాడి పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతం అవుతున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## డిసిసి అధ్యక్షుల శిక్షణలో ఆత్రం సుగుణక్క



**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** : వికారాబాద్ జిల్లా, అనంతగిరిలో జరుగుతున్న సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు నిర్వహిస్తున్న పది రోజుల శిక్షణ శిబిరం రెండవ రోజు కార్యక్రమంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరై, పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, నాయకత్వ వికాసం వంటి అంశాలపై మార్గదర్శనం చేశారు.పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలపర్చడం, కార్యకర్తలతో సమన్వయం పెంపొందించడం, రాబోయే ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, శిక్షణలో పొందిన సూచనలను జిల్లాలో అమలు చేసి, పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## వారంపాటు రెండో దశ 'అరైవ్ అలైవ్'

- రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ద్యేయం
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణ భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అరైవ్ అలైవ్ 2026 రెండవ దశ కార్యక్రమాన్ని నేటి నుండి వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టబడుతుందని, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల తగ్గింపు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సురక్షితంగా ప్రయాణం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్ 22 ఫిబ్రవరి 2026 నుండి 28 ఫిబ్రవరి 2026 వరకు మొత్తం ఏడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ముఖ్య కూడళ్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. లైన్ డిసిప్లిన్ డ్రైవ్‌లో భాగంగా తప్పుగా ఓవర్‌టేకింగ్ చేసే వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించి, ఎడమ లైన్ డ్రైవింగ్‌ను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. హెల్మెట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు నిర్వహించి, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీట్‌బెల్ట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రధాన కూడళ్లలో నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదనే అంశంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణ పోలీస్ శాఖ ప్రధాన ద్యేయమని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్పీ తెలిపారు.

# సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి

**• బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ భారత రాణి**



**ఖమ్మం, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** విద్యార్థి దశ నుంచి సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని తద్వారా అన్ని సానుకూలంగా మారతాయని మనం ఏం కోరుకుంటామో అదే మన భవిష్యత్తు అని బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ జి.భారతరాణి అన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్పి క్యాంపు నందుగల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, బాలుర వసతి గృహ సముదాయం నందు ఒత్తిడి నిర్వహణ - సంతోషకరమైన బాల్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ జి.భారతరాణి మాట్లాడుతూ ఎవరి జీవితము పూలపాన్పు కాదని, కష్టతరమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ప్రయత్నం చేస్తేనే విజయం యొక్క రుచిని ఆస్వాదిస్తారని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన, సజ్జన సాంగత్యం, సానుకూల దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్న చిన్న విషయాలకి కృంగిపోవడము ఒత్తిడికి లోనవడము ఒంటరిని అనే భావనను వదిలివేయాలని, చదువుపై శ్రద్ధ ఆసక్తి , సాధన అనేది మన భవిష్యత్తు ను నిర్ణయిస్తాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులు సబ్జెక్టు పై పట్టు సాధించాలని చిన్నచిన్న విభాగాలుగా అంశాలను విభజించి చిత్రాల రూపంలో గుర్తుంచుకొని ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే చైల్డ్ లైన్ 1048 కి ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు. బాలలకు సహాయకారిగా ఉండడానికి నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎయిడ్ సంస్థ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరి ప్రసాద్ రావు మాట్లాడుతూ అపజయాలు ఎప్పుడూ మన భవిష్యత్తుకు కొలమానం కాదని, కృంగిపోకుండా మరోసారి ప్రయత్నం లోపం లేకుండా శ్రద్ధ పెడితే విజయం చేతికందుతుంది అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారని ఇది చాలా సాధారణ విషయమని దానిని అధిగమించాలంటే మనల్ని మనం తెలుసుకోవడం ఏకైక మార్గమని తెలిపారు. భావోద్వేగాలను అణిచివేయకుండా, నమ్మకమైన వ్యక్తులతో చర్చించడం ద్వారా లేదా మనసుకు నచ్చిన పని ఏదైనా ఆటలు ఆడడం, డ్రాయింగ్, బుక్ రీడింగ్, ధ్యానం, వంటివి అలవాటు చేసుకోవడం ద్వారా ఆందోళన తగ్గించుకోవచ్చని తెలిపారు. తమ సంస్థ ద్వారా నిరంతరం బాలలకు మానసిక ఒత్తిడి అధిగమించడానికి అవగాహన కార్యక్రమంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, వసతి గృహ సంక్షేమ అధికారులు టీ.స్టాలిన్, ఎన్.రమేష్, నాల్గవ తరగతి సిబ్బంది ఎస్.తిరుపతిరావు, రాములు,ఇందిర, మరియు కాంప్లెక్స్ వసతిగృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నాపత్రాలు



**నేరేడుచర్ల, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** ఈనెల 25 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ కు ఇంటర్ ప్రశ్నా పత్రాలను అధికారులు కట్టుదిట్టమైన భద్రతా నడుమన తీసుకువచ్చారు.ఈ సందర్భంగా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల,స్పందన జూనియర్ కళాశాలకి సంబంధించి ప్యాక్ చేసిన ప్రశ్న పత్రాలను పరిశీలించి, పోలీసుల ఆధ్వర్యంలో ప్రశ్న పత్రాలను ట్రంక్ పెట్టెలలో పోలీస్ స్టేషన్ లాకర్లలో భద్రపరిచారు.అనంతరం కస్టోడియన్ ఇన్చార్జి ప్రిన్సిపల్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 25నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్ష ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా భద్రపరిచామన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రతతో ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కస్టోడియన్, చీఫ్ సూపరింటెంట్ వెంకటరమణ వీరన్న,డిపార్ట్మెంట్ ఆఫీసర్ తీగల రమేష్,నాగరాజు,సూర్యాపేట జిల్లా జూనియర్ కాలేజ్ లెక్చరర్,రూట్ ఆఫీసర్ డా "సతీష్, అంజయ్య,మోతె రాజు,శ్రీను పోలీసులు పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మరక్షణ శారీరక దృఢత్వం



**సూర్యాపేట, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తుందని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమీ విద్యార్థులు ఇటీవల హైదరాబాదులోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యూ డ్రాగన్ ఫైట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన షిఫ్ట్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ లో గెలుపొందిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశ నుండే శారీరక దారుఢ్యానికి ఉపయోగపడే కరాటే వంటి వాటితో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.నేటి సమాజంలో బాలికలకు కరాటే ఎంతో అవసరమని గుర్తు చేశారు.కరాటేలో రాణించి జిల్లాకు రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ జెవి రమణ, ఆర్.సంతోష్, రిషికేష్, అక్షర, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ రహదారిపై ప్రయాణం బహు పరేషాన్

**• నడిరోడ్డుపై కంకరకుప్పలుగా పోసి గాలికి వదిలిన వైనం**

**• పొంచి ఉన్న పెను ప్రమాదం**



**పెనుబల్లి, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** జాతీయ రహదారిపై సిమెంట్ కంకర కుప్పలకారణంగా వాహన చోదకులకు చాలా ఇబ్బందికరంగా తయారయ్యాయి. జాతీయ రహదారిపై గుంటలు పూడ్చటానికి సిమెంటు కంకర కుప్పలుగా పోసి అర్థాంతరంగా వదిలేసిన వైనం విజయవాడ-భద్రాచలం జాతీయ రహదారి పై దర్శనమిస్తుంది, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం గ్రామం నుండి తుమ్మలపల్లి, కుప్పెనకుంట, ముత్తగూడెం గ్రామాల వరకు జాతీయ రహదారిపై ఇలాంటి ప్రమాద పరిస్థితి నెలకొన్నది. ఈ గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ప్రయాణం వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. గత 15 రోజులుగా ఈ రహదారిపై పరిస్థితులను పట్టించుకున్న అధికారులే లేరు. ఈ గ్రామాల ప్రజలు కానీ వాహన చోదకులు గాని ఈ రహదారి పరిస్థితిలను ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి. ఈ రహదారిపై ఈ దిమ్మలు వాహన చోదకులకు దగ్గరగా వస్తే కానీ కనిపించట్లేదు. పొరపాటున వేగంగావస్తూ సడన్ బ్రేకులు వేసినా, ఈ దిమ్మలను ఎక్కించినా పెను ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. సాంకేతిక ప్రమాణాలను పక్కనపెట్టి చేసిన పనులకు తోడు ఇలా గాలికి వదిలేసి వెళ్లడం పట్ల సంబంధిత అధికారులపై, ఇలాపనులు చేసిన వారిపై వాహన చోదకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుంచి ప్రజావాణి కార్యక్రమం యథాతథం

**• కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమంను నేటి నుండి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యథాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

## మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన కల్లూరు మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు



**కల్లూరు, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** నూతనంగా ఎన్నికైన కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్, ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, పలువురు కౌన్సిలర్లు ఆదివారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవిన్యూ , గృహ నిర్మాణ, ఐ అండ్ పి ఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌన్సిలర్లుగా విజయం సాధించిన వారితోపాటు ఎన్నికల్లో పలు వార్డుల్లో ఓటమిపాలైన అభ్యర్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. ఇదే తరుణంలోకల్లూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించిన ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, తల్లపురెడ్డి అనిమిరెడ్డి,పలువురు పార్టీ ముఖ్యులను ప్రత్యేకంగా శాలువాలతో సత్కరించారు. అనంతరంకల్లూరుమున్సిపాలిటీ,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి నివాస గృహంలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో పాల్గొన్నారు.

## మల్కంబ పోటీల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ

**• కాంస్య పథకాలు సాధించిన విద్యార్థులు**




**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ 2026 రెండో ఎడిషన్ రాష్ట్ర స్థాయి మల్కంబ పోటీల్లో పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న ట్రినిటీ విద్యార్థులు కత్తి అక్షిత, శ్రీ గణేష్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచి, కాంస్య పతకాలను సాధించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పతకాలను అందజేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ అందించిన పీఈటీలు కిరణ్ కుమార్, గోపాల్, హారతిలను ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, డైరెక్టర్ ప్రిన్సిపాల్ డా.ఉజ్జిని మంజుల అభినందించారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకై కృషి చేస్తామని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు లు అన్నారు. వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు విజ్ఞప్తి మేరకు అతను ప్రాతినిధ్యం వహిస్తున్న 21వ వార్డులో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ శాఖ పరమైన, వీధి దీపాలు ఏర్పాటు చేయు విభాగము, వాటర్ సప్లై విభాగము, శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగంనికి సంబంధించిన మున్సిపల్ శాఖ అధికారులు 20 మంది సంబంధిత శాఖ సిబ్బంది 21వ వార్డులో క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రజలకున్నటువంటి సమస్యలను తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పడిన పాలకవర్గం సహకారంతో 21వ వార్డులో ఉన్నటువంటి, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరచుటకు, వీధి దీపాలలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడటం, శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరుచుటకు, అవసరమగుచోట సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయుటకు, పూర్తి సహకారం అందిస్తూ పట్టణంలోని అన్ని వార్డుల్లో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కృషి చేయుటకు నూతన పాలకవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని, దేవాలయాల అభివృద్ధి విషయంలో కూడా మంచి దృక్పథంతో ముందుకు వెళ్తామని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. హుజూర్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు మాట్లాడుతూ గౌరవ మంత్రివర్యులు కెప్టెన్ నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి సహకారంతో మరియు చైర్మన్ సహకారంతో 21వ వార్డును మరియు హుజూర్నగర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతూ, అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తూ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తూ, వీధి దీపాలు కొరత లేకుండా, పట్టణంలో పరిశుభ్రతకు,ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటం జరుగుతుందని, దానితోపాటు అన్ని మతాలకు సంబంధించిన దేవాలయాల వద్ద కూడా పరిశుభ్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రముఖ రైస్ మిల్లర్ కుక్కడపు రామ్మోహన్ రావు, చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ పరమైన ఉద్యోగులు, శానిటరీ ఇన్స్పెక్టర్ మెరిగ అశోక్, ఇంజనీరింగ్ విభాగం డి వినోద్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఏ.ఈ రాజశేఖర్, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై శానిటేషన్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్ వీర్లపాటి భాస్కర్, స్థానికులు కెవిఎన్ మూర్తి, చల్లా కృష్ణయ్య అడ్వకేట్, దోసపాటి నరసింహారావు, త్రిపురం అంజయ్య, ఎల్లవుల సైదులు, ఎర్రంశెట్టి పిచ్చయ్య, ఎస్కే ఉద్దండు, చలపతిరావు, గొట్టే నాగరాజు యాదవ్,సలిగంటి గణేష్, కొమ్మగాని వెంకటేశ్వర్లు, బొడ్డు గోవిందరావు, యాదగిరి, స్వరూప, నవ్య, అప్పారావు, రఫీ, సాయి, రాజు తదితరులు ఉన్నారు.

## హత్య కేసు చేధించిన పోలీస్‌లు



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ సాధారణ మరణం కాదని, పక్కాగా ప్లాన్ చేసిన సుపారీ హత్యేనని ఖమ్మం పోలీస్ లు నిర్ధారించారు. ఈ హత్యకు ఆర్థిక లా వాదేవీలే కారణమని స్పష్టం చేశారు. శ్రీని వాసును హత్య చేసిన తర్వాత నిందితులు ఆయన మృతదే హాన్ని పాలేరు రిజర్వాయర్లో పడేశారని, ఈ తతంగాన్ని కారు ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులను, ప్రజలను తప్పుదోవ పట్టించేం దుకు నిం దితులు విఫలయత్నం చేసినట్లు తమ ద ర్యాప్తులో తేలిందన్నారు. ప్రధాన నిందితుడు వేణుమాధవరెడ్డితో పాటు నలుగు రిని కూసుమంచి పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. నిందితులను విచారించగా హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి.

# ఎదులాపురాన్ని రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

**• కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిశానిర్దేశం**

**• మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనిత బాధ్యతలు స్వీకరణ**

**ఎదులాపురం, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీనీ రాష్ట్రం లోనే రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతామని తెలంగాణ రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల వరకే రాజకీయం గెలిచినా తర్వాత ఎపార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరుపున పేదవాడికి సేవా చేయాల్సిందేనని, పదవి అనేది అధికారం కాదు బాధ్యతని గుర్తించాలన్నారు.

### ఫీల్డ్‌లో ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుంది

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి నూతన ప్రజాప్రతినిధులకు తనదైన శైలిలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారని, కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. "ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదు రోజులు, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలి. ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది" అని ఆదేశాలు జారీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికినీరు నిలవకుండా చూడటం, నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇంటి వేడుకలో ఆత్మీయత

అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపి, ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు.



పేదల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ ,మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# సబ్బు, షాంపూ ధరలు ప్రియం!

### ఎఫ్‌ఎమ్‌సీజీ వస్తువులు 5% వరకు పెరుగుతున్నాయ్

### జీఎస్‌టీ రేట్ల కోత ప్రభావం ముగింపు దశకు


**న్యూఢిల్లీ:**రోజువారీ వినియోగించే సబ్బులు, టూత్‌పేస్ట్‌-బ్రష్‌లు, షాంపూల వంటి ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ధరలను కంపెనీలు 5% వరకు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయని సమాచారం. గతేడాది సెప్టెంబరులో వీటిపై జీఎస్‌టీ రేటును 12% నుంచి 5 శాతానికి తగ్గించడంతో, కంపెనీలు ఆమేర ధరలు తగ్గించాయి. ఇప్పటివరకు ఈ ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉంటూ వచ్చాయి. 'జీఎస్‌టీ రేట్ల కోత ప్రభావం ముగింపు దశకి వచ్చినట్లు ఉందని, తయారీదార్లు కొన్ని ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ధరలను 5% వరకు పెంచే పనిలో ఉన్నారని' ఆంగ్లపత్రికలు తెలిపాయి. కమొడిటీల ధరలు పెరగడం, రూపాయి క్షీణత కారణంగా, కంపెనీల మార్జిన్లపై ప్రభావం పడుతుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. పెంచిన గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)లు ముద్రించిన ప్యాక్‌ల వస్తువులు తమకు సరఫరా అయినట్లు డిస్ట్రిబ్యూటర్‌లు చెబుతున్నారు. డిటర్జెంట్లు, తలనూనె, చాక్‌లెట్‌లు, నూడిల్స్‌, అల్పాహారంగా తీసుకునే పలు ఉత్పత్తుల ధరలు పెంచుతున్నట్లు సమాచారం. ప్రస్తుత త్రైమాసికంలో 2% ధరలు పెంచుతామని డాబర్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహిత్ మల్హోత్రా పేర్కొన్నారు కూడా. 2026-27లోనూ ధరల పెంపు కొనసాగొచ్చని ఆయన తెలిపారు. గృహ సంరక్షణ ఉత్పత్తుల ధరల పెంపు త్వరలోనే ఉంటుందని.. ఇప్పటికే పెంచిన ధరలతో ఉత్పత్తులను మార్కెట్లోకి పంపించామని హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ముఖ్య ఆర్థిక అధికారి నిరంజన గుప్తా తెలిపారు. సర్ఫ్ ఎక్సెల్, రిన్, విమ్, డోమెక్స్ లాంటి గృహ సంరక్షణ విభాగ ఉత్పత్తుల ధరలను హెచ్‌యూఎల్ పెంచుతోంది. డిసెంబరు త్రైమాసికంలోనే టీ ధరలను కొంత మేర పెంచినట్లు టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ తెలిపింది.



# బెంగళూరు, ఢిల్లీ, ముంబయిలదే ఆధిపత్యం

- ఏఐ కొలువుల్లో మెట్రో నగరాల జోరు
- సీబీఆర్‌ఈ నివేదిక

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) ఉద్యోగాల్లో మెట్రో నగరాలు దూసుకెళ్తున్నాయి. నౌకరీ.కామ్ పోర్టల్‌పై దాదాపు 70 శాతం ఏఐకు సంబంధించిన ఉద్యోగాలు.. బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయిల్లోనే ఉంటున్నాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ సీబీఆర్‌ఈ తాజా నివేదికలో వెల్లడించింది. 2025 డిసెంబరు నాటికి నౌకరీ పోర్టల్‌పై ఉన్న 64,500 క్రియాశీల ఏఐ ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి, ఈ నివేదికను వెలువరించింది. మొత్తం ఏఐ అనుబంధ ఉద్యోగాల్లో బెంగళూరు 25.4 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో దిల్లీ-ఎన్‌సీఆర్ (24.8%), ముంబయి (19.2%) ఉన్నాయి. నౌకరీ పోర్టల్‌లో ఏఐ కింద నమోదైన ఉద్యోగ లిస్టింగ్‌ల డేటాను మాత్రమే తీసుకున్నామని, దేశంలో మొత్తం ఏఐ ఉద్యోగాల మార్కెట్‌ను ఇది ప్రతిబింబించదని సీబీఆర్‌ఈ స్పష్టం చేసింది. ఏఐ ఉద్యోగాల మార్కెట్‌లో హైదరాబాద్ (12.5%), పుణె (9.6%), చెన్నై (6.4%), కోల్‌కతా (2.1%) వాటాలను కలిగి ఉన్నాయి. ప్రస్తుతం ఏఐ విభాగంలో ప్రధానంగా ఇంజినీరింగ్ (సాఫ్ట్‌వేర్, క్వాలిటీ అస్యూరెన్స్), డేటా సైన్స్- అనలిటిక్స్, కస్టమర్ సేవలు, కార్యకలాపాల రంగాల్లో నియామకాలు జోరుగా సాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లకు కేంద్రంగా



ఉండటంతో ఏఐ ఉద్యోగాల్లో బెంగళూరు ఆధిపత్యం చెలాయిస్తోంది. 'ఏఐ అనేది ఇప్పుడు కేవలం ఒక చర్చాంశం కాదు. భారత ఆర్థిక వృద్ధిలో కీలక భాగం. అంతర్జాతీయ సంస్థలు మన దేశాన్ని కేవలం సేవా కేంద్రంగానే కాకుండా, సరికొత్త ఆవిష్కరణల హబ్‌గా చూస్తున్నాయి' అని సీబీఆర్‌ఈ ఇండియా ఛైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ పేర్కొన్నారు. కొత్తగా డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న తాజా ఉత్తీర్ణులు (ఫ్రెషర్స్)కు శుభవార్త. 2026 ప్రథమార్థం (జనవరి-జూన్)లో ఫ్రెషర్లను నియమించుకోవడానికి దాదాపు 73 శాతం కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని 'టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ కెరీర్ ఔట్‌లుక్' నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి-జూన్‌లో నాలుగింట మూడు (73%) కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలకు మొగ్గుచూపాయి. అంతక్రితం ఆరు నెలలతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. దేశంలో పలు నగరాలు, పరిశ్రమలకు చెందిన దాదాపు 1051 కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను వెలువరించారు. నైపుణ్యాలకే పట్టం: ప్రస్తుతం కంపెనీలు కేవలం అకాడమిక్ సర్టిఫికేట్లను మాత్రమే చూడటం లేదని, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. కేవలం డిగ్రీ ఉన్న వారి కంటే, పని నేర్చుకుని నిరూపించుకున్న వారికే త్వరగా కొలువులు లభిస్తున్నాయి అని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ సీఈఓ శంతను రూజ్ తెలిపారు. రంగాల వారీగా చూస్తే.. రిటెయిల్ (91%), ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థలు (90%), తయారీ (85%), పర్యాటకం, ఆతిథ్యం (77%) గిరాకీ లభిస్తోంది. రిటెయిల్‌లో డార్క్ స్టోర్ అసిస్టెంట్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ఉద్యోగాలకు మంచి గిరాకీ ఉంది. ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థల్లో డిజిటల్ సేల్స్ అసోసియేట్, జూనియర్ వెబ్ డెవలపర్ స్థానాలకు ఆదరణ దక్కుతోంది. తయారీలో బ్యాటరీ అసెంబ్లీ టెక్నీషియన్, ఇన్వెంటరీ, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్ స్థానాలకు ఎక్కువ గిరాకీ ఉంది. 84 శాతం ఫ్రెషర్ల నియామకాలతో దేశంలోనే అగ్రస్థానంలో బెంగళూరు నిలిచింది. ఇక్కడ ఐటీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డిజిటల్ మార్కెటింగ్ విభాగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముంబయి (72%) రెండో స్థానంలో ఉంది. రిటెయిల్, ఎఫ్‌ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఇక్కడ అత్యధిక ఉద్యోగాలు లభిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లకు ప్రాధాన్యం: డిగ్రీతో పాటు అప్రెంటిస్‌షిప్ చేసే సంస్కృతి పెరుగుతోందని, ముఖ్యంగా బెంగళూరులో 45 శాతం కంపెనీలు 'డిగ్రీ అప్రెంటిస్‌షిప్' అభ్యర్థుల పట్ల ఆసక్తి చూపుతున్నాయని నివేదిక పేర్కొంది. విద్యుత్, ఇంధన రంగాల్లో గతంతో పోలిస్తే గిరాకీ 50 శాతం మేర పెరగడం విశేషం.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,46,000 | ₹ 1,59,280 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,90,000

# ఇతరులను అనుకరించకండి.. సొంతంగా ఆవిష్కరించండి

**న్యూఢిల్లీ:**మార్కెట్ వ్యవస్థలు ఇతరులను అనుకరించడం మానుకోవాలని, సొంతంగా ఆవిష్కరణలు చేయాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సునీల్ కదమ్ సూచించారు. శనివారం స్టాక్ బ్రోకర్ల సంఘం ఏఎన్‌ఎంఐ ముంబయిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవల చైనాకు చెందిన ఒక ఉత్పత్తిని కొందరు మన దేశంలోనే తయారు చేసినట్లుగా చెప్పి, ప్రదర్శించడం మనం చూశాం. ఇది వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. మనం ఆ విధంగా ఇతరులను అనుకరించకూడదు. సొంత ఆవిష్కరణలు చేయాలి' అని కదమ్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ పరిశోధన, అభివృద్ధి రంగాల్లోకి మరింత నిధులను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆవిష్కరణలలో అగ్రగామిగా మారే సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం చైనా కంపెనీ తయారు చేసిన 'రోబో డాగ్'ను తన సొంత ఆవిష్కరణగా ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ప్రదర్శించిన సంగతి విదితమే. వ్యాపార నమూనాలను కృత్రిమ మేధ (ఏఐ) సమూలంగా మార్చబోతోందని, విలువలను లెక్కించడం వంటి అంశాలను అంచనా వేసేందుకు, సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలో మార్కెట్ వ్యవస్థ అర్థం చేసుకోవాలని సూచించారు. సాంకేతికంగా మనం ఏఐ టెక్నాలజీకి తప్పనిసరిగా అలవాటుపడాలని తెలిపారు. పెట్టుబడిదారులకు ఏదైనా ఒక కంపెనీ లేదా మార్కెట్ గురించి వివిధ భాషల్లో, మరింత సమాచారం అందించేందుకు వీలుగా ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టేందుకు సెబీ కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. నానో సెకన్లలో..: ఇదే సమావేశంలో ఎన్‌ఎస్‌ఈ చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏప్రిల్ 11 నుంచి భారతీయ మార్కెట్లు నానో సెకన్లలోనే ట్రేడింగ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం ప్రారంభిస్తాయని వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ట్రేడింగ్ విధానంతో పోల్చితే 1,000 రెట్లు అధిక వేగం అని తెలిపారు.


## రేపటి నుంచి క్లీన్‌మ్యాక్స్ ఐపీఓ

దిల్లీ: వాణిజ్య, పారిశ్రామిక పునరుత్పాదక ఇంధన సంస్థ క్లీన్‌మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ రూ.3,100 కోట్ల ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమై, బుధవారం ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.1,000-1,053. తాజా షేర్ల జారీ ద్వారా రూ.1,200 కోట్లు సమీకరించనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)లో ప్రమోటర్లు, వాటాదార్లు రూ.1,900 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 14 షేర్లకు (రూ.14,742) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యాంకర్ మదుపర్ల నుంచి కంపెనీ ఐపీఓకు ముందే రూ.921 కోట్లు సమీకరించింది. టెమాసెక్ హోల్డింగ్స్, నొమురా అసెట్ మేనేజ్‌మెంట్ ఈస్ట్‌స్ప్రింగ్, ఎస్‌బీఐ లైఫ్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్ప్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఏడీఐఏ ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్, ఎస్‌బీఐ జనరల్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, 360 వన్ మ్యూచువల్ ఫండ్ వంటి విదేశీ (32 శాతం), దేశీయ సంస్థలు (68 శాతం) యాంకర్ రౌండ్‌లో పాల్గొన్నాయి. బీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం ప్రకారం, క్లీన్‌మ్యాక్స్ ఆయా సంస్థలకు 87,46,437 షేర్లను ఒక్కోటి రూ.1,053 చొప్పున కేటాయించింది.

# రిఫండ్ ప్రక్రియ సంక్లిష్టమే

### కొద్ది నెలల సమయం పట్టొచ్చు: విశ్లేషకులు

**వాషింగ్టన్:**ట్రంప్ విధించిన టారిఫ్‌లపై సుప్రీం కోర్టు తీర్పయితే వచ్చింది కానీ.. ప్రపంచ దేశాల నుంచి వసూలు చేసిన భారీ మొత్తాన్ని ఎలా తిరిగి చెల్లిస్తారనే విషయమై అనిశ్చితి నెలకొంది. ట్రంప్ ప్రభుత్వానికి టారిఫ్‌ల ద్వారా ఇప్పటివరకు సుమారు 133 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తం భారత కరెన్సీలో దాదాపు రూ.12 లక్షల కోట్లు. ఇప్పుడు ఆ డబ్బును ఎలా తిరిగి ఇస్తారనేదే పెద్ద ప్రశ్న. ట్రంప్ ప్రభుత్వం దిగుమతుల ద్వారా 133 బిలియన్ డాలర్లు వసూలు చేయడం చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ప్రకటించారు. ఈ రిఫండ్లు ప్రధానంగా వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకే అందుతాయని తెలుస్తోంది. వస్తువుల ధరలు పెరగడం వల్ల నష్టపోయిన సాధారణ వినియోగదారులకు డబ్బులు వాపసు వచ్చే అవకాశం తక్కువని సమాచారం. ఈ నేపథ్యంలో రిఫండ్ కోసం కంపెనీలు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా కేసులు నమోదైనట్టు సమాచారం. మరిన్ని కేసులు దాఖలయ్యే అవకాశాలున్నాయి. రిఫండ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉండబోతోందని న్యాయ నిపుణులు అంటున్నారు. దీనికి 12 నుంచి 18 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భారీ మొత్తంలో డబ్బు వెనక్కి తిరిగి ఇవ్వాల్సి ఉండటంతో కంపెనీల కోసం ట్రంప్ ప్రభుత్వం ఓ వెబ్‌సైట్ రూపొందించే అవకాశం ఉన్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. రిఫండ్ ప్రక్రియలో పలు న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ సరఫరాదారులకు ఏదైనా రిఫండ్ దక్కితే దానిలో భాగం కావాలని



ఉత్పత్తిదారులు కేసులువేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఈ తరహా ఘటనల్లో కొన్నేళ్ల నుంచి కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఇది కోర్టుల్లో మరో అయిదేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పలు రాష్ట్రాల గవర్నర్లు తమ రాష్ట్ర ప్రజల తరపున బిలియన్ల కొద్దీ డాలర్లను ట్రంప్ ప్రభుత్వం నుంచి రిఫండ్‌గా డిమాండ్ చేస్తున్నారు. సెక్షన్ 232 కింద ఉక్కు, అల్యూమినియంపై విధించిన 50 శాతం సుంకం, కొన్ని వాహన విడిభాగాలపై ఉన్న 25 శాతం సుంకాలు యథాతథంగా కొనసాగుతాయి. ఈ అంశంపై స్పష్టత కోసం భారత ప్రతినిధి బృందం వచ్చే వారం అమెరికా వెళ్లనుంది. భారత ఎగుమతిదారులకు, ముఖ్యంగా కార్మికులు ఎక్కువగా పనిచేసే వస్త్ర, ఆభరణాల రంగాలకు రాబోయే 150 రోజుల పాటు ఈ తగ్గిన టారిఫ్ రేటు పెద్ద ఊరటనిస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా మనకు ఎందుకు ముఖ్యం అంటే.. 2021-25 మధ్య భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత మొత్తం ఎగుమతుల్లో 18% వాటా అగ్రరాజ్యానిదే. 2024-25లో ద్వైపాక్షిక వాణిజ్యం 186 బి.డాలర్లు(రూ.16.7 లక్షల కోట్లు)గా ఉంది. సేవల విషయానికొచ్చినా భారత్ నుంచి 28.7 బి.డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయి. మొత్తం మీద (వస్తువులు, సేవలు) చూస్తే వాణిజ్య మిగులు అమెరికాతో 44.4 బి. డాలర్లుగా ఉంది. 2024లో ఈ రంగాల నుంచే అధిక ఎగుమతులు: ఫార్ములేషన్లు, బయోలాజికల్స్ (8.1 బి.డాలర్లు), టెలికాం ఇన్‌స్ట్రుమెంట్లు (6.5 బి. డాలర్లు), విలువైన, పాక్షిక విలువైన రాళ్లు (5.3 బి.డాలర్లు), పెట్రోలియం ఉత్పత్తులు (4.1 బి.డాలర్లు), వాహన, వాహన విడిభాగాలు (2.8 బి.డాలర్లు), బంగారం, ఇతర ఆభరణాలు (3.2 బి.డాలర్లు), రెడీమేడ్ దుస్తులు, యాక్సెసరీలు (2.8 బి. డాలర్లు), ఇనుము-ఉక్కు ఉత్పత్తులు (2.7 బి. డాలర్లు). 'సుంకాలపై శుక్రవారం అమెరికా సుప్రీంకోర్టు తీర్పును గమనించాం. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే స్పందించారు. ఆ దేశ యంత్రాంగం కొన్ని చర్యలను ప్రకటించింది. ఈ పరిణామాలన్నింటి ప్రభావాలపైనా నిశితంగా అధ్యయనం చేస్తున్నాం.''అమెరికా సుప్రీం కోర్టు నేపథ్యంలో ప్రతీకార సుంకాలు తగ్గాయి. ఆ దేశంతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని భారత్ పునఃసమీక్షించుకోవాలి. ప్రస్తుతం అమెరికాకు భారత ఎగుమతుల విలువలో 55 శాతంపై మాత్రమే ప్రతీకార సుంకాలు వర్తిస్తాయి. సుమారు 40 శాతం వస్తువులు మినహాయింపు పొందిన విభాగాల్లో ఉన్నాయి. అయితే రంగాల వారీ సుంకాలు (ఉక్కు, అల్యూమినియం, రాగి-50 శాతం, కొన్ని వాహన విడిభాగాలు -25 శాతం) కొనసాగుతాయి'. 'ఇప్పుడు భారతీయ వస్తువులపై సుంకాలు తగ్గాయి. అమెరికాలో ప్రస్తుతం ఉన్న మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్‌ఎన్) లేదా దిగుమతి సుంకాలకు మించి ఇవి ఉంటాయి. ఉదాహరణకు ఒక ఉత్పత్తి 5 శాతం ఎంఎఫ్‌ఎన్ సుంకాన్ని ఎదుర్కొంటుంటే, అదనంగా ట్రంప్ ప్రకటించిన సుంకాన్ని విధిస్తారు. గతంలో ఇది 5+25 శాతంగా ఉంది'.



# రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై చర్చ

### వచ్చే వారంలో డిఫ్‌శాట్ సదస్సు

**న్యూఢిల్లీ:**రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై భారత సైన్యంలోని ఉన్నతాధికార్లు, విధాన రూపకర్తలు, సాంకేతికత భాగస్వాములు, సంస్థల ప్రతినిధులు చర్చించనున్నారు. వచ్చే వారం దిల్లీలో జరగనున్న డిఫ్‌శాట్ నాలుగో ఎడిషన్ సదస్సు ఇందుకు వేదిక కానుంది. జాతీయ భద్రతలో అంతరిక్ష రంగ పాత్రపై ఫిబ్రవరి 24-26 వరకు మానేక్‌షా సెంటర్ వద్ద ఈ సదస్సు జరగనుంది. 'అంతర్జాతీయంగా 50కి పైగా దేశాలు మిలిటరీ లేదా డ్యుయల్ యూజ్ శాటిలైట్‌లను ఉపయోగిస్తున్నాయి. శత్రు దాడులను నిరోధించడం, ఎదుర్కొనే సన్నద్ధత విషయంలో అంతరిక్ష సాంకేతికత కూడా కీలకంగా మారింద'ని శాట్‌కామ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) ఇండియా ప్రెసిడెంట్ సుబ్బారావు పావులూరి తెలిపారు. డిఫ్‌శాట్-2026 సదస్సులో సుమారు 20 దేశాల నుంచి 500 మంది పాల్గొననున్నారు. 20 మందికి పైగా వక్తలు, సుమారు 60 సంస్థల ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. కాగా.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల సమర్పించిన బడ్జెట్లో రక్షణ రంగానికి గణనీయంగా రూ.7.85 లక్షల కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రక్షణ విషయంలో ముందస్తు సన్నద్ధత కోసం భారత్ భారీగా వెచ్చిస్తోందనడానికి ఈ కేటాయింపులే సంకేతమని ఎస్ఐఏ ఇండియా డైరెక్టర్ జనరల్ అనిల్ ప్రకాశ్ తెలిపారు.

# అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు..

### పలువురి మృతి

**ఇస్లామబాద్:**ఉగ్రవాదులే లక్ష్యంగా అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ దాడులు చేపట్టింది. పాక్- అఫ్గాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ ఘటనలో పలువురు అఫ్గాన్ పౌరులు మృతిచెందారు. ఇటీవల తమ దేశంలో జరిగిన ఆత్మాహుతి దాడుల నేపథ్యంలో దాడులు నిర్వహించినట్లు పాక్ పేర్కొంది. సంగర్హార్, పాక్టికా ప్రావిన్స్‌లలో శనివారం అర్ధరాత్రి దాటాక తమ పౌరుల నివాసాలపై పాక్ బాంబులతో దాడి చేసిందని, ఈ ఘటనలో డజన్ల కొద్దీ చనిపోయారని అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనను పాకిస్తాన్ ధ్రువీకరించింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఏడు టెర్రరిస్ట్ క్యాంపులపై దాడులు చేపట్టినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి తరూర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాకిస్థానీ తాలిబాన్, దాని అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఐసిస్ అనుబంధ గ్రూప్‌పై సైతం దాడి చేసినట్లు తరూర్ పేర్కొన్నారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో మసీద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని తామే చేసినట్లు ఐసిస్ ప్రకటించుకుంది. ఈ ఘటనలో 31 మంది పాక్ పౌరులు మృతి చెందగా, 161 మంది గాయపడిన విషయం తెలిసిందే.

# శరద్ పవార్‌కు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు



నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను పుణెలోని రుబీ హాల్ ఆసుపత్రికి తరలించినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. తీవ్రమైన దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో ఇటీవల ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్‌ను వారం క్రితం తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మళ్లీ ఆసుపత్రిలో చేర్చినట్లు తెలుస్తోంది. ఆయన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. కొన్ని రోజులుగా పవార్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే తెలిపారు.

# మార్చిలో యాత్ర అనుమానమే!

### నాసా చందమామ రాకెట్‌లో మరో సమస్య

కేప్ కెనావెరాల్: చందమామ వద్దకు మానవసహిత యాత్ర నిర్వహించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా సిద్ధం చేసిన స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్‌ఎల్‌ఎస్) రాకెట్‌లో మరో సమస్య తలెత్తింది. దీంతో వచ్చే నెలలో నిర్వహించతలపెట్టిన యాత్ర అనుమానాస్పదంగా మారింది. రాకెట్ ఎగువదశలో హీలియం ప్రవాహానికి అవాంతరం తలెత్తింది. ప్రయోగం కోసం ఘన హీలియం ప్రవాహం అవసరం. తాజా పరిస్థితుల్లో డేటా మొత్తాన్నీ విశ్లేషిస్తున్నట్లు నాసా పేర్కొంది. అవసరమైతే ఎస్‌ఎల్‌ఎస్ రాకెట్‌ను ఫ్లోరిడాలోని కెనెడీ అంతరిక్ష కేంద్రంలోని హ్యాంగర్‌కు తరలించి మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపింది. మొత్తంమీద ఇది మార్చిలో ప్రయోగానికి ఉన్న అవకాశంపై ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తోందని పేర్కొంది. అర్టెమిస్-2 పేరుతో చంద్రుడి వద్దకు నాసా ఈ యాత్రను నిర్వహించతలపెట్టింది. దీనిద్వారా నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక చంద్రుడిని చుట్టి, భూమికి తిరిగొస్తుంది. దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత నాసా.. చంద్రమండలం వద్దకు మానవసహిత యాత్రను నిర్వహిస్తోంది.

# అమెరికాలో హిందువులే విద్యాధికులు

హ్యూస్టన్: అమెరికాలో అత్యంత విద్యాధిక మతవర్గం హిందువులేనని ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన ఒక సర్వే నివేదిక వెల్లడించింది. యూదులు అత్యంత విద్యాధికుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. వివిధ మతవర్గాల స్థితిగతులపై 2023-24లో నిర్వహించిన రిలిజియస్ ల్యాండ్‌స్కేప్ సమగ్ర సర్వే (ఆర్‌ఎల్‌ఎస్)లో వెలువడిన గణాంకాల ఆధారంగా ఈ అధ్యయన నివేదిక వెలువరించారు. అమెరికాలో నివసిస్తున్న ప్రతి పదిమంది హిందువుల్లో ఏడుగురు.. అంటే 70% మంది పట్టభద్రులు కాగా యూదుల్లో 65% మందికి బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్నట్టు గుర్తించారు. అమెరికా మొత్తం జనాభాలో పట్టభద్రులు సరాసరిన 35% మాత్రమే. జాతీయ సరాసరి కన్నా ఎక్కువ శాతం మంది ముస్లింలు, బౌద్ధులు, సనాతన క్రైస్తవులు, సాధారణ ప్రొటెస్టెంట్ క్రైస్తవులు పట్టభద్రులుగా ఉన్నట్టు సర్వేలో తేలింది. ఇవాంజెలికల్ ప్రొటెస్టెంట్లు, కేథలిక్కులు జాతీయ సరాసరి కన్నా తక్కువ సంఖ్యలో పట్టభద్రులైనట్టు వెల్లడైంది. హిందువులు, ముస్లింలు, బౌద్ధుల్లో అత్యధికులు ఉన్నత విద్యాభ్యాసం కోసమే అమెరికాకు వస్తున్నందున వారిలో పట్టభద్రుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు సర్వే తెలియజేసింది. దీనికోసం 2023-24 మధ్య 36,908 మందిని ప్రశ్నించారు.



## కోతుల పారద్రోలేందుకు ఎలుగుబంటి అవతారం

### రాంరెడ్డిపల్లి సర్పంచ్ వినూత్న ప్రయోగం

**మర్రిగూడ, ఫిబ్రవరి 21(జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో కోతుల బెడదను వదిలించుకోవడానికి సర్పంచ్ లపంగి నర్సింహా ఒక వింతైన,ఆసక్తికరమైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో కోతుల అల్లరి మితిమీరి పోవడంతో, వాటిని భయపెట్టి పారద్రోలేందుకు ఆయన ఎలుగుబంటి వేషధారణను ఆశ్రయించారు.గత కొంత కాలంగా రాంరెడ్డిపల్లిలో కోతుల గుంపులు ఇళ్లపై పడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా,గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.ఎన్ని ప్రయత్నాలు చేసినా కోతులు గ్రామాన్ని వదిలి వెళ్లకపోవడంతో ఒక వినూత్న ఆలోచన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్క వెంకటయ్య,కడారి ఎర్రయ్య, బలుసుల మల్లయ్య, కారింగు సాంబయ్య,ఎడ్ల యాదయ్య,ఏపూరు ముత్తయ్య, లపంగి నర్సింహా పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ఆత్మీయత ప్రతీక ఇఫ్తార్ విందు





**చేవెళ్ల, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** మత సామరస్యానికి ఆత్మీయత ప్రతీక ఇఫ్తార్ విందు అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఆదివారం సర్పంచ్ పామేన రాములు తంగడపల్లి మజీద్ వద్ద సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలోని కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై ప్రాణం తీసుకున్న కార్మికుడు

**ముత్తారం ఫిబ్రవరి 22(జనంసాక్షి ):** మద్యానికి బానిసై గ్రామపంచాయతీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చంద మొగిలి(44)మద్యానికి బానిసై శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్యాపూర్ గ్రామానికి చెందిన మొగిలి గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులను నిర్వహిస్తూ ఉండే వాడని కొన్ని రోజులు గా మద్యానికి అలవాటు పడ్డాడు.కుటుంబ సభ్యులు చాలాసార్లు వద్దు అని చెప్పినప్పటికీ తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవలు చేస్తూ మద్యం తాగితే పిచ్చిగా వ్యవహరిస్తూ తన ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని తలుపులు తీసేవాడు కాదని కొన్నిసార్లు కుటుంబ సభ్యులు మద్యం మానవేయాలని హాస్పిటల్ చూపించడంతో డాక్టర్లు మద్యం మానివేయాలని చెప్పిన వినకుండా ఉండేవాడని ఈనెల 21 రోజున సాయంత్రం మద్యం తాగి వచ్చి తన భార్య తిట్టుకుంటూ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ముత్తారం ఎస్సై రవికుమార్ తెలిపారు.



# శేరిలింగంపల్లి సర్కిల్‌కు భారమైన చైన్‌మెన్

## అర్జీలు పట్టించుకోడు... క్షేత్ర పర్యటనకు వెళ్లేది లేదు!

### ఫీల్డ్ సర్వేలు లేక అధికారులకు ఇబ్బందులు

- పని వద్దు... పైసలే ముద్దు అనే ధోరణి
- రిటైర్మెంట్ దగ్గర్లో ఉండి బాధ్యతలు తూలనాడుతున్నారు
- శేరిలింగంపల్లి సర్కిల్‌కు భారంగా మారిన చైన్ మెన్...
- తక్షణమే తొలగించాలంటూ స్థానికుల డిమాండ్

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :**
చైన్ మెన్... పట్టణ ప్రణాళిక విభాగం లో కీలక భూమిక పోషించే కిందిస్థాయి క్రియాశీల పాత్ర. టౌన్ ప్లానింగ్ విభాగానికి అందే ఫిర్యాదులను అధికారుల నుండి స్వీకరించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సమగ్ర నివేదికను అందజేయడం ద్వారా పట్టణ ప్రణాళిక అభివృద్ధి భాగంలో చోటు చేసుకునే అక్రమాలను నిరోధించడానికి ఇది ఒక బాధ్యతాయుతమైన విధి. అయితే శేరిలింగంపల్లిలో ప్రస్తుతం ఉన్న చైన్ మెన్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం తో చైన్ మెన్ అన్న పదానికి అర్థమే మారిపోతుంది. తాను చేయాల్సిన పనులను ఒక్కటంటే ఒక్కటి చేయకపోగా... అధికారుల నుండి ఫిర్యాదులను స్వీకరించకపోవడం, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం, గడచిన కాలంలో ఆశించినమేర సదరు చైన్ మెన్ నుండి ఒక్క నివేదిక అధికారులకు అందకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

**ఫీల్డ్ సర్వేకు వెళ్లేది లేదు... టౌన్ ప్లానింగ్ అధికారులకు సహకరించేది లేదు**

ప్రస్తుత శేరిలింగంపల్లి సర్కిల్ గచ్చిబౌలి డివిజన్ చైన్ మెన్ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో వివాదాస్పద క్రింది స్థాయి ఉద్యోగిగా, బాధ్యతలను తూలనాడుతూ ఒక కొరకరాని కొయ్యలా తయారైనట్లు జిహెచ్ఎంసి కార్యాలయం ఉద్యోగులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఫీల్డ్ సర్వే కు వెళ్లి క్షేత్ర పరిశీలన చేయాల్సిన సమయంలో తాను త్వరలోనే రిటైర్మెంట్ కాబో తున్నానని, తాను సర్వేకు వెళ్లేది లేదని తెగేసి చెప్తున్నట్లు సర్కిల్ కార్యాలయం సిబ్బంది చెప్పుకుంటూ ఉండడం గమనార్హం. దీనికి తోడు అతనికి కేటాయించిన వార్డుల వైపు వేరే సిబ్బందిని పంపిస్తే వారితో వాదనకు దిగుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతు న్నారు. దీంతో పట్టణ ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు అతని పై సరైన చర్యలు తీసుకోలేక, ఫిర్యాదులపై నివేదికలు అతని ద్వారా తెప్పించుకోలేక తలలు పట్టుకొని కూర్చుంటున్నారని, ఏం చేయాలో అధికారులకు పాలు పోవడం లేదని ఆరోపణలు సైతం వెల్లువెత్తు తున్నాయి. ఉన్నతాధికారులకు సైతం ఎలా ఫిర్యాదు చేయాలో అర్థంకాని దుస్థితిలో శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు జుట్టు పీక్కుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**పని వద్దు... పైసలే ముద్దు!**

**అందిన కాడికి దోచుకుంటున్న చైన్ మెన్!?**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ టెలికాం నగర్, ప్రశాంతి హిల్స్, వినాయక్ నగర్, ఖాజా గూడా, గౌలిదొడ్డి, ఎన్టీఆర్ నగర్, గోపనపల్లి, నల్లగండ్ల హుడా పలు ప్రాంతాలలో చైన్ మెన్ గా కొనసాగుతున్న ప్రస్తుత ఉద్యోగి స్థానికంగా టౌన్ ప్లానింగ్ కు సంబంధించి ఎన్నో ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి సర్వే చేసి నివేదిక అందజేయాల్సిన చైన్ మెన్ వివాదాస్పద స్థలాలు, అక్రమ భవన దారుల దగ్గరికివెళ్లి తన రాబడికి సంబంధించిన సర్వేలు చేసుకుంటూ అందినకాడికి దండుకోవడం రివాజుగా మార్చుకున్నట్లు సర్కిల్ కార్యాలయంలో బాహాటంగా చెప్పుకుంటూ ఉండడం గమనార్హం. ఉద్దేశపూర్వకంగానే శేరిలింగంపల్లి ప్రాంతానికి బదిలీపై వచ్చిన చైన్ మెన్ తనకున్న పలుకుబడి, ఉద్యోగ అనుభవంతో ఎక్కడికక్కడ సెటిల్మెంట్లు చేస్తూ రెండు చేతుల సంపాదిస్తున్నట్లు స్థానికులు దుయ్యబడుతున్నారు. ఒక్కటంటే ఒక్క సర్వేకు వెళ్లి నిజాయితీగా ఇప్పటివరకు నివేదికను అందజేయలేదని, కానీ పదుల సంఖ్యలో అక్రమ భవనాలను చక్కబెట్టడానికి మాత్రం తీవ్రంగా శ్రమిస్తూ భారీ మొత్తంలో వెనకేసుకున్నట్లు కార్యాలయ సిబ్బంది కోడై కూస్తుండడం విశేషం! ఇలాంటి అవినీతి చైన్ మెన్ తో శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయానికి ఒరిగేదేమీ లేదని, తక్షణమే అతడిని విధుల నుండి తప్పించి సర్కిల్ పట్టణ ప్రణాళికా విభాగం కార్యాలయానికి వస్తున్న అపవాదును తొలగించుకోవాల్సిన అవసరం ఉందని శేర్లింగంపల్లి ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

*పెద్ద శంకరంపేట్, ఫిబ్రవరి 22 : హైదరాబాద్ నుండి కామారెడ్డి జిల్లా బాన్సువాడకు తరలివెళ్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను 161 జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కింగ్స్ 9 రెస్టారెంట్ వద్ద మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తోపాటు పోలీసులు ముందస్తుగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అదుపులోకి తీసుకొని పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.*






## కొడంగల్ రైతు కంపెనీకి సీజీఐ 3 ఏళ్ల సహకారం

- 300 మంది మహిళా రైతుల సమీక్ష
- సేంద్రియ సాగులో విజయవంతమైన మూడేళ్ల ప్రయాణం
- ఒక్కొక్కరికి ఒక ఎకరం సేంద్రియ వ్యవసాయం
- మహిళా సాధికారత - 60 మందికి ఉపాధి
- భవిష్యత్‌లో అగ్రి ప్రాసెసింగ్ జోన్, డెయిరీ యూనిట్లు

**కొడంగల్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి):**
కొడంగల్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీకి సీజీఐ సంస్థ ఆర్థిక సహకారం మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడు వందల మంది మహిళా సేంద్రియ రైతులతో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో రైతుల పూర్తి భాగస్వామ్యంతో జరిగింది. గత మూడేళ్లుగా సీజీఐ సంస్థ సేంద్రియ వ్యవసాయం అభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తోంది. సమావేశా నికి సీజీఐ సంస్థ ప్రతినిధులు సంతనగోపాలన్, పి. కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతులతో సంభాషించి సహకారం ప్రభావాన్ని సమీక్షించారు.కంపెనీ అధ్యక్షురాలు ఎడిగి నాగమ్మ మాట్లాడుతూ, మూడేళ్లలో మూడు వందల మంది మహిళా రైతులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక ఎకరం సేంద్రియ సాగు చేపట్టారని తెలిపారు. భవిష్యత్తులో ఈ విస్తీర్ణాన్ని రెండు ఎకరాలకు పెంచాలని సంకల్పం వ్యక్తం చేశారు. మరిన్ని మూడు వందల మంది రైతులు సేంద్రియ వ్యవసాయానికి ఆసక్తి చూపుతున్నారని, సీజీఐ సహకారం నిరంతరం కొనసాగాలని కోరారు. సేంద్రియ వ్యవసాయంతో పాటు అరవై మంది మహిళలతో మహిళా స్వయం ఉపాధి కార్యక్రమం అమలు చేయడం ద్వారా వారు ఉత్పత్తిదారుల కంపెనీలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులుగా ఉపాధి పొందుతున్నారు. మిగిలిన మహిళలు చిన్న వ్యాపారాలు ప్రారంభించి స్వయం ఉపాధి సాధించారు. ఈ విజయానికి సీజీఐ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.సమావేశంలో రైతులు పండించిన సేంద్రియ పంటలు, ప్రాసెసింగ్ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించారు. అనంతరం గ్రామాలు, పొలాలను సందర్శించిన సీజీఐ ప్రతినిధులు రైతుల పనితీరును అభినందించి మరిన్ని ప్రోత్సాహాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు సమావేశంలో పాల్గొని మహిళల సమూహాలు సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నందున డెయిరీ యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కంపెనీ జనరల్ మేనేజర్ మొహమ్మద్ వసీమ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో వ్యవసాయ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేసి రైతుల పంటలకు విలువాధిక్యం కల్పించి క్రేయో బ్రాండ్ ద్వారా మార్కెట్లోకి తీసుకెళ్లాలని, బయో ఇన్‌పుట్ యూనిట్, డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సీజీఐ సంస్థ నుంచి సంతనగోపాలన్, పి. కిరణ్ కుమార్, యాక్సెస్ లైవ్‌లై హుడ్స్ సంస్థ ప్రతినిధులు కృష్ణగోపాల్, రాకేష్, భవ్య, కంపెనీ అధ్యక్షురాలు నాగమ్మ, వెంకటమ్మ, నర్సమ్మ, భీమమ్మ, అమూర్త మ్మ, సిబ్బంది అబ్దుల్ రజాక్, చంద్రకళ, నీళమ్మ, విశ్వజ, జనరల్ మేనేజర్ మొహమ్మద్ వసీమ్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం మూడు వందల మంది మహిళా సేంద్రియ రైతులు పాల్గొన్నారు.



# పాత కాంగ్రెస్ పాతర... కొత్త వాళ్ల జాతర



- పని చేసిన కార్యకర్తలు పక్కన పడేసి పైరవీ కారుల రాజ్యం
- బీఆర్ఎస్‌తో పోరాడిన వారికి వీధి పాలు, అవమానాలు
- డబ్బు, కులం, లాబీయింగ్‌తో కొత్త వాళ్ల హవా
- త్యాగాలు మరచి అహంకారం.. పార్టీకి మళ్లీ అపజయం?
- ఏ పార్టీలోఅయినా పని చేసే వారు పరాయి వారేనా..?

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22 (జనం సాక్షి):**
ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో కంటికి రెప్పలాగా కాపాడిన పాత కార్యకర్తలు, సామాజిక వేత్తలు, నాయకులు నేడు పూర్తిగా పక్కన పడేయబడ్డారు. వారి కష్టార్జితం మీదనే నేటి నాయకులు అధికార పదవులు, హోదా, దర్పం అనుభవిస్తున్నారు. కానీ నాడు చెమటోడ్చి, రక్తం కక్కి, కేసులు ఎదుర్కొని పార్టీని కాపాడిన వారు నేడు చెరిపివేయబడ్డారు. పార్టీ కోసం అన్నం, నీళ్లు మానుకుని, కుటుంబాలను పట్టించుకోకుండా రోడ్లపై తిరిగిన వారికి ఇప్పుడు ఒక్క సీటు కూడా దక్కలేదు. ఒక్క పదవి కూడా ఇవ్వలేదు. వారు ఇప్పుడు వీధుల్లో తిరుగుతున్నారు, క్యాంపు కార్యాలయాల వైపు కూడా చూడని స్థితి.

పార్టీ కోసం పని చేసిన క్రమంలో ఎన్ని అవమానాలు, బెదిరింపులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వారు వెనకడుగు వేయలేదు. ఇతర పార్టీల నుంచి వచ్చే బహుమానాలకు, ఆఫర్లకు ఎన్నడూ లొంగలేదు. కేవలం కాంగ్రెస్ పార్టీ కోసం, గాంధీ కుటుంబం చేసిన త్యాగాల కోసం, రేవంత్ రెడ్డి నాయకత్వం కోసం మాత్రమే నిలబడ్డారు. చిరిగిన చొక్కా తొడిగి, ఖాళీ జేబులతో కూడా కాంగ్రెస్ కండువాను, జెండాను పదిలంగా కాపాడుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌ను సర్వనాశనం చేయాలని ప్రయత్నించినప్పుడు, మాజీ మంత్రులు ప్రతి సందర్భంలో ఇబ్బందులు పెట్టినప్పుడు కూడా సామాన్య కార్యకర్తలు ఒంటరిగా నిలబడి పోరాడారు. వారి సజీవ సాక్ష్యాలు ఇప్పటికీ జిల్లా నలుమూలలా ఉన్నాయి.

కానీ అధికారం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అందలం ఎక్కిన నాయకులు పాత కార్యకర్తలను కనుచూపు మేరలో కూడా చూడడం లేదు. పని చేసిన వారిని కనపడకుండా చేసి, క్యాంపు కార్యాలయాలకు రాకుండా అవమానాలు చేసి, పల్లకి ఎక్కిన నాయకులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అధినాయకులకు పార్టీలు మారినంత సులువుగా క్యాడర్‌ను మార్చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం, గెలుపు కోసం రక్తం కక్కిన వారు పరాయి వారైపోయారు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారు రాజ్యమేలుతున్నారు. ఎక్కడ చూసినా వారి హడావుడి మాత్రమే కనిపిస్తోంది. పాత చెవులకన్నా కొత్త కొమ్ములకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

డబ్బు ఉంటే, కులం ఉంటే, లాబీయింగ్ ఉంటే మాత్రమే అవకాశాలు దక్కుతున్నాయి. కొందరు నాయకులు డబ్బుందని భావిస్తే మరికొందరు కులం కూడు పెడుతుందని భావిస్తున్నారు. మరికొందరు లాబీయింగ్‌తో నెట్టుకుని రావచ్చనే భ్రమలో ఉన్నారు. అధికారం లేని సమయంలో అందరినీ ఆత్మీయంగా పలకరించినట్లు నటించిన వారు, క్రమశిక్షణ, అవినీతి రహిత వ్యక్తిగా బిల్డప్ చేసుకున్న వారు నేడు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వారసత్వాలు సహకరించవని ప్రగల్భాలు పలికిన వారు ఇప్పుడు వారసుల పేరుతో రివ్యూ మీటింగులు ఏర్పాటు చేసి పెత్తనం చెలాయిస్తున్నారు. ఇది శోచనీయం.

పార్టీ కోసం పని చేసిన వారికి ఎక్కడా సీట్లు కేటాయించలేదు. ఎలాంటి పదవులు దక్కలేదు. కేవలం ఇద్దరు ముగ్గురికి మాత్రమే పార్టీ పదవులు ఇచ్చారు. మిగతా వాళ్లంతా వీధి పాలైపోయారు. ఒక్కొక్క నాయకుడి ఒక్కో స్టైల్. ఒకరు 'నేను మాత్రమే సీనియర్' అనే అహంకారం, మరొకరు 'నేను మాత్రమే ప్రభావం చూపగలను' అనే మనస్తత్వం, ఇంకొకరు 'నేను మాత్రమే లాబీయిస్ట్' అనే భ్రమలో ఉన్నారు. ఆ నాయకుడి వద్దకు వెళ్తే 'నా వద్దకు రావద్దు, నా వాళ్లు అటు వెళ్లొద్దు' అని కఠిన షరతులు వేస్తున్నారు. దీంతో క్యాడర్‌కు ఊపిరి ఆడడం లేదు. పదేళ్లు వర్ధిల్లే పార్టీని పాతాళానికి తొక్కే విధంగా కొందరు నాయకుల తీరు ఉంది. దీంతో పార్టీపై ఉన్న ప్రేమ, సానుభూతి తగ్గుతోంది.

నిర్విరామంగా పని చేసిన వాళ్ల గతి ఇంతేనా? ఇరవై నాలుగు గంటలు పని చేసి, అన్నం నీళ్లు మానుకుని కష్టపడ్డ వారిని వీధి పాలు చేస్తే.. వీళ్లను నమ్ముకుని ఎక్కువ చేస్తే వచ్చే కిరీటం ఏమీ లేదు. ఉన్నన్ని రోజులు ఇక్కడ ఎంజాయ్ చేద్దాం.. ఆ తర్వాత మళ్లీ ఎవరు వస్తే వాళ్లతో సహజీవనం చేద్దాం అనే ఆలోచనలో వలస వాదులు ఉన్నారు. ఇన్నాళ్లు కష్టపడి తెచ్చిన వెలుగుల్లో చీకటి పొరలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే మూడు సంవత్సరాలు కావస్తున్నా కనీసం పదవులు ఇవ్వకుండా ఎవరు అర్హులో గుర్తించలేని స్థితి. ఈగోలకు వెళ్లి సామాన్యులకు పెద్దపీట వేసే మనస్తత్వం లేని వ్యక్తుల వల్ల పదవులు ఖాళీగా పడి ఉన్నాయి.

ఖమ్మం జిల్లాలో మళ్లీ కాంగ్రెస్ పాలన రావడం ఖాయం. కానీ నాయకుల ధోరణి మారాలి. పార్టీ కోసం పని చేసిన వారి జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలి. వలస వచ్చిన వారు రేపు వలస వెళ్లిపోతే ఎవరు దిక్కు? అనేక మంది త్యాగాలపై భోగాలు అనుభవించే వారు బాధ్యతను విస్మరించకుండా ప్రజా నాయకులుగా పేరు తెచ్చుకోవాలి. లేకపోతే టీఆర్ఎస్‌ను మించిన అపజయం మూటకట్టుకోవాల్సి వస్తుందని గత చరిత్ర హెచ్చరిస్తోంది. ఇప్పటికైనా పాత కార్యకర్తలను గుర్తించి వారి త్యాగాలకు గౌరవం ఇవ్వాలని సామాన్య కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## చిన్నారి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ముఖ్యమంత్రి స్పందించి ఘటనపై చర్యలు చేపట్టాలి : సీపీఎం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి):**
నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రెండేళ్ల దళిత చిన్నారి అనుమానాస్పద మృతి అత్యంత విషాదకరమని, చిన్నారి మృతిపట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులకు సిపిఎం తరఫున సానుభూతిని తెలియజేసారు. తక్షణమే ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. కొందరు పెత్తందారులు కుమ్మెర కొండ పై ఆలయాన్ని తమ గుప్పిట్లో ఉంచుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. కుల వివక్షతో దాడులకు పాల్పడుతున్నారనీ, ఈ ఘటనలో చిన్నారి తల్లి కీర్తి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా, దాడి చేసిన పెత్తందారులు ఇచ్చిన ఫిర్యాదు నే ముందుగా పరిగణనలోకి తీసుకోవడం వారి కుల వివక్ష పూరిత వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. చివరకు ప్రజాసంఘాల పోరాటం తర్వాత నిన్న సాయంత్రం కేసు నమోదు చేసారనీ అన్నారు. రాష్ట్రంలో మహిళలు, సామాజిక న్యాయం ప్రశ్నార్థకంగా మారాయనడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. బాధితుల ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన ఎస్ఐ, ఇతర సిబ్బంది పై విచారణ జరిపి విధుల్లోంచి తొలగించాలని, తన తల్లి, తమ్ముడిని కొట్టిన నిందితుల నుండి బాధిత పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి మృతికి కారణమైన దోషులను వెంటనే అరెస్టు చేసి, హత్య కేసులు నమోదు చేయాలనీ, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 ఫిబ్రవరి 2026

# ఖబర్దార్ అగ్రకుల ద్రోహుల్లారా!

- నాగర్ కర్నూల్‌లో చాకలి కులస్తులపై అగ్రకుల నేతల దాడి 2 నెలల పసికందు మృతి
- తీవ్రంగా ఖండించిన అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



**బోడుప్పల్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 366వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మూర గ్రామంలో ఆలయ ప్రవేశం వివాదంలో చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ,మౌనికలపై తుకారం రెడ్డి సతీష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మధు రెడ్డి అనే అగ్రకుల వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది ఆ ఘటనలో 2 నెలల పసిబిడ్డ మృతి చెందడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య స్పందిస్తూ 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో అగ్ర కుల అహంకారంతో ఇంకా కుల వివక్షత,దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ప్రపంచంలోనే ఉత్తమ రాజ్యాంగం గల ప్రజాస్వామ్య భారతదేశంలో ఇలాంటి ఘటనలు తీవ్ర విచారకరమని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితాన్ని త్యాగం చేసి అందించిన రాజ్యాంగ ఫలాలు ప్రతి భారతీయుడికి సమానంగా అందాలి, కానీ అగ్రవర్ణాల ఆదిపత్యం ఉన్నంతవరకు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని, ఇలాంటి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నత్తి మైసయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎ స్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికల రవీందర్, రాపోలు శ్రీరాములు,సిరిసిల్ల సాగర్, యూనివర్సిటీ పీహెచ్డీ స్టూడెంట్ వడ్డీ ఎల్లన్న, గరుగుల యాకయ్య, శ్రీరాముల జ్ఞానేశ్వర్, సింగర్ ఉదయ్, చిల్ల అంజయ్య, సగ్గు నరసింహ, ఏ రాజేష్, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో శిక్షణతో భవితకు రక్షణ

- క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
- క్రీడాకారులకు బెల్ట్ లు, సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం
- మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి
- శివమ్ హై స్కూల్ చైర్మన్ గూలి శివకుమార్, మాస్టర్ మనోహర్



**తాండూరు ఫిబ్రవరి 22(జనంసాక్షి) :** విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటు వారు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు తైక్వోండో లాంటి సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శివమ్ హై స్కూల్ లో తైక్వోండో క్రీడాకారులు అబ్రాహార్, అబ్దుల్, ఆమ్రపాలి, మణికంఠ, వైష్ణవి, శ్రీ రామ్ లకు బెల్ట్ లు, సర్టిఫికెట్స్, మెడల్స్ లని ప్రదానం చేశారు.బెస్ట్ ఫైటర్ అవార్డ్ పొందిన మాస్టర్ కుసాల్, ప్రశాంత్.ఉన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో శిక్షణతో భవితకు రక్షణగా ఉంటుందని, నేర్చుకుంటున్న బాలికల్లో మనోధైర్యం పెరుగు అవుతుందని తెలిపారు. ఎలాంటి ఘటనలు ఎదురైనా ఎదు ర్కొంటామనే ధీమా వారికి వస్తుందని అన్నారు. క్రీడా కారుల తల్లితండ్రులు పిల్ల లకు తై క్వోండో నేర్పించాల్సిన అవసరం ఉందని సూచిం చారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగు తాయని వివరించారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు.కార్యక్రమంలో కోచ్ లు కుశల్, ప్రశాంత్, ఇబ్రహీం, తైక్వాండో క్రీడాకారులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

### పార్టీలకు అతీతంగా ప్రజా అభిమానం

# చూరగొన్న నేత కల్లెం నవజీవన్ రెడ్డి




**హయత్ నగర్, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** హయత్ నగర్ పాత గ్రామంలో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి ని కాస్ బాగ్ గ్రామ యువత ఘనంగా సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఒక్కచోట చేరి శాలువాలు, గజమాలతో సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా సమస్యల పరిష్కారం లో ఎప్పుడూ ముందుండి స్పందించడం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, అవసరమైన సమయంలో ప్రతి ఒక్కరికీ అండగా నిలవడం వంటి సేవలను గుర్తిస్తూ, ఈ సన్మానం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపిన నిబద్ధతకు కృతజ్ఞతగా ప్రజలు తమ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కల్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ "ఎలక్షన్స్ సమయంలో మాత్రమే పార్టీలు ఉంటాయి, ఎన్నికలు పూర్తయ్యాక మనమందరం ఒకే కుటుంబ సభ్యులం, గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని అన్నారు. ప్రజల విశ్వాసమే తనకు గొప్ప బలం అని, ఎప్పటికీ అందుబాటులో ఉంటూ హయత్ నగర్ పాత గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా వ్యక్తమైన ఈ ప్రజాభివందనం ఆయనపై గ్రామ ప్రజలకు ఉన్న ప్రేమ, నమ్మకానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ గ్రామస్తులు బండారి భాస్కర్, ఉగాది ఎల్లప్ప, చెన్నగౌని రవీందర్ గౌడ్, చెన్నగౌని శ్రీధర్ గౌడ్, నడిగొట్టి స్వామి, జెల్ల నర్సింహా, జగదీష్, నరేష్ గౌడ్, శివ, చంటి, బాలు, వినోద్, సాయి గౌడ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# వారాంతపు సంతలు మానవీయ కోణమా? ప్రజా సమస్యా?

- ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- బిల్డింగ్ యజమానులు వసూళ్లు
- అధికారుల నిర్లక్ష్యం



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 22 (జనం సాక్షి) :** వారాంతపు సంతల పేరుతో ప్రధాన రహదారుల లో నిర్వహిస్తున్న కూరగాయల వ్యాపారం మొదలుకొని వివిధ రకాల వ్యాపారాలతో ప్రధాన రహదారులలో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టిని కేంద్రీకరించక పోవడం కేవలం మానవీయ కోణమా? లేదా వేరే మతలబు ఏమైనా ఉందా? అనే పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒకవేళ మానవీయ కోణమైతే కేవలం అక్కడ వ్యాపారాలు నిర్వహించేవారు మాత్రమే మానవులు కాదు. వారు నిర్వహిస్తున్న వ్యాపారం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు కూడా సమాజంలో భాగమే. అనే విషయం అధికారులు స్పష్టంగా గుర్తించవలసిన అవసరం ఉంటుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జగద్గిరిగుట్ట, షాపూర్ నగర్, గాజుల రామారం ,ఆల్విన్ కాలనీ, పాపిరెడ్డి నగర్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న వారాంతపు వ్యాపారాల వలన ఈ రహదారుల గుండా ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వ్యాపారం చేసేవారు పేదవారే ఉండొచ్చు? కానీ పేదవారైనా,ధనికులైన రహదారులను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించడం అనేది చట్టరీత్య నేరం. ఇది జగమెరిగిన సత్యం. ఇందులో ఇంకో ఆర్థిక సత్యం దాగి ఉంది. నిజానికి వారు నిర్వహి స్తున్న వ్యాపారం రోడ్లపైనే. ఇది ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన ఆస్తి కాదు. కానీ ఆ రోడ్ల ఇరువైపులా ఉన్న బిల్డింగ్ యజమానులు వారి ఇండ్ల ముందు వ్యాపారాలు చేస్తుండడం వలన తోపుడు బండ్ల వారి వద్ద నుండి పెద్ద మొత్తంలోనే డబ్బులను వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సొమ్మొకడిది సోకొకడిది అనే విధంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న బిల్డింగ్ యజమానులు రెండు చేతుల డబ్బులను సంపాదిస్తున్నారు. అసలే రోడ్డుపైన బిల్డింగ్ నిర్మాణం, ఆపై ముందు షెడ్డు, దాని ముందు తోపుడుబండ్ల లో నిర్వహిస్తున్న వ్యాపారస్తుల నుండి డబ్బులు రెండు చేతుల సంపాదించడం వలన వారు సైతం ఎలాంటి అభ్యంతరాలు తెలియకపోవడం వలన ప్రధాన రహదారులలో వారాంతపు సంతలు కాదు వాహనదారులను నిరోధించే సంతలు నిర్మోహమాటంగా కొనసాగుతున్నాయి. కేవలం ఒక కిలోమీటర్ దూరం వెళ్లడానికి ఎలాంటి ఇతర ట్రాఫిక్ సమస్యలు లేకుండా కేవలం వారాంతపు సంతల వలన ఒక గంట వ్యవధి పడుతుంది. దీనిపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. అనే ప్రశ్న ప్రతి వాహనదారుని మదిలో మెదులుతోంది. నో పార్కింగ్‌లో వెహికల్ పార్కు చేసామని వందల రూపాయలను పెనాల్టీ రూపంలో విధిస్తున్న అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇంతమంది వాహనదారులకు ఆటంకాన్ని కల్పిస్తున్న వారాంతపు సంతల వ్యాపారస్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే ప్రశ్న ప్రతి వాహనదారునికి వస్తుంది. వారాంతపు సంతలలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు పేదవారే కావచ్చు? అందులో ఎలాంటి సందేహం లేదు. వారికి ప్రత్యామ్నాయంగా గల్లీ రోడ్డులలో అవకాశాన్ని చూపించి ప్రధాన రహదారులపై విక్రయాల ను చేయకుండా చూడవలసిన బాధ్యత ట్రాఫిక్ అధికారులపై ఉంటుంది. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం అధికారులు చొరవ తీసుకొని నియంత్రణ చేపట్టకపోతే సామాన్య ప్రజలు ఎవరితో చెప్పుకోవాలి? ఇది అందరికీ కనిపిస్తున్న సమస్య. అయినా అధికా రులు సమస్య పరిష్కారం కోసం ఎందుకు ముందుకు రావడం లేదు. ఇది మరో ప్రశ్న. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారులలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలను నిరోధించవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# అమెరికాలో.. మహాభారతం నాటి త్రీడీ చిత్రం

### చిత్రీకరించి అమెరికన్లను ఆకట్టుకున్న త్రీడీ ఆర్టిస్ట్ కృష్ణ

**మంథని, ఫిబ్రవరి 22 (జనం సాక్షి):** అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో ప్రతి సంవత్సరం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే లేక్ వర్క్ బీచ్ స్ట్రీట్ పెయింటింగ్ ఫెస్టివల్ లో ఈసారి దాదాపు 850 మంది ఆర్టిస్టులు పాల్గొన్నారు. అందులో మన దేశం నుంచి కేవలం కృష్ణ మాత్రమే ఎంపిక చేసి ఆహ్వానించారు. 850 లో టాప్ 50 ఆర్టిస్టులలో కృష్ణ ని కూడా ఎంపిక చేసి, ఫీచర్డ్ ఆర్టిస్ట్ గా గౌరవించారు. 21, 22 తేదీలలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో కృష్ణ మొదటి రోజు మహాభారతం లోని మయసభ లో ప్రస్తావించబడిన మాయాకొలను ను చిత్రీకరించారు. ఈ మధ్య ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రసిద్ధి చెందుతున్న ఈ త్రీడి ఆర్ట్ మన మహాభారతంలోనిదేనని, అందుకే ఈ మాయకొలనుని చిత్రీకరించానని కృష్ణ తెలిపారు. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అనే విషయాన్ని తను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ, దేశగొప్పదనాన్ని విదేశాల్లో చాటడం తనకు గర్వంగా ఉంటుందని తెలిపారు. కృష్ణ వేసిన త్రీడి ఆర్ట్ చూసి, అమెరికా వాళ్ళు చాలా ఆశ్చర్యపోయారు. తనను ఆహ్వానించిన ఈవెంట్ ఆర్గనైజర్స్ సుజానే, షరాన్ లకి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఫ్లోరిడా లోని కల్చరల్ కౌన్సిల్ లో కృష్ణ త్రీడి చిత్రాల ప్రదర్శన, అమెరికా రోడ్ పైన త్రీడి స్పీడ్ బ్రేకర్ వేయడం, త్రీడి ఆర్ట్ పైన అవగాహన కల్పించడంలాంటి కార్యక్రమాలకి అవకాశం ఉంది.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



**ఉప్పల్ ఫిబ్రవరి 22 ( జనం సాక్షి ):** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ను కలిసి వినతిపత్రం సమర్పించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను సమగ్రంగా అందజేశారు. ఎన్నో కాలనీలలో రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నాయ ని, తాగునీరు, వర్షపు నీటి కాలువలు, కమ్యూనిటీ హాల్స్ వంటి మౌలిక సదుపాయాల కొరత ఉందని వివరించారు.ఉప్పల్ సర్కిల్ పరిధిలో చిలకనగర్ డివిజన్‌లో గణేష్ దేవాలయం సమీపంలోని రాఘ వేంద్ర కాలనీలో కల్వర్ట్ నిర్మాణం అవసరమని, సీతారామా కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. బీరప్పగడ్డ ప్రాంతంలో గౌడ్స్ మరియు విశ్వకర్మ శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రామంతాపూర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ విస్తరణ, నిర్మాణ పను లు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బీరప్పగడ్డ, చిలుకానగర్, ఉప్పల్ డివిజన్లలో దెబ్బతిన్న సీసీ రోడ్లను పునర్నిర్మించాలని, రామంతాపూర్ భగాయత్ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.కాప్రా సర్కిల్ పరిధిలో ఉషోదయ సూపర్ మార్కెట్ ఎదుట వినాయక్ నగర్ ఫేజ్-IIలో సీసీ రోడ్డు, దర్శిని స్కూల్ నుండి యెల్లారెడ్డిగూడా పాత గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. యెల్లారెడ్డిగూడా శ్మశానవాటిక వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణం, సాయిబాబా ఆలయం సమీపంలో బాక్స్ డ్రెయిన్ ఏర్పాటు, బోడ్రాయి సమీపంలో జీ ప్లస్ వన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శాలివాహన కాలనీ తల్లా బావి వద్ద ఓపెన్ జిమ్ మరియు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. చర్లపల్లి డివిజన్‌లో నాగార్జున నగర్, శివ సాయి నగర్ కాలనీల శ్మశానవాటికలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాసవి శివ నగర్ కాలనీలో సీనియర్ సిటిజన్ భవనం నిర్మాణం అవసరమని తెలిపారు. హెచ్‌బి కాలనీ డివిజన్‌లో మంగాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బాక్స్ డ్రెయిన్, బక్షిగూడ శ్మశానవాటిక వరకు 60 అడుగుల రహదారిపై సీసీ రోడ్డు వేయాలని కోరారు.మల్లాపూర్ డివిజన్‌లో బీరప్పగడ్డ పాత గ్రామంలోని ఈరమ్మ గుడి వరకు, న్యూ నరసింహ కాలనీ మరియు శాంతి నగర్ ప్రాంతాల్లో, అలాగే పటాన్ బస్తీ జామా మసీదు నుండి మల్లాపూర్ పాత గ్రామం వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని వివరించారు. అదనంగా నోమా ఫంక్షన్ హాల్ నుండి గాంధీ విగ్రహం వరకు ఆర్‌సీసీ పైప్‌లైన్, సీసీ రోడ్డుపనులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్ పబ్లిక్

# పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 66,148 మంది 1వ సం., 69,050 మంది 2వ సంవత్సరం విద్యార్థులు
- 151 పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు
- కాపీయింగ్ నివారణకు స్పెషల్ స్క్వాడ్స్

మేడ్చల్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం పరీక్షలకు 64,780 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,368 మంది ప్రైవేట్ అభ్యర్థులు కలిపి మొత్తం 66,148 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 67,792 మంది రెగ్యులర్, 1,258 మంది ప్రైవేట్ కలిపి 69,050 మంది హాజరుకానున్నారు. మొత్తం 151 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ నివారణ చర్యలు, టాయిలెట్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్, విద్యుత్ సరఫరా వంటి అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేశారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో హెచ్‌పీసీ, డీఈసీ, సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురా వాలని, పరీక్షా సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించా రు. పరీక్షా సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధమని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

# క్వారీ సమస్యలను పరిష్కరించండి

### స్టోన్, క్వారీ అసోసియేషన్ సభ్యుల వినతి.



**తాండూరు ఫిబ్రవరి 22(జనంసాక్షి) :** క్వారీ సమస్యలను పరిష్కరించాలని ఎంపి కోండ విశ్వే విశ్వేశ్వర్ రెడ్డి నిస్టోన్ మరియు క్వారీ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం తాండూరు మండలం జీను గుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందీపని గురుకు లం ఆవరణలో పలు భవనాలను ప్రారంభోత్సవం, శంకుస్థాపనల కార్యక్రమానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , కేంద్ర మంత్రి భూపతి రాజ్ శ్రీనివాస్ వర్మ , ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి , బాగయ్య ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓగిపూర్ గనులను మైనర్ మైనింగ్ గా గుర్తించమని అందుకుగాను ఈ విషయాన్ని పార్లమెంట్లో మాట్లాడవలసిందిగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రావూఫ్, వైస్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్ సోమాని,కార్యదర్శులు జుబేర్ పాషా కుంచం మురళీధర్ ,కోశాధికారి మహ్మద్.జైనుద్దీన్ ,తదితరులు ఉన్నారు.

# కంబైన్ డ్యూటీని రద్దు చేసి, అధిక పని భారం తగ్గించాలి

- పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ (పిజెసిఎ) నాయకుల డిమాండ్




**ముషీరాబాద్ ఫిబ్రవరి 22 (జనం సాక్షి):** కంబైన్ డ్యూటీ విధానాన్ని రద్దుచేసి అధిక పని భారం తగ్గించాలని పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ (పిజెసిఎ) తెలంగాణ సర్కిల్ నాయకులు ఎం మధుసూదన్ రావు, ఎం కృష్ణ, ఎస్ కె లాలూ, మహ మ్మద్‌లు, పోస్టల్ ఎంప్లాయిస్ తెలంగాణ రాష్ట్ర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్, ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద జాయింట్ కౌన్సిల్ ఆఫ్ ఆల్ ఇండియా యాక్షన్ పోస్టల్ యూనియన్, నేషనల్ యూనియన్ పోస్టల్ ఎంప్లాయిస్, భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియే షన్ పలు పోస్టల్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఆధ్వర్యంలో పోస్ట్ మెన్, ఎంటిఎస్ తెలంగాణ సర్కిల్ సిబ్బంది భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్( పిజెసిఎ) నాయకులు, పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ సెలవు తో పాటుగా ఖాళీ పోస్టులను కంటిజెంటులను తక్షణమే నియమించాలన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు ప్రారంభించిన డెలివరీ సెంటర్ లకు ఈ బైకులను వెంటనే ఇవ్వాలనీ, డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం పని భారాన్ని లెక్కించాలనీ డిమాండ్ చేశారు. అన్యాయ మైన పని ఒత్తిడి, అసాధ్యమైన టార్గెట్లను నిలిపివేయాలన్నారు. పోస్ట్‌మెన్, ఎంటిఎస్ సిబ్బందిపై వేధింపులు, అనవసరమైన ఒత్తిడిని ఆపాలనీ, ఇప్పటివరకు పని చేసిన కంటిజెంట్స్‌కు వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. సొంత వాహనాలు వినియోగించిన పోస్ట్ మాన్ లందరికీ పెట్రోల్ బిల్స్, మొబైల్ బిల్స్ చెల్లించాలన్నారు. రైన్ కోట్, బ్యాగ్, షూస్ , డెలివరీ కి అవసరమైన అన్ని వసతులు కల్పించి, పోస్ట్ మెన్, ఎం టి ఎస్ సిబ్బందికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పోస్టల్ అనుబంధ సంఘాల నాయకులు అశోక్, సిహెచ్ వెంకటయ్య, వై ప్రసాద్, శ్రీకాంత్, రావుఫ్, శ్రీనివాస చారి, శ్రవణ్ కుమార్, వెంకన్న, ఎం కిషోర్, ఎం వెంకటేశ్వరరావు, జై కిషన్, పోస్టల్ ఎంప్లాయిస్ పోస్ట్ మ్యాన్, ఎంటీఎస్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఇవాళ (ఆదివారం) మధ్యాహ్నం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న కార్లు, బైకులను ఢీకొట్టింది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబు



**మంథని, ఫిబ్రవరి 22 (జనం సాక్షి):** మంథని నియోజకవర్గం పరిధిలో పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్, పాలకుర్తి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహాముత్తారం, మహదేవ్ పూర్, మల్హర్ రావు, పలిమెల మండలాలకు అనారోగ్యాల బారిన పడి చికిత్స పొంది ప్రభుత్వ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న 266 మంది పేదలకు ఒక కోటి 9 వేల రూపాయలు విలువచేసే చెక్కులను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. మంథని మండలం - సీఎంఆర్ఎఫ్ (43 చెక్కులు) - 15,35,000, ముత్తారం మండలం - సీఎంఆర్ఎఫ్ (31 చెక్కులు) - 12,01,000, రామగిరి మండలం - సీఎంఆర్ఎఫ్ (44 చెక్కులు) - 14,19,000, కమాన్ పూర్ మండలం - సీఎంఆర్ఎఫ్ (23 చెక్కులు) - 7,45,500, పాలకుర్తి మండలం - సీఎంఆర్ఎఫ్ (8 చెక్కులు) - 2,79,500, ఇతర మండలాల - సీఎంఆర్ఎఫ్ (19 చెక్కులు) - 17,07,500, కాటారం మండలం - సీఎంఆర్ఎఫ్ (28 చెక్కులు) - 6,54,000, మహాముత్తారం మండలం - సీఎంఆర్ఎఫ్ (16 చెక్కులు) - 5,54,000, మహదేవ్ పూర్ మండలం - సీఎంఆర్ఎఫ్ (36 చెక్కులు) - 13,37,000, మల్హర్ రావు మండలం - సీఎంఆర్ఎఫ్ (15 చెక్కులు) - 4,79,000, పలిమెల మండలం - సీఎంఆర్ఎఫ్ (03 చెక్కులు) - 99,000 మంజూరు కావడం జరిగింది. మంథని నియోజకవర్గంలోని పలు ఆస్పత్రిలలో అనారోగ్యంతో చికిత్స పొంది సహాయం కొరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వీరికి ప్రభుత్వం నుండి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేపించారు. ఈ చెక్కులను రేపటి నుండి ఫోన్ చేసి మీ ఊరి వద్దకు వచ్చి ఇవ్వడం జరుగుతుంది లేదా అందుబాటులో లేనివారు మంథని మంత్రి క్యాంప్ కార్యాలయంలో తీసుకోవచ్చని మినిస్టర్ పిఏ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు.




# తెలంగాణ ఆత్మను చాటిన 'గాడ్స్ ఇన్ ది వాయిస్'

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఒగ్గు కథ ఇంగ్లిష్ డాక్యుమెంటరీ ట్రైలర్ రిలీజ్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఒగ్గు కథను ప్రపంచానికి చాటేలా, తెలంగాణ ఆత్మను ఆవిష్కరించేలా "గాడ్స్ ఇన్ ది వాయిస్" డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ రూపొందించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో డాక్టర్ జి. కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న "గాడ్స్ ఇన్ ది వాయిస్" టీజర్ ను కవిత లాంచ్ చేశారు. తెలంగాణ ఒగ్గు కథను అద్భుతమైన డాక్యుమెంటరీగా తెరకెక్కిస్తున్న కుమారస్వామితో పాటు మూవీ టీమ్ ను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, మూవీ యూనిట్ సభ్యులు ప్రొఫెసర్ జోలి పోతుసెర్రి, మేఘా యాదవ్, మహేశ్వర్, జయదేవ్ యాదవ్, సాయి రుద్రకాంత్, తిరుపతి యాదవ్, కవిత యాదవ్, రాజ్ కుమార్, శ్రీణిక, గనికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



మేడ్చల్ (జనంసాక్షి) : శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌లో 7వ తరగతి విద్యార్థి శ్రీనాథ్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం హాస్టల్ గదిలో విద్యార్థి ఎస్ శ్రీనాథ్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించగా, తోటి విద్యార్థులు వెంటనే సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని అత్యవసర చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన శ్రీనాథ్ గత సంవత్సరం ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ నుంచి హకీంపేటకు బదిలీ అయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి హుటాహుటినా ఆసుపత్రికి చేరుకుని డాక్టర్లతో, విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థి చికిత్సకు ఎంతటి ఖర్చు అయిన ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు జరిపి నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు.

## మంటలు ఆర్పుతుండగా పేలిన గ్యాస్ సిలిండర్


- ఫైర్ సిబ్బంది, పోలీసులతో సహా 13 మందికి గాయాలు



న్యూఢిల్లీ (జనంసాక్షి) : ఒక ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మంటలు ఆర్పుతుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ నేపథ్యంలో ఫైర్ సిబ్బంది, పోలీసులతో సహా 13 మందికి కాలిన గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని మజ్లిస్ పార్క్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. ఆదివార ఉదయం 9 గంటల సమయంలో ఆదర్శనగర్‌లోని ఒక ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా, ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పుతుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మంటలు ఆర్పుతున్న వారిలో ఐదుగురు ఫైర్ సిబ్బంది, అక్కడ ఉన్న ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. మరోవైపు గాయపడిన వారిని తొలుత చికిత్స కోసం బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్య చికిత్స కోసం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అగ్నిప్రమాదం కారణంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ వెల్లడించారు.

# నేటి నుంచి ఐసెట్ అభ్యర్థులకు డిజిటల్ పాఠాలు


- టీశాట్ ప్రసారాలు ప్రారంభం




హైదరాబాద్ (జనంసాక్షి) : పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టీశాట్నె ట్వర్క్ తెలంగాణ ఐసెట్ 2026 పరీక్షలకు సైతం డిజిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎంబిఎ, ఎంసిఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నుండి ప్రసారాలు మొదలవుతాయన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2026 మే 13,14 వ తేదీన జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్ లో ఉదయం ఐదు నుండి ఆరు గంటల వరకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయి సీఈవో వివరించారు. తెలంగాణాలోని విద్యార్థులు టీశాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# ములుగు అభివృద్ధికి మరో ముందడుగు

- లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం పునరుద్ధరించండి
- గోదావరి నది కుడి కాల్వపై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మించండి
- ములుగు జిల్లా రైతుల పక్షనా సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించిన మంత్రి సీతక్క




ములుగు (జనంసాక్షి) : ములుగు జిల్లా దేవాదుల పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క వినతిపత్రం సమర్పించారు. గోదావరి నది రైట్ బ్యాంక్ పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేయాలని, అలాగే కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తూపాకులగూడెం, దేవాదుల పరిసర గ్రామాల్లోని చెరువులకు నీరందించేందుకు ఈ ప్రతిపాదిత పథకం కీలకంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేయకుండా నిలిచిపోయిన లక్ష్మీపురం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణతో పాటు, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద గోదావరి బ్యాక్ వాటర్‌ను వినియోగిస్తూ కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ పథకం ద్వారా మొత్తం 921 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రణాళికను సీఎం కు అందచేశారు. లక్ష్మీపురం ఎత్తిపోతల 2007లో నిర్మాణం పూర్తి అయినప్పటికీ, గోదావరి ప్రవాహ మార్పులు, ఇసుక పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ఆ పథకం నిరూపయోగంగా మారిందని...దాన్ని ఉపయోగంలోకి తెచ్చేలా మార్పులు చేయాలని మంత్రి సీతక్క సీఎంను విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలుతో చిన్న, అంచున రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి, భూగర్భ జలాల పునర్వ్యవస్థీకరణ, తాగునీటి లభ్యత పెంపు, రైతుల సామాజిక–ఆర్థిక స్థితి మెరుగుదల సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా తక్షణ పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని సీఎంను మంత్రి సీతక్క కోరారు. మంత్రి విజ్ఞప్తి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలో ఇరిగేషన్ శాఖలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కొండాపూర్‌లో 7 ఎకరాలను కాపాడిన హైడ్రా

- రూ. 1400ల కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : కొండాపూర్‌లో 7 ఎకరాల మేర ఉన్న పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా శనివారం కాపాడింది. వీటి విలువ రూ. 1400ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. అలాగే పాఠశాలకు దాదాపు ఎకరా స్థలం,పార్కుల కోసం ఎకరాకు పైగా కేటాయించారు. పాఠశాలకు కేటాయించిన స్థలంలో 1000 గజాల మేర అపార్టుమెంట్‌ను నిర్మించేశారు. కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాలను కేటాయించారు. ఇలా కేటాయించిన భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని వెంటనే కాపాడి రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో కాలనీ సంక్షేమ సంఘం కోరింది. ఈ భూముల ఆక్రమణల వెనుక బడాబాబులున్నారని ఫిర్యాదు చేసింది. పలు షోరూంలతో పాటు.. కిరాణా జనరల్ స్టోర్‌లు వచ్చాయని.. రహదారులు కూడా ఆక్రమణలకు గురౌతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. యూఎల్సీ భూములలోని లే ఔట్లో ప్లాట్లు ఎల్ ఆర్ ఎస్ అయ్యాయి. పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎల్ ఆర్ ఎస్ అవ్వకుండా ఆక్రమణదారుల సొంతం ఎలా అవుతాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. అవి పార్కులాగాను ప్రజావసరాల స్థలాలగానే ఉపయోగపడాలని కోరారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా నిర్ధారించుకుంది. పార్కు స్థలంలో ఇప్పటికే వెయ్యి గజాల మేర అపార్టుమెంట్ రాగా.. కమ్యూనిటీ స్థలంలో ప్రైవేటు షాపులు, షెడ్డులు వేసినట్టు గుర్తించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు.. అక్కడి నివాసితులకే చెందాలనే ఉద్దేశంతో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీంతో రాజరాజేశ్వరి నగర్ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య హైడ్రాతో పరిష్కారం అయ్యిందని సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యార్థినిపై అత్యాచారం

- ఐదుగురు టీచర్లు అరెస్ట్

భువనేశ్వర్ (జనంసాక్షి) : స్కూల్ టీచర్లు ఒక బాలికను లైంగికంగా వేధించారు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థిని కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు టీచర్లను అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 13 ఏళ్ల బాలిక ఒక ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నది. అయితే ఆ స్కూల్‌కు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు చాలా కాలంగా ఆ విద్యార్థిని లైంగికంగా వేధిస్తున్నారు. ఆ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఈ విషయాన్ని తన కుటుంబానికి చెప్పింది. దీంతో ఫిబ్రవరి 19న ఆమె కుటుంబ సభ్యులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆశ్రయించారు. ఆ కమిటీ ప్రాథమికంగా దర్యాప్తు చేసింది. బాలిక ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు జరుపాలని పోలీసులు, జిల్లా విద్యాశాఖ అధికారిని కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశించింది. మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, బాలిక తండ్రి ఫిర్యాదుపై రాజ్‌కనికా పోలీస్ స్టేషన్ అధికారి స్పందించారు. బాధిత బాలిక స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. వైద్య పరీక్షల తర్వాత లైంగిక దాడిపై కేసు నమోదు చేశారు. నిందితులైన ఐదుగురు టీచర్లను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ముదిరాజుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి వాకిటి శ్రీహరి



శంషాబాద్ (జనంసాక్షి) : ముదిరాజుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శంషాబాద్‌లోని సిద్ధాంతిలో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ సమాజంలో మార్పు ప్రారంభమైందని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు సముచిత న్యాయం జరగాలంటే 42 శాతం రిజర్వేషన్లు అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం సమాజం మొత్తం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక విధానం రూపొందించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 90కి పైగా ఉన్న బీసీ కులాలు ఐక్యతతో ముందుకు సాగాలని, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కమ్యూనిటీ భవనాలు దోహదపడాలని మంత్రి అభిప్రాయపడ్డారు.

### శంషాబాద్ లో ముదిరాజ్ భవనం ప్రారంభం

రాబోయే బడ్జెట్‌లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. కోకాపేటలో నిర్మించనున్న ముదిరాజ్ భవనానికి కూడా తగిన నిధులు కేటాయించాలని కోరనున్నట్లు చెప్పారు. శంషాబాద్‌లో ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ మంత్రి ధన్యవాదాలు తెలిపారు. శంషాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మెరుగు సురేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బి ఆర్ ఎస్ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి, శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి తన్విరాజు ముదిరాజ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ తీరు రాజ్యాంగ విరుద్ధం


- ఏఐ సమ్మిట్‌లో అపోజిషన్ లీడర్‌కి అవకాశం ఇవ్వలేదు
- మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.మనుమంతరావు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీజేపీ వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.మనుమంతరావు అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో అపోజిషన్ లీడర్‌కు అవకాశం ఇవ్వలేదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన ఢిల్లీలో జరిగిన ఏఐ సదుస్సుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రకారం పవర్‌లో ఉన్నవారికి, అపోజిషన్ లీడర్‌కు సమాన హోదా ఉంటుందని అన్నారు. ఇప్పుడు బీజేపీ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీజేపీ వైఖరిని ప్రజలు ఇప్పుడు కాకున్న రేపైనా తిరస్కరిస్తారని వెల్లడించారు. ఇందిరా గాంధీ ఆలోచనలు ఇంప్లిమెంట్ చేసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని, పంచాయతీరాజ్ ఎన్నికల్లో మహిళలకు అవకాశం ఇచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. తెలంగాణలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా కుల గణన జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ పై అన్ని విధాలా కృషి చేశారని ఆయన తెలిపారు. తెలంగాణలో చైర్మన్, మేయర్, ఉప సర్పంచ్ అంటూ మహిళలకి రిజర్వేషన్ కల్పించామని వెల్లడించారు. రాజీవ్ గాంధీ ఆలోచనలని రేవంత్ రెడ్డి ముందుకు తీసుకొని పోతున్నారని చెప్పారు. డీసీసీల ట్రేడింగ్‌లో పని చేసే వాళ్ళకి పదవులు అని సీఎం చెప్పడం అభినందనీయమని అన్నారు.

## రచయిత బొగ్గుల శ్రీనివాస్‌ది సుపారీ హత్యే

- తేల్చిన ఖమ్మం పోలీసులు



ఖమ్మం (జనంసాక్షి) : ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్‌ది సుపారి హత్యేనని ఖమ్మం పోలీసులు తేల్చారు. అతడిది సాధారణ మరణం కాదని, పక్కాగా ప్లాన్ చేసిన సుపారీ హత్య అని ఖమ్మం పోలీసులు నిర్ధారించారు. బొగ్గుల శ్రీనివాస్ హత్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలేనని స్పష్టం చేశారు. నిందితులు శ్రీనివాస్‌ను హతమార్చిన తర్వాత, ఆ మృతదేహాన్ని పాలేరు రిజర్వాయర్‌లో పడేశారని పేర్కొన్నారు. అయితే ఈ మొత్తం తతంగాన్ని ఓ కారు ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు విఫలయత్నం చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడు వేణుమాధవ రెడ్డితో సహా నలుగురిని కూసుమంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇక బొగ్గుల శ్రీనివాస్ గతంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై ఒక పుస్తకాన్ని రచించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన హత్యకు ఈ పుస్తకానికి ఎలాంటి సంబంధం లేదని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక పరమైన గొడవలే శ్రీనివాస్ హత్యకు దారితీశాయని ఆయన క్లారిటీ ఇచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370